# మా ఇంటి రామాయణం

## హాస్య కథల సంపుటి



పొత్తూరి విజయలక్ష్మి

# MAA INTI RAMAYANAM

A Collection of Short Stories

By **Pothuri Vijayalakshmi**

© P. Vijayalakshmi

*First Edition* : 2009

*Price* : Rs. **80/-** **$ 10**

*For Copies* :

**Navodaya Book House**
**Prajashakthi Book House**
**Vishalandhra Book House**
Hyderabad

*Book Production* :
**T. Muralidhar Gowd**
Cell:9393 176 552

*Typesetting*:
**K.B.T. Kondaiah**

*Printed at* :
**Vipla Computer Services**
(*Designers & Multicolour Offset Printers*)
Nallakunta, Hyderabad - 500 044
Ph : 040-2767 6910, 2765 4003

*Published by* :
**Pothuri Vijaya Lakshmi**
*Sri Rishika Publications*
Flat No. 201; Vikasini Apartments
2-21121/3, New Nallakunta,
Hyderabad - 500 044



శ్రీమతి సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ హైదరాబాద్‌వారి
ఆర్థిక సహాయంతో ప్రచురితం



# పదునైన హాస్యం

తెలుగులో హాస్యం రాసేవాళ్ళు బహుతక్కువ. ఇప్పుడు నడుస్తున్న ఉద్యమాల నేపథ్యంలో హాస్యం రాయడం, రాసి తిట్లు తినకుండా, ఎవర్నీ బాధించకుండా, మెప్పించడం కష్టం కూడా. అయినా పట్టువదలని విక్రమార్కుల్లా కొందరు హాస్యమే రాస్తున్నారు (నాతో సహా). అలాంటి వారిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గ కథకులు సోమరాజు సుశీలగారు, పొత్తూరి విజయలక్ష్మిగారు (ఇటీవల పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ హాస్యం పండిస్తున్నారన్న విషయం తెలుగు సాహిత్యలోకం గమనించవలసింది). సోమరాజు సుశీలగారు ఇప్పటికే మూడు పుస్తకాలు ప్రచురించి, పాఠకుల హృదయాల్లో తిష్ట వేసేసుకున్నారు. విజయలక్ష్మిగారు తన కథల్ని రహస్యంగా పత్రికలకు పంపి, ప్రచురించినపుడు సంతోషించి, పాఠకులు వాటిని మెచ్చుకుని, పొరబాటున ఆ ప్రశంస తనదాకా వస్తే, సంతృప్తిపడి ఊరుకుంటూ వుంటారు. ఎట్టకేలకు ఆ కథలన్నిటితో ఓ పుస్తకం వేయడం కూడా సాధ్యమేనని వారికి తోచింది. అందుకు వారికి అభినందనలు. దీనికి సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ వారు ఆర్థిక సహాయం మంజూరు చేయడం మరో మంచి విషయం.

సాహిత్యంలో హాస్యం ప్రధానంగా రెండు రకాలు: మొదటిది స్వచ్ఛమైన హాస్యం; అంటే ఎవ్వరినీ ఎక్కువగా నొప్పించని, అందరినీ నవ్వించే హాస్యం. ఒకరకంగా చెప్పాలంటే మునిమాణిక్యం, మొక్కపాటి, ముళ్లపూడి మార్కు హాస్యం. మరొకటి అధిక్షేప హాస్యం - దీనికి కూడ అందరూ నవ్వవచ్చునుగానీ, అందులో ఎందరికో ఏదో గుచ్చుకునేది వుంటుంది. గురజాడ, పానుగంటి, కె.ఎన్.వై. పతంజలి వంటి వారి హాస్యం ఇది. రెండో రకం హాస్యం వల్ల సామాజిక ప్రయోజనం ఉంటుంది. మొదటి రకం హాస్యం ప్రత్యేకించి ప్రయోజనాన్ని ఆశించేది కాదు. అంత మాత్రాన దానివల్ల ప్రయోజనం లేదని కాదు; కానీ ఆ లక్ష్యంతో మాత్రం ఆ రచయితలు రాసినట్లు కనిపించదు.

సోమరాజు సుశీల, విజయలక్ష్మిగార్లది ఎక్కువగా ముళ్లపూడి తరహా హాస్యమే. కానీ ఈ సంపుటిలోని కొన్ని కథల్లో మాత్రం విజయలక్ష్మిగారిలోని అధిక్షేప దృష్టి చక్కగా ఆవిష్కృతమైంది. అలాంటి కథలే ఎక్కువ బాగున్నాయి. ఆధునిక జీవితంలోని ఎన్నో విషయాలను ఆమె సునిశితంగా విశ్లేషించారు. వీటన్నిటినీ ప్రధానంగా భార్యాభర్తల సంబంధాల నేపథ్యంలో హాస్య గుళికల్లా తీర్చిదిద్దడం ఆమె ఎంచుకున్న శిల్పం. నిజానికి

కథల్లోని వస్తువులు అసాధారణమైనవి కావు; కానీ, మనం నిత్యం చూసే వాటిని, నిత్యం అనుభవించే ఇబ్బందులను కాస్తంత సెన్సాఫ్ హ్యూమర్‌తో చూడగలిగితే జీవితాన్ని భరించడం ఇంకా సుళువవుతుందని ఈ కథలు చెప్తాయి. ఇప్పటి సమాజాన్ని, ప్రపంచీకరణ ఫలితాలను, కృత్రిమ జీవితాలను, తెచ్చి పెట్టుకున్న ఆధ్యాత్మికతను - అందరం తిట్టుకునేవాళ్ళమే. కానీ మళ్ళీ మనమందరం అందులో భాగస్వాములం కూడా. ఎవ్వరం దాన్ని మార్చడానికి ప్రయత్నించం; మనం మారడానికీ ప్రయత్నించం. 'If you can't change them, join them' అన్న నానుడిని నిరూపించే కథ 'ది కటాస్'. నిత్యం బజార్లో లభించే సత్వర భోజనాలను చూసి అవాక్కయిపోయి, వాళ్ళు చేసుకుంటున్న లాభాల గురించి ఆడిపోసుకునే బదులు, మనమే సత్వర భోజనాలను తయారు చేసేస్తే పోలా? అన్న వేదాంతం ఈ కథలో ఉంది.

ఆడవాళ్ళు, వంటపనిమీద సీరియస్ రచనలు చాలానే వచ్చాయి (విమల కవితతో సహా). కానీ ఏళ్ళ తరబడి భార్య వండిపెడుతుంటే అందులోని శ్రమను అర్థం చేసుకోలేకపోయిన భర్త, తను వంట నేర్చుకోవాలనుకున్నప్పుడు అందులోని సాధక బాధకాలను అర్థం చేసుకుని, భార్యమీద గౌరవం పెంచుకున్న వైనాన్ని హాస్యంగా చెప్పిన మంచి కథ 'ప్రసాదరావూ-వంటసరస్వతీ'. ఇటీవల తామర తంపరగా పెరిగిపోయిన ఆధ్యాత్మిక గురువులను అపహాస్యం చేసే కథ 'వైరాగ్య స్థితి'. కథలో కొత్తదనం లేదు గానీ, చెప్పిన విధానం బాగుంది.

సరదాగా ఉన్నా, గొప్ప వాస్తవాన్ని చెప్పిన కథ 'ఔను వాళ్ళిద్దరూ కథ రాసారు'. జీవితంలో ఎప్పుడూ కలం పట్టని భార్యాభర్తలు కలిసి కూర్చుని ఒక కథను రాసి బహుమతి కోసం పంపడం ఇందులో ఇతివృత్తం. ఈ కథ సంభాషణాగత హాస్యానికి చక్కని ఉదాహరణ. దానికంటే ముఖ్యం - ఒక విషయాన్ని గురించి స్త్రీలు ఎలా ఆలోచిస్తారు, పురుషులు ఎలా ఆలోచిస్తారు అనే తేడాను చిత్రించడం, స్త్రీల రచనలు, పురుషుల రచనలు అనేవి ఉండవు, సాహిత్యమంతా ఒక్కటే అనుకునే వారికి ఈ కథ చురక అంటిస్తుంది. వీళ్ళిద్దరి దృక్పథాల్లోని వైరుధ్యాన్ని సరదాగా చెబుతూనే, మనల్ని ఆలోచింపజేస్తుంది.

ఆధునిక జీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించే విజయలక్ష్మి కథల్లో 'అప్పిచ్చువాడు వైద్యుడు' కూడా ఒక మంచి కథ. మనందరికీ కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రైవేటు బ్యాంకులు మధ్యతరగతి మనిషి మీద చూపించే అవ్యాజ ప్రేమ అనుభవంలో ఉన్నదే. దీన్ని వ్యంగ్యంగా వ్యాఖ్యానించే కథ ఇది.

అత్తలూ, కోడళ్లు పరమ శత్రువులనే భావజాలాన్ని మాసిపోయేలా చేయడానికి స్త్రీలు నిరంతరం శ్రమ పడుతూనే ఉన్నారు. దానికి నిదర్శనం ఈ సంపుటిలోని కథ,



'మా ఇంటి రామాయణం'. కోడలు, అత్తగారు ఒక్కటై, మామగారి దౌర్జన్యాన్ని ఎదిరించే ఇతివృత్తం వల్ల ఈ కథ మంచి ప్రయోజనాన్ని సాధించింది. అత్తగారు ఇంతకాలం కోల్పోయినదేమిటో అర్థం చేసుకుని, ఆ కోల్పోయిన ఆనందాన్ని అందించడానికి ప్రయత్నించిన కొత్తతరం కోడలు అందరికీ ఆదర్శప్రాయమైందే ('వనిత' టెలివిజన్‌లో విజయలక్ష్మిగారు అందించిన అపురూపమైన హాస్య సీరియల్ 'జీనియస్ అత్త; ఇంటెలిజెంట్ కోడలు' చూడని తెలుగు ప్రేక్షకులు దురదృష్టవంతులని ఇందు మూలముగా తెలియజేయడమైనది). తీరని కోరిక, తిక్క కుదిరింది, భానుమతికి నివాళిగా రాసిన 'అత్తగారు-సీరియస్సూ' కథలు కేవలం సరదాకే. అయితే మొదటి రెండు కథల్లోనూ తెలుగువారిలో ఉన్న సినిమా పిచ్చిని రచయిత్రి బాగా ఆటపట్టించారు.

చాలా హాస్యభరితమైన సన్నివేశాలతో నడిచే 'తిక్క కుదిరింది'లో ఓ పురుషుడు తన జీవితం కూడా సినిమాలా గడవాలనే అత్యుత్సాహం ప్రదర్శిస్తే, సినిమా నటిని కావాలన్న అమ్మాయి కోరికను భర్త ఎలా తెలివిగా రూపుమాపేసింది చెప్పే కథ 'తీరని కోరిక'. ఇక 'ఇల్లు కట్టి చూడు', సమకాలీన జీవితంలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ మోసాల్ని కనువిప్పు కలిగించేలా చెప్పిన కథే గానీ, ఎందుకో ఈ సంపుటిలో ఇమడలేదనిపిస్తుంది. 'పెళ్ళి చూపులు', 'భాస్కరం-రూపాయి', 'ఇదో వింత', 'అమ్మో ఆదివారం' కేవలం హాస్యానికి రాసిన కథలు, అధిక్షేప దృష్టితో రాసిన కథలముందు కొంత వెలవెలబోతాయి. ఉబుసుపోకకు రాసినట్లున్న వీటిని గల్పికలు అనవచ్చు.

విజయలక్ష్మిగారిలో నిఖార్సయిన సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉంది. ఆమె కలంలో చక్కని చమత్కారం ఉంది. ఈ రెండింటినీ పదును పెట్టుకోవాలన్నా, వాటికి మరింత ప్రత్యేకతను తీసుకురావాలన్నా, వస్తువులో మరింత బలం ఉండడం అవసరం. ఆమె రచనలో ఎక్కువగా ఉన్నది సంభాషణాగత హాస్యం. విట్టు, రిపార్టీ వంటి హాస్య రచనా వ్యూహాల్లో రాణించే కలం ఆమెది. కనుక, సమకాలీన, నగర జీవనంలోని మరిన్ని భ్రష్టుపట్టిన విషయాలను మరింత హాస్యంగా కథనం చేసి, తెలుగు సాహిత్యంలో ఈనాడు హాస్యాన్ని నిలబెడుతున్నది స్త్రీలేనని ఇంకా సమర్థంగా నిరూపించగలరని ఆశిస్తున్నాను.

- మృణాళిని

# నవ్వుతూ బతకాలి

అవును అందరూ ఉన్నంతలో నవ్వుతూ బతకాలి. అదే నా జీవితాశయం. అందుకే ఎక్కువగా హాస్యరచనలే చేశాను. ప్రతిరోజు కాసేపు నవ్వుకుంటే ఆరోగ్యం చాలా బావుంటుందిట.

హాస్యం నవ్వుకునేందుకు బాగానే వుంటుంది కానీ, హాస్యం రాస్తే పేరు ప్రఖ్యాతులు రావు. ఎక్కువకాలం నిలబడదు. కర్పూరంలా ఒక్క వెలుగు వెలిగి ఆరిపోతుంది అంటారు కొందరు. నాకా పోలిక ఎంతో ఇష్టం. పవిత్రమైన ప్రదేశంలో ఒక్క వెలుగు వెలిగి ఆ కాసేపట్లోనే తన అస్తిత్వాన్ని చాటుకుని అందరిచేతా నమస్కారాలు అందుకుంటూ ప్రకృతిలో లీనమై తన చిన్న జీవితాన్ని సార్థకం చేసుకుంటుంది కర్పూరం. అటువంటి కర్పూరంలో హాస్యాన్ని పోలిస్తే అంతకంటే గౌరవం మరొకటి వుంటుందా! హాస్యం రాయడం కష్టం అనికూడా అంటారు. కష్టమో నిష్ఠూరమో ఒకసారి ఒక మార్గాన్ని ఎంచుకున్న తరువాత ఆ మార్గంలో చివరిదాకా నడవటంలోనే ఎంతో తృప్తి వుంది. అందుకే ఈ హాస్య ప్రస్థానం.

నా ఈ హాస్య కథా సంపుటికి సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్‌వారి ఆర్థిక సహాయం అందటంతో నా ఆత్మవిశ్వాసం మరింతగా పెరిగింది. ఈ సందర్భంలో వారికి నా కృతజ్ఞతలు.

ఇంత కాలం నా కథలు పుస్తకరూపంలో తేవాలనుకుంటూనే ఇదుగో మాధవా అదుగో మాధవా అని వాయిదాలు వేశాను. ఇప్పుడు మూడు కథా సంపుటాలు ఒకేసారి పాఠకుల ముందుంచుతున్నాను. ఈ కథా సంపుటి పేరు "మా ఇంటి రామాయణం". "చంద్రహారం", "ఆనందమే అందం" మిగిలిన రెండూ.

ఈ సంపుటిలోని కథలను ప్రచురించిన ఆయా పత్రికలవారికీ, ముందుమాట రాసి ఇచ్చిన ప్రముఖ రచయిత్రి, నాకు ఆత్మీయురాలు డా॥ సి. మృణాళిని గారికి కృతజ్ఞతలు.

ఈ కథలను డిటిపి చేసిన శ్రీ కె.బి.టి. కొండయ్యగారికి, ముద్రణ బాధ్యతలు నిర్వహించిన 'పుస్తక రూపశిల్పి' శ్రీ తాళ్లపల్లి మురళీధర గౌడుగారికి, అందంగా ముద్రించి సకాలంలో అందించిన విప్ల కంప్యూటర్ సర్వీసెస్ అధినేత శ్రీ ఎం. విజయసేనారెడ్డి గారికి ధన్యవాదాలు.

నా రచనలను ఆదరించి నన్ను ఒక హాస్య రచయిత్రిగా నిలబెట్టిన పాఠకలోకానికి శిరసువంచి నమస్కరిస్తున్నాను. మీ అందరి ఆదరాభిమానాలతో మరిన్ని మంచి రచనలు చేయగలనని నా నమ్మకం.

సెలవు

**పొత్తూరి విజయలక్ష్మి**



# కథా క్రమం


1. మా ఇంటి రామాయణం -------------------- 09
2. ది కటాస్ ------------------------------ 22
3. అత్తగారూ-స్వర్గంలో సీరియస్సూ.... ------------- 29
4. అవును వాళ్ళిద్దరూ కథ రాశారు ---------------- 39
5. ప్రసాదరావూ-వంటసరస్వతీ ------------------ 46
6. అప్పిచ్చువాడు-వైద్యుడు ------------------ 53
7. వైరాగ్యస్థితి ------------------------------ 60
8. ఇదో వింత ------------------------------ 66
9. తిక్క కుదిరింది ---------------------------- 71
10. ఇల్లు కట్టి చూడు ------------------------- 78
11. భాస్కరం-రూపాయీ ------------------------ 86
12. తీరని కోరిక ---------------------------- 90
13. పెళ్ళిచూపులు -------------------------- 102
14. అమ్మో! ఆదివారం!! ----------------------- 112

# మా ఇంటి రామాయణం

తెల్లవారింది.

నిద్రలేచాను.

ఆదివారం కాబట్టి నేను బద్ధకించినా దుర్గ మాత్రం మామూలుగానే లేచినట్లుంది.

లేచి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లాను.

అమ్మ సోఫాలో కూర్చుని ఉంది. నాన్నగారు చిరాగ్గా పచార్లు చేస్తున్నారు.

"అలా గుమ్మటంలా కూర్చోకపోతే, లేచి పలహారం ప్రయత్నం చెయ్యకూడదూ!" అన్నారు విసుగ్గా.

"చెయ్యడానికి నాకేం అభ్యంతరం లేదు. కాని పర్యవసానం ఆలోచించండి" అంది అమ్మ.

"అంత బతుకూ బతికి ఇంటి వెనకాల చచ్చినట్లు అయింది నా పని. అందుకే అన్నారు పెళ్ళంటే ఇటు ఏడు తరాలూ ఇటు ఏడు తరాలూ చూడమని. ఎత్తెత్తి కాలు ఎంగిలాకులో వేసినట్లు ఏరి కోరి ఓ కొరివిని తెచ్చుకున్నాను. మరీ అదుపూ ఆజ్ఞా లేకుండా ఎలా పెంచుతారో ఆడపిల్లలని! డిగ్రీలమీద డిగ్రీలు చదవగానే సరా! కాస్త వినయం విధేయతా వుండద్దూ, ఆ మధ్యవర్తి మాధవరావుగాడిని పట్టుకుని మాడు పగలగొట్టాలి. ఇంతోటి సంబంధం కుదిర్చినందుకు వాడికి జరీ పంచెల చాపు కూడా కట్టబెట్టాను."

నాన్నగారి వాగ్ధాటికి దుర్గ రాకతో అంతరాయం కలిగింది.

మెళ్ళో సెల్‌ఫోన్. చేతుల్లో టిఫిన్ పేకెట్లు.

"వేడిగా వున్నాయి టిఫిన్లు. ఆలస్యం చేస్తే చల్లారిపోతాయి రండి" అంది. టేబుల్ మీద అన్నీ సర్దేస్తూ.

నేనూ, అమ్మా డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్ళాం. నాన్నగారు చిరాగ్గా వచ్చి చి(రున కుర్చీ లాక్కుని కూర్చున్నారు.

ఇడ్లీ రుచి చూసి, "రాళ్ళలా వున్నాయి - ఇంట్లో చేస్తే దూదుల్లా వుంటాయి" అన్నారు.

"పుస్తె కట్టిన భార్యలాగా హోటలు వాడెందుకు చేస్తాడు? అయినా బానే వున్నయ్ ఇడ్లీలు..." అంది దుర్గ.

సగం ఇడ్లీ తిని దోసె అందుకున్నారు నాన్నగారు. రుచి చూసి, "నా శార్ధంలా వుంది" అన్నారు.

"మరీ విచిత్రం కాకపోతే దోసె దోసెలా కాకపోతే దిబ్బరొట్టె లాగానో, మాడిపోయి పెంకులాగానో వుంటుందిగా శార్ధంలా ఎలా వుంటుందండీ" అంది దుర్గ.

"ఇదుగో అమ్మాయ్, నువ్వు హద్దులు మీరుతున్నావు" అన్నారు.

"నాకే హద్దులూ లేవు. మీరడానికి. మీరే హైరానా పడిపోతున్నారు" అంది దుర్గ, తాపీగా టిఫిన్ తింటూ.

నాన్నగారు తగవుకి దిగారు. ఇద్దరూ ఏకమై ఇంగ్లీషు తెలుగూ భాషల్లో నువ్వెంత అంటే నువ్వెంత అని వాదించుకుంటున్నారు.

నేనూ అమ్మా వింటూ కూర్చున్నాం.

మేం చెప్పినా వాళ్ళు వినరు. ఇద్దరికీ క్షణం పడదు. మా పెళ్ళయిన దగ్గర్నుంచీ ఇదే వరస.

నా పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టగానే నాకు ఉద్యోగం చేసే అమ్మాయి కావాలని చెప్పాను. అలాగే అన్నారు నాన్నగారు. అమ్మ మాత్రం, "ఉద్యోగం ఎందుకులేరా? చదువుకున్నదయితే చాలదూ" అన్నది.

"ఇంకా నయం ఏ రోజుల్లోవున్నావు? భార్య ఉద్యోగం చేస్తే భర్తకి అండ. ఇంట్లో వుండి ఏం చేస్తుంది? - నీలాగా ప్రాణాలు కొరుక్కుతింటుంది" అన్నారు నాన్నగారు.

దుర్గ సంబంధం మా అందరికీ నచ్చింది. తనూ నాలాగే హైటెక్ సిటీలోనే పనిచేస్తోంది. ఇద్దరం కలిసి మాట్లాడుకున్నాం. అందం కంటే కూడా దుర్గ వ్యక్తిత్వం బాగా నచ్చింది నాకు.



మా పెళ్ళయిపోయింది.

హనీమూన్‌కి వెళ్ళేముందే నన్ను పక్కకి పిలిచారు నాన్నగారు.

"ఒరే అబ్బాయ్. ఏదో పెద్ద చదువు చదివి ఉద్యోగం చేస్తోంది కదా అని చనువిచ్చి నెత్తికెక్కించుకోకు. తర్వాత ఏకు మేకై కూర్చుంటుంది" అని హెచ్చరించారు.

కానీ అప్పటికే పరిస్థితి చెయ్యి జారిపోయిందని ఆయనకు తెలియదు.

దుర్గ కాపురానికి వచ్చింది. ఓ వారం రోజులు గడిచేసరికి చిరాకు పడడం ప్రారంభించింది.

"ఇలా వుంటారేం మీ తండ్రీకొడుకులు?" అంది.

"ఎలా వుంటాం?" అన్నాను.

"పందిరి గుంజల్లా పాతుకుపోయి వుంటారు. కాలూ చెయ్యీ కదల్చరేం?" అంది.

"ఏమో మరి. మొదటి నుంచీ మేమింతే" అన్నాను.

నేను చెప్పింది యథార్థమే. నేనూ, మా నాన్నా కూర్చున్న చోటినుంచీ కదలం. మా అమ్మే అన్నీ అందిస్తుంది. మాకు ఆ పద్ధతి బాగానే వుంది. కానీ దుర్గకి నచ్చలేదుట.

"అత్తగారు కాఫీ కలిపితే వంటింట్లోకి వెళ్ళి తెచ్చుకోలేరా, హాల్లోకి అందించాలి. తాగాక ఆ కప్పు తీసుకెళ్ళి వంటింట్లో పెట్టలేరా? మీరు కాస్త ముందుకి వంగి నేల మీదైనా పెడతారు. మీ తండ్రిగారికి ఆ మాత్రం నడుం కూడా వంగదు. కప్పు ఖాళీ చేసి 'ఇదుగో ఏవోయ్ నిన్నే' అని అరుస్తారు. ఆ కప్పు రావణాసురుడి ఆత్మలింగమా? భూమ్మీద పెడితే అతుక్కుపోతుందా? ఆవిడ అష్టావధానం చేస్తూ వంటింట్లోంచి వచ్చి అందుకునే దాకా అలా అరుస్తూనే వుంటారు. ఇక తెల్లవారిన దగ్గర్నుంచి వేవిళ్ళ భాగ్యశాలి లాగా వెయ్యి కోరికలు. 'పెసరట్లలోకి అల్లం పచ్చడితోపాటు కొబ్బరి పచ్చడి కూడా చేసేయ్. ఉత్త పప్పులోకి వూరు మిరపకాయలు వేయించి, పులుసులోకి గుమ్మడి వడియం వేయించు' అంటూ ఆవిడని వేపుకు తింటారు. మీరు తెమిలి ఆఫీసులకి వెళ్ళేసరికి ఇల్లు రణరంగంలా వుంటుంది. పాపం ఆవిడ వంగీ లేచీ సూర్య నమస్కారాలు చేసినట్లూ ఇల్లంతా సర్దుకుంటుంది. చేసిన ప్రతి పనికీ వంకలు పెట్టి సాధిస్తారు ఏవిటిదంతా?" అంది విసుగ్గా.

"ఏమో సుమా! మా ఇంట్లో ఇంతే. చిన్నప్పుడు మా బామ్మ కూడా ఇలాగే చేసేది. ఇంకా మా నాన్నగారు నయం. మా తాతగారైతే చింతకాయ పచ్చట్లో మెంతులు మాడ్చి చావ బెట్టావు. వొళ్ళు కొవ్వెక్కిందా అని తిట్టేవారు" అన్నాను కించిత్తు గర్వంగా.

"చెప్పుకునేందుకు సిగ్గు లేకపోతే సరి. ఆవిడ కాబట్టి వూరుకుంది. నేనైతే ఆ చింతకాయ పచ్చడి తీసి ఆయన మొహాన పిడక కొట్టినట్లు కొట్టేదాన్ని" అంది దుర్గ.

"ఇష్షూ తప్పు కాదూ ఇలా అనకు. నాన్నగారు వింటే బాధపడతారు" అన్నాను.

వింటేగా మరో వారం చూసి నాన్నగారి మీదనే ధ్వజం ఎత్తింది.

"ఎంత చేసినా ఆవిడనలా వేధిస్తారేం?" అంది.

నాన్నగారికి చాలా కోపం వచ్చింది. "మా పద్ధతులింతే. అయినా నిన్నగాక మొన్న వచ్చిన కోడలివి నీ కోసం మేమంతా ఎందుకు మారాలి? నువ్వే నీ పద్ధతి మార్చుకో" అన్నారు.

"ఏదైనా మంచి పద్ధతులైతే నేనూ నేర్చుకుని నా అలవాట్లు మార్చుకునేదాన్ని. ఇక్కడ ఏం నేర్చుకోను? రాతియుగం పద్ధతులు నడుస్తున్నాయి ఇక్కడ" అంది దుర్గ.

"రాతియుగమో, కలియుగమో మేము ఇంతే. అయినా కందకు లేని దురద కత్తిపీటకి అని సామెత చెప్పినట్లు మీ అత్తగారికి లేని బాధ నీకెందుకు?" అన్నారు నాన్న.

"ఈ ఇంటికొచ్చిపడ్డాను కాబట్టి. అత్తని కాల్చుకుతిన్న కొంపలో కోడలు సుఖపడుతుందా అని సామెత చెప్పినట్లూ రేపు నన్నూ ఇలానే కాల్చుకుతింటారని నా భయం" అంది దుర్గ.

"ఆ సామెత నేనెక్కడా విన్లేదు" అన్నారు నాన్న.

"వినే అవకాశం లేదు లెండి. నేనే కనిపెట్టాను" అంది దుర్గ.

"అతితెలివి అంటే ఇదే" అన్నారు నాన్న.

వ్యవహారం ముదరడంతో అమ్మ కలగ చేసుకుంది.

"ఎందుకమ్మా నీకీ విషయాలన్నీ. నీ పని నువ్వు చూసుకో చాలు. ఇంటి గొడవంతా నేను చూసుకుంటాను" అంది.

"అసలు దీనికంతటికీ కారణం మీరు? వీళ్ళకి చాకిరీ చేసి చేసి మీరూ ఓ యంత్రంలా తయారయిపోయారు. ముందు మిమ్మల్ని బాగు చెయ్యాలి" అంది దుర్గ.

"దాన్నలా వుండనీ. దానికి నీ హితబోధలేం అక్కర్లేదు" అన్నారు నాన్నగారు.

"ఏం మీ అబ్బాయికి మీరు హితబోధ చెయ్యలా నన్ను చెప్పు చేతుల్లో పెట్టుకోమని" అంది దుర్గ.



గతుక్కుమన్నారు నాన్నగారు.

"ఆ విషయం నీ కెవరు చెప్పారు?" అన్నారు.

"ఎవరో ఎందుకు చెస్తారు? మీ అబ్బాయే చెప్పారు" అంది దుర్గ.

"చెప్తే చెప్పాను. పెద్ద.ముండావాడిని. కొడుక్కి ఆ మాత్రం చెప్పతగనా?" – సమర్థించుకున్నారు.

"అదే నేనూ చెప్పేది. సాటి ఆడది మా అత్తగారు. ఆవిడ అవస్థలు పడుతూంటే పిల్లముండాదాన్ని కాస్త మాట సాయం చేస్తే తప్పా?" – దుర్గ కూడా సమర్థించుకుంది.

నాన్నగారికి చిర్రెత్తుకొచ్చింది.

"పెద్దంతరం చిన్నంతరం లేదా! ఇలా ఎలా పెంచాడు మీ నాన్న" అన్నారు.

"అడిగి తెలుసుకోండి" అని వెళ్ళిపోయింది దుర్గ.

మర్నాడే మా మామగారినీ, అత్తగారినీ పిలిపించారు నాన్నగారు. విషయం అంతా చెప్పి, "మీ అమ్మాయిని మందలించండి" అన్నారుట.

దానికి మా మామగారు నీళ్ళు నమిలి, "బావగారూ అల్లుడికి సూటూ బూటూ కొనివ్వమనండి ఇస్తాను. మిమ్మల్నీ, అక్కగారినీ పండక్కి పిలవమనండి పిలుస్తాను. అంతేగానీ ఈ గురుతర బాధ్యత నా మీద పెట్టకండి. నా కూతుళ్ళిద్దరూ మొదటి నుంచీ ఇంతే. ఇంకా ఇది కాస్త నయం. మా పెద్దమ్మాయి శాంభవి వుందే అది మరీ గయ్యాళి" అన్నారు.

"ఇంకా నయం – అదృష్టవశాత్తు ఆవిడ మా ఇంటి కోడలు కాలేదు. అయివుంటే నేనీ పాటికి అనాథాశ్రమంలో వుండేవాడిని" అన్నారు నాన్నగారు.

"అసలు ఇది వాళ్ళ తప్పు కాదులెండి బావగారూ. అప్పట్లో మా తండ్రిగారు రాజరాజేశ్వరీ పూజ చేసేవారు. అప్పుడు పుట్టిన ఆడపిల్లలు కదా వాళ్ళు. అందుకే ఆ ధైర్య సాహసాలు అలవడ్డాయి" అంటూ కూతుళ్ళని వెనకేసుకొచ్చారు.

"పోన్లెండి. అంతటితో సరిపెట్టారు. మీ తండ్రిగారు చండీ ఉపాసన చేసి వుంటే మీ ఇంట్లో భద్రకాళీ, జ్వాలాముఖీ మొదలైన మాతృకలు అవతరించి దేశం అంతా అల్లకల్లోలం చేసేవారు" – అన్నారు నాన్నగారు.

"బావగారు జోకేశారు" అని నవ్వేరు మామగారు.

"జోకా! నా పిండాకూడా! మీకేం 'అష్టవర్షా భవేత్కన్యా' అని ఆవుపాలతో అప్పగించి చేతులు దులుపుకున్నారు. నా పాట్లు నేను పడుతున్నాను" అని వాపోయారు నాన్నగారు.

వియ్యంకుడి వల్ల తనకే ఆసరాలేదని గ్రహించి తనే రంగంలోకి దిగారు.

"చూడమ్మాయ్. ఆడది ఇంట్లో పని చేసుకోవడం మన సనాతన ధర్మం. నీకు తెలుసో తెలియదో కార్యేషు దాసీ కరణేషు మంత్రీ అని చెప్పారు పెద్దవాళ్ళు. అందులోనూ మీ అత్తగారేం కష్టపడుతూ పనిచెయ్యడం లేదు. దానికి ఇల్లే వైకుంఠం" అన్నారు చాలా ప్రేమగా.

"నిజమే అనుకోండి. కానీ జీవితమంతా ఈ ఇంటికే అంకితం చేసేసింది - అదే నా బాధ. వంటా, పనీ, అటకలు సర్దడం, అలమార్లు సర్దడం - ఇదేనా ఆవిడ జీవితం?" నిలదీసింది దుర్గ.

"మరామాటకొస్తే నేను మాత్రం కష్టపడడం లేదా. అందరి చేతా మాటలు పడడం లేదా?" నాన్నగారి ప్రశ్న.

"పడుతున్నారు. కానీ మీకు ఓ గుర్తింపు వుంది. ప్రతిఫలం వుంది. ఆవిడకది లేదు" - దుర్గ సమాధానం.

"లేదని ఎందుకనుకుంటున్నావు? నెల జీతం అంతా తెచ్చి ఆవిడకే ఇస్తాను. నగలూ, చీరెలూ, కారూ, స్వంత ఇల్లు అన్నీ వున్నాయి. ఇంకేం కావాలి. దానికేం తక్కువ అయిందని నువ్వు బాధపడుతున్నావు" సూటిగా అడిగారు.

"అన్నీ వున్నా ఏదో వెలితి. మా ఆయన కంటే ఆవిడ ఇరవై ఏళ్ళు పెద్దది. అంటే ఆవిడ వయసు నలభై ఆరు. ఈ వయసుకే బోలెడంత విరక్తీ, వేదాంతం. 'నాదేముందమ్మా బతికినంతకాలం బతకబోతానా? ఏదో ఈ జీవితం ఇలా వెళ్ళ మారిపోతే చాలు' అంటూ వుంటుంది. ఆవిడ కంటే ఎనిమిదేళ్ళు పెద్ద అయిన మీరు వున్నంత ఉత్సాహంగా ఆవిడ ఉండడం లేదు. ఎందుకూ అనేదే నా బాధ" అంది దుర్గ.

"ఏమిటో గొడవ. నే చెప్పేది నీకూ అర్థం కాదు. నువ్వు చెప్పేది నాకూ అర్థం కాదు. ఏది ఏమైనా నువ్వు కాపురానికి వచ్చాక నాకు మనశ్శాంతి లేకుండాపోయింది" అన్నారు నాన్నగారు విసుగ్గా.

నవ్వేసి పూరుకుంది దుర్గ.

ఆ తర్వాత దుర్గ అమ్మతో ఎక్కువ సమయం గడుపుతోంది. అమ్మలో ఏదో మార్పు. అదివరకు లేనిది విసుగూ, చిరాకూ వచ్చాయి.

"అమ్మని ఏం చేస్తున్నావు దుర్గా" అని అడిగాను.



"నేనేం చెయ్యడంలేదు. నువ్వు దేవతవీ కాదు బానిసవీ కాదు అని తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాను" అంది.

ఆ రోజుల్లోనే తను బ్యూటీ పార్లర్‌కి వెళ్తూ అమ్మనీ వెంట తీసుకువెళ్ళింది.

అమ్మలో ఎంతో మార్పు! మరీ చిన్న దానిలాగా వుంది. యథాప్రకారం విసుక్కున్నారు నాన్నగారు.

"ఈ వయస్సులో ఏమిటీ వేషాలు? నలుగురూ చూస్తే ఏమనుకుంటారు?" అన్నారు.

"ఏమీ అనుకోరు. మహా అయితే మీది రెండో పెళ్ళి అనుకుంటారు" అంది దుర్గ నవ్వుతూ.

గతుక్కుమన్నారు నాన్నగారు. మర్నాటి నుండీ మార్నింగ్ వాక్ మొదలు పెట్టారు. నన్నడిగి నాలుగు టీ-షర్టులు కూడా కొనిపించుకున్నారు.

ఆ రోజుల్లోనే మరో సంఘటన జరిగింది.

అమ్మ పినతండ్రి కొడుకు కూతురి పెళ్ళి- కేరళలో, అవడానికి పినతండ్రి కొడుకే అయినా స్వంత అన్న కంటే ఎక్కువ మా అమ్మకి, పెళ్ళికి వెళ్తానంది అమ్మ.

"ఎలా వెళ్తావు? నాకు శలవు దొరకదు. బోలెడంత దూరం. నువ్వు వెళ్తే ఇంట్లో ఇబ్బంది కాదూ" అన్నారు నాన్నగారు అలవాటు ప్రకారం.

"సర్లెండి ఏం చేస్తాను - నాకు ప్రాప్తం లేదనుకుంటాను" అంది అమ్మ కూడా అలవాటు ప్రకారం.

కానీ దుర్గ పూరుకోలేదు. అమ్మని ప్రోత్సహించి ప్రయాణం చేయించింది. నాన్నగారు ఆఫీసు పని మీద టూర్ వెళ్ళి వచ్చేలోగా అమ్మని విమానం ఎక్కించింది.

నాన్నగారు కోప్పడ్డారు. "వద్దని చెప్పాగా? ఎందుకెళ్ళింది?" అని.

"ఆవిడ వెళ్ళలేదు. నేనే పంపించాను" అంది దుర్గ.

"పోన్లే ఈ సాకున విమానం ఎక్కింది మీ అత్తగారు. అసలు విమానం ఎక్కాలని దానికి చాలా సరదా. సంపాదించుకుంటున్న కోడలివి కదా అత్తగారిని విమానం ఎక్కించావు" అన్నారు నాన్నగారు.

"విమానం ఎక్కించింది నేనే అయినా డబ్బు మీదే" అంది దుర్గ.

అదిరి పడ్డారు నాన్నగారు.

"నా డబ్బా?" అన్నారు.

"అవును ఆయనెవరో అప్పు తీర్చాడని అత్తగారికిచ్చారటగా. అందులోంచి టికెట్టు కొన్నాను" అంది.

అగ్గీ బుగ్గీ అయిపోయారు నాన్నగారు.

"మనం తిన్నట్లా ఒకరికి పెట్టినట్లా? ఆఫ్ట్రాల్ పెళ్ళికి అంత డబ్బు తగలేసి పంపిస్తావా?" అన్నారు.

"తప్పేముంది మీరు వెళ్ళడం లేదా!, మేము వెళ్ళడం లేదా?" అంది దుర్గ.

"మనం వెళ్తున్నామంటే కంపెనీ భరిస్తోంది" విరుచుకుపడ్డారు నాన్నగారు.

"పోనీ ఎల్‌టిసి మీద వెళ్ళిందనుకోండి. ఇంతకాలం మీకు చేసిన చాకిరీకి ఆవిడ విమానం మీద కేరళ కాదు స్పేస్ షిప్‌లో అంతరిక్షానికి వెళ్ళవచ్చు" అంది దుర్గ.

ప్రతీదానికీ జమాఖర్చులు రాసుకునే అలవాటుగల నాన్నగారు మాత్రం ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోయారు.

డబ్బు పోయిందన్న బాధ. అమ్మలేక ఇంట్లో తిండీ తిప్పలూ సరిగ్గా అమరక చిరాకు, ఆ నాలుగు రోజులూ ఇల్లు నరకం చేసి పెట్టారు.

అమ్మ వచ్చింది. వచ్చీరాగానే పెళ్ళెలా జరిగింది అనైనా అడక్కుండా తిట్టిపోశారు. "నాకు మాట మాత్రం చెప్పకుండా అంత డబ్బు ఖర్చు పెట్టే అధికారం నీకెవరిచ్చారు?" అన్నారు.

కోడలి ముందు భర్త తననలా అవమానించేసరికి అమ్మ చిన్నబుచ్చుకుంది.

"ఏం మీరు చేసే ఖర్చులన్నీ అవసరమా? మీ వాళ్ళకి ఎన్నిసార్లు ఎంత డబ్బు ధారపొయ్యలేదు. అవన్నీ నన్నడిగే చేశారా? నాకున్నదంతా నీదే అంటారుగా. ఆ మాత్రం స్వతంత్రం నాకు లేదా?' అంటూ జీవితంలో మొదటిసారిగా నాన్నగారికి ఎదురు సమాధానం చెప్పింది అమ్మ.

ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. వారం రోజులు ఇద్దరికీ మాటల్లేవు.

ఆ సంఘటనతో నాన్నగారికి దుర్గ మీద చాలా ఆగ్రహం కలిగింది.

నన్ను పిలిచి, "అయిన భాగవతంచాలు. నీ భార్యని అదుపులో పెట్టుకోలేకపోతే తీసుకుని వేరే వెళ్ళిపో" అన్నారు.

ఆ మాటే దుర్గకి చెప్పాను.



మర్నాడు నాన్నగారిని నేరుగా అడిగింది.

"అవును నిజమే. వెళ్ళమన్నాను. అయినా దూరంగా వుంటేనే అభిమానాలు ఎక్కువ అవుతాయి" అన్నారు.

"సరే అయితే, ఆర్థికంగా అందరం బాగానే వున్నాం. బాగానే బతకగలం. కాబట్టి వేరు కాపురం వెళ్లడానికి నాకేం అభ్యంతరం లేదు" అంది దుర్గ.

"తెలివైన మాట చెప్పావు. ఎంతైనా చదువుకున్న దానివి కదా! ఇక్కడికి దగ్గర్లోనే మంచి పోర్షనుందిట. నువ్వూ వాడూ వెళ్ళి చూసి రండి. నచ్చితే అడ్వాన్స్ ఇచ్చి మంచిరోజు చూసి మారిపోండి" అన్నారు నాన్నగారు కోడలితో తొలిసారి సౌమ్యంగా మాట్లాడుతూ.

"అలాగే చూస్తాను. కాకపోతే వేరు కాపురం వెళ్ళేముందు ఒక వారం రోజులు నేనూ అత్తగారూ కలిసి వూరికి వెళ్ళొస్తాం" అంది దుర్గ.

"ఏ ఊరు?" అన్నాను నేను.

"మైసూర్. మా ఫ్రెండ్ పెళ్ళి. రమ్మని పిలుస్తోంది. వెళ్ళాలనుకుంటున్నాను. అత్తయ్యగారు కూడా వస్తే బావుంటుంది" అంది.

"విమానంలోనా?" అడిగారు నాన్నగారు భయంగా.

"కాదు రైల్లోనే. దానికి కూడా టిక్కెట్టు నేనే పెట్టుకుంటాను" అంది దుర్గ.

వేరు కాపురానికి ఒప్పుకుంది అంతే చాలనుకున్నారో ఏమో "వెళ్ళిరండి" అని వెంటనే పర్మిషన్ ఇచ్చారు.

అమ్మా దుర్గా మైసూర్ వెళ్ళిపోయారు.

మా పని అస్తవ్యస్తం అయిపోయింది. 'కాఫీ కాఫీ' అని కాకుల్లా అరవడం తప్పించి కాఫీ చెయ్యడం కూడా రాదు కూడా మాకు. కాఫీ చేసేసరికి ఇద్దరం నిజంగానే చేతులు కాల్చుకున్నాం.

రెండో రోజుకే హోటలు భోజనం మొహం మొత్తింది.

"డబ్బు తగలేసి గడ్డి తింటున్నాం. ఇదే సాంబారు మీ అమ్మ చేస్తే అమృతంలా వుంటుంది" అన్నారు నాన్నగారు.

"నిజమే. అమ్మ చేసిన పెసర పచ్చడితో అర్ధపావు బియ్యం అన్నం తినొచ్చు" అన్నాను నేను.

అమ్మనీ, అమ్మ సేవలనీ తల్చుకుంటూ కష్టం మీద కాలక్షేపం చేశాం.

అమ్మ, దుర్గ తిరిగొచ్చేశారు. మా ప్రాణం లేచివచ్చింది. ఆ సాయంత్రం అమ్మ నా దగ్గరకి వచ్చి కూర్చుంది.

"ఎలా జరిగిందమ్మా పెళ్ళి?" అన్నాను.

"అదే చెప్పాలిరా. పెళ్ళీ లేదూ పేరంటమూ లేదు. వూరికే అలా చెప్పిందిట. శృంగేరీ, మూకాంబిక, ఉడిపీ, బేలూరు, హళీబీడు అన్నీ చూసొచ్చేం. పెళ్ళికెళ్ళలేదని మీతో చెప్పవద్దని చెప్పింది. నాన్నగారితో చెప్పలేదులే. మనసూరుకోక నీకు చెప్తున్నా అన్నట్లొరే దుర్గ ఎంత మంచిదో కదూ. ఈ వారం రోజులూ నా ప్రాణానికి హాయిగా ఉందనుకో" అంది అమ్మ.

నాకు ఆశ్చర్యం వేసింది. దుర్గని అడిగాను. నవ్వి వూరుకుంది.

వారం రోజులయ్యాక, "మా కజిన్ అమలాపురంలో వుంది. ఎప్పటి నించో రమ్మంటుంది. రెండు రోజులు వెళ్ళొస్తాం" అంది దుర్గ.

"మహారాజులా వెళ్ళిరండి" అన్నారు నాన్నగారు తలనెప్పి నాలుగు రోజులైనా తగ్గుతుందన్న ఆశతో.

తీరా 'అత్తయ్యా నేనూ వెళ్తాం' అనేసరికి ఆయనకి కోపం వచ్చింది.

"ప్రతీసారీ అత్తయ్య ఎందుకూ నీవెంట తోకలా? నీ మొగుడున్నాడుగా వాడిని తీసికెళ్ళు" అన్నారు.

"సర్లెండి పిల్లలతో తిరణాలకీ, మొగుడితో పుట్టింటికీ వెళ్ళకూడదని చెప్పారు పెద్దలు. ఈయన్ని తీసికెళ్తే ఈయనకన్నీ అందించడంతోనే సరిపోతుంది. అత్తయ్యగారైతేనే సుఖం" అంది దుర్గ.

అమ్మ కూడా సంతోషంగా, "పోనీ నాల్రోజులు వెళ్ళొస్తాను. ఇన్నాళ్ళూ ఇల్లు కదలకుండానే గడచిపోయింది. ఇన్నాళ్టికి ఓ ఊరు తీసుకెళ్ళి ఓ వేడుక చూపించే మనిషి దొరికింది" అని పెట్టె సర్దేసుకుంది.

మేము వద్దంటూన్న వినకుండా వెళ్ళిపోయారు ఇద్దరూ.

"నాన్నా మళ్ళీ మనకు హోటలు తిండే గతి" అన్నాను.

"సిగ్గులేకపోతే సరి. అసలు దీనికంతటికీ కారణం నువ్వు. పెళ్లాన్ని అదుపులో పెట్టుకోరా అంటే విన్నావా? నీ పెళ్ళికాదు గానీ నా చావు కొచ్చింది" అన్నారు నాన్న.



చెప్పొద్దూ నాకూ కోపం వచ్చింది. అటు దుర్గా నన్నే అని, ఇటు ఈయనా నన్నే అంటే నేనేమైపోవాలి?

అందుకే, "చాల్లెండి పెద్దబడాయి – అక్కడికి మీ ఆవిడ మీ మాట వింటున్నట్లు. మీరొద్దన్నా వినకుండా వెళ్ళిందిగా అమ్మ" అన్నాను.

మరింత మండిపడ్డారు. మూడ్రోజులు నానా అవస్థ పడ్డాం.

అత్తాకోడలూ కోనసీమ చూసి తిరిగొచ్చారు.

"ఏదో మా కేరళ అని వాళ్ళు డప్పు కొట్టుకుంటున్నారుగానీ మన కోనసీమ కేరళకి ఎంత మాత్రం తీసిపోదు. కాకపోతే ఏ గుర్తింపు లేకుండా మూలపడుంది నాకు మల్లేనే" అంది అమ్మ వివరాలు చెపుతూ.

నాన్న గుర్రుగా చూశారు.

"అయ్యో ఇంకా మీరు అండమాన్ చూస్తే ఇంకెంత సరదాపడిపోతారో అత్తయ్యా" అంది దుర్గ.

"నిజంగానా దుర్గా. అంత బావుంటుందా అండమాన్? వెళ్దామా?" అంది అమ్మ.

"అలాగే వీలుచూసుకుని షిప్‌లో వెళ్దాం" అంది దుర్గ.

"షిప్ కూడా ఎక్కిస్తావా? నా తల్లే" అంది అమ్మ సంబరంగా.

"నీ సరదా మండిపోనూ. నాల్రోజులు ఊరిమీద తిరిగొచ్చి మీరు తిన్నారా చచ్చేరా అని మొగుడిని అడగడం పోయి మళ్ళీ ప్రయాణం కడతావు – బుద్ధుందా నీకు" అని తిట్టిపోశారు నాన్న.

"ఏం ఇన్నాళ్ళూ మీరు నన్నడిగారా తిన్నావా వున్నావా అని" అంది అమ్మ.

"నీకీ మధ్య తెలివి తేటలు ఎక్కువ అవుతున్నాయ్" అన్నారు నాన్నగారు.

"ఎక్కువ అవడంలేదు – వున్నవే బయటపడుతున్నాయ్" అంది దుర్గ.

"నువ్వూరుకో. ప్రతి దానికీ తగుదునమ్మా అని దూరిపోతావ్ అని విసుక్కున్నారు నాన్న.

అమ్మలో మార్పు చూసి భయం వేసిందాయనకి.

'అమ్మాయ్ మీ వేరు కాపురం వ్యవహారం ఏమైంది?" అని వెంటపడ్డారు.

"ఇల్లదీ చూసుకోవాలిగా" అని దుర్గ అంటే –

"నేను చూస్తా" అని పూనుకొని రోజూ తిరిగి ఇళ్ళు వెతికారు.

చివరికి ఓ ఇల్లు మా అందరికీ నచ్చింది.

"రేపు పంచమి పాలు పొంగించుకుని మారిపోండి" అన్నారు నాన్నగారు.

"అలాగే. మరి నా వెంట మా అత్తగార్ని తీసుకుపోతాను" అంది దుర్గ.

"అదా! అది ఎందుకొస్తుంది?" అన్నారు నాన్నగారు అయోమయంగా.

"ఏం వస్తే. కోడలింటికి అత్తగారు రాకూడదా?" అంది దుర్గ.

"అది నీ వెంట వస్తే నేనేమైపోవాలి?" అడిగారు, ఇంకా షాక్ నుంచీ తేరుకోకుండానే.

"సాయంగా మీ అబ్బాయిని వుంచుకోండి!"

"వాడా - వాడెందుకు నాకు?" అడిగారాయన.

"ఏం నెల తిరిగేసరికి ముప్పై వేలు సంపాదించి పెడతారు. మా అత్తగారు ఎందుకు మీకు? తిని కూర్చుని తిక్కపనులు చేస్తుందని మీరే పొద్దస్తమానం అంటారుగా. ఆవిడని నాతో పంపించండి" అంది దుర్గ.

"నువ్వు రమ్మన్నా అది రాదు? నీ ఎత్తులు దానికి తెలుసు. దాన్ని తీసుకెళ్ళి చాకిరీ చేయించుకోవాలని నీ ప్లాను" అన్నారు నాన్న.

"ఇక్కడ మాత్రం చాకిరీ చెయ్యక తప్పుతోందా నాకు? దుర్గతో వెళ్తే పని చేసినా ఆదరంగా చూస్తుంది. ఎక్కడికైనా తీసికెళ్ళి తిప్పి చూపిస్తుంది నే వెళ్తా" అంది అమ్మ.

హతాశులైపోయారు నాన్నగారు.

"ఏవిట్రా ఇదంతా? బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడవేం?" అన్నారు నన్ను చూసి.

నేను చెప్పేది ఏముంది? అయినా అమ్మా దుర్గా వెళ్ళిపోతే ఈయన్ని పెట్టుకుని నేనేం చేస్తాను అందుకే, "నేనూ దుర్గతోనే వెళ్తా" అని చెప్పేశాను.

"నువ్వే గంగలోనైనా దూకు. నీ భార్య నా భార్యని తీసుకుపోతానంటోంది కదా! అదే నాకు తలనెప్పి" అన్నారాయన.

"బదులుగా నా భర్తని సాయంగా వుంచుతానన్నానుగా - ఆయన వుండనంటే నేనేం చేసేది? ఇప్పుడు నాకేం బాధ లేదు. మా ఆయనా మా అత్తగారూ నాతో వస్తారుట. ఇక మీ ఇష్టం. రేపు పంచమి, పాలు పొంగించుకొని మారిపోతాం!" అంది దుర్గ.

రాజ్యం కోల్పోయిన రాజులాగా ఢీలాపడిపోయారు నాన్న.



"ఇదా తల్లీ నీ వేరు కాపురం. వేరే పొమ్మంటే నువ్వూ, నీ మొగుడూ వెళ్తారేమో అనుకున్నాను. నా కొంప ముంచావు" అన్నారు దీనంగా.

అమ్మకి జాలి వేసింది.

"దుర్గా పోనీ మీ మామగార్ని కూడా మనతో తీసుకువెళ్దామా? పైకి గంభీరంగా వుంటారు గానీ పుత్తడొాల్ల" అంది.

"ఇది మరీ బావుంది అందరం కట్టగట్టుకుని వేరేపోవడం ఎందుకు ఇక్కడే ఉండవచ్చు కదా!" అంది దుర్గ.

"అవును. ఏదో మీ దోవన మీరు పోతే మా దోవన మేం వుందాం అనుకున్నాను నేను. నువ్విలా చేస్తావని అనుకోలేదు" అన్నారు నాన్న దీనంగా.

"నేను మా అత్తగారినొదిలి వెళ్లనుగాక వెళ్ళను. కలిసుందాం అంటే మీ ఇష్టం. కానీ నావి కొన్ని షరతులున్నాయ్" అంది దుర్గ.

"చెప్పు" అన్నారు నాన్నగారు.

చెప్పింది దుర్గ. సంధి జరిగింది. అందరం కలిసే వుంటున్నాం. కొన్ని మార్పులు వచ్చాయి.

నేనూ, దుర్గా మా కార్లో ఆఫీసుకు వెళ్తున్నాం. నాన్నగారి కారుకి డ్రైవరుని పెట్టాం. డ్రైవరు నాన్నగారిని ఆఫీసులో దించి ఇంటికొస్తాడు. పగలంతా అమ్మ దగ్గరుంటారు కారూ, డ్రైవరూ. అమ్మకి కూడా క్రెడిట్ కార్డులు చేయించాం. రోజంతా ఇంటిపట్టున ఉండే పనిమనిషిని పెట్టాం.

శని ఆదివారాలు అమ్మకి సెలవు. బయట తింటాం. అదివరకులాగా జడపదార్థాల్లా కూర్చోకుండా కాళ్ళూ, చేతులూ కదిలించి కొంతవరకూ మా పనులు మేం చేసుకుంటున్నాం.

అంతా బాగానే ఉంది. అమ్మలో చాలా మార్పు వచ్చింది. విసుగూ విరక్తీ పోయింది. ఉత్సాహంగా ఉంది.

ఎటొచ్చీ నాన్నగారే పూర్తిగా మారలేదు. కోడలు వినకుండా చూసి ఆ మధ్యవర్తి మాధవరావు మాడు పగలగొడతానంటూ వుంటారు.

'ఇదంతా నీ వల్లనే' అని నన్ను విసుక్కుంటూ వుంటారు.

ఈ చెవిన విని ఆ చెవిన వదిలేస్తాం నేనూ, అమ్మా.

*రచన మాస పత్రిక, జులై 2005*

*కథాపీఠం పురస్కారం పొందిన కథ*

# ది కటాస్

**పొ**ద్దున్నే లేవగానే దేవుడిని తల్చుకోటం చిన్నతనం నుండీ అలవాటు. ఈ మధ్య కొత్తగా దేవుడిని తల్చుకున్నాక గ్లోబలైజేషన్‌నీ తల్చుకుంటున్నాను.

అందరూ అరవై ఏళ్ళకి రిటైర్ అయిపోతారు. నేను మాత్రం అరవై ఏళ్ళకి అమిత ఉత్సాహంతో రంగంలోకి దిగి వ్యాపారం ప్రారంభించాను.

మా ప్రాడక్ట్ పేరు ది కటాస్. నార్త్‌లోనూ, నార్త్ ఈస్ట్‌లోనూ బాగా అమ్ముడవుతోంది. భూటాన్, శ్రీలంకల్లో కూడా ప్రోత్సాహకరంగా వున్నాయి అమ్మకాలు. నేపాల్‌లో మొదట ఒక మోస్తరుగా వున్నా తర్వాత బాగా పుంజుకున్నాయి. కాలక్షేపం, డబ్బు, బోలెడంత గౌరవం.

నాకు వయసు మీదపడినా, నీకేం తెలుసు, నీ చాదస్తంతో చస్తున్నాం అని విసుక్కోకుండా ఆవిడకన్నీ తెలుసు అని గౌరవిస్తారు మా యువతరం. అంతే కాదు, అనుభవం వున్న మనిషి, ఆవిడని సలహా అడుగుదాం అనుకుంటారు.

నేనిలా కాలానుగుణంగా వున్నానంటే పరోక్షంగా కారణం మా మేనత్త. ఆవిడ పేరు సుబ్బమ్మ. ఆ కాలంలో చాలామంది స్త్రీలలాగా బాల్యంలోనే వివాహమై కాపురానికి వెళ్ళకుండానే వైధవ్యం పొంది పుట్టింట్లోనే వుండిపోయింది. అందర్లోకి పెద్దది. తమ్ముళ్ళ కుటుంబాలకీ చెల్లెళ్ళ కుటుంబాలకీ సేవలు చెయ్యడంతోనే వెళ్ళమారిపోయింది ఆవిడ జీవితం.

ఆవిడంటే మా అందరికీ అమితమైన ప్రేమాభిమానాలుండేవి. వయసు మీద పడ్డాక ఆవిడకి చాదస్తం ఎక్కువైపోయింది. అన్నీ తనకే కావాలి.

అప్పట్లో మాది ఉమ్మడి కుటుంబం. ఇంట్లో ఎవరైనా పిల్లవాడు పదో తరగతి పరీక్షలు రాసి ఇంటికి రాగానే వాడిని దగ్గరికి పిల్చి-

"ఏవిరా అబ్బాయ్! ఇక చదువు అయిపోయిందిగా, ఇక ఏదైనా ఉద్యోగంలో జేరిపో. అలా వెళ్ళి నాలుగు ఆఫీసులూ తిరిగి విచారిస్తే ఎవరైనా శెలవుల్లో వెళ్లారేమో తెలుస్తుంది. ఆ ఖాళీలో జేరిపో. ఆ తరువాత సందు చూసుకుని పర్మినెంటు నౌకరీలో దూరిపోవచ్చు" అంటూ వెంటబడి విసిగించేది.



ఆ పిల్లవాడు ఏడ్చుకుంటూ వెళ్లి తల్లిదండ్రులకు చెప్పుకునేవాడు. "అదేవిటమ్మా వాడింకా బోలెడు పెద్ద పెద్ద చదువులు చదవాలి" అంటే "ఇంకెందుకురా చదువు? చదివింది చాల్లే. చిన్నతనం నుండి ఉద్యోగం చేస్తే బాగా నిలదొక్కుకుంటాడు. ఓ రూపాయి సంపాదిస్తే డబ్బు విలువ తెలుస్తుంది. రెండేళ్ళాగి ఒక పిల్లను చూసి ముడేసేస్తే వాడి మానాన వాడు బతుకుతాడు" అని పదిహేనేళ్ళ పిల్లవాడి భవిష్యత్తు నిర్ణయించేస్తుంటే తలలు పట్టుకునేవాళ్లు తల్లిదండ్రులు.

అంతటితో ఆగినా బాగానేవుండేది. ఇంటికెవరైనా పెద్ద మనుషులు వస్తే "మీదే ఉద్యోగం నాయనా? ఎంతొస్తుంది?" అని అడిగి తెలుసుకుని, "అబ్బా పెద్ద ఉద్యోగమే" అని సంబరపడిపోయి, "మా కుర్రాడు మొన్ననే పరీక్షలు ఇచ్చాడు. వాడికి మీరే దారి చూపించాలి. వేసవిలో మీ దగ్గరే ఏ పంఖా పుల్లరుగానో, వాటర్‌బాయ్‌గానో వేసేసుకుంటే మీ కళ్ళ ముందుంటాడు. ఆనక మీ వీలు చూసుకుని ఏ ఓవర్సీలుగానో గుమాస్తాగానో వేయించారంటే మీ పేరు చెప్పుకుంటాం" అని విసిగించేది.

"అలా అడగకూడదు ఉద్యోగాలివ్వడం వీళ్ళ చేతుల్లో లేదు" అంటే వినేది కాదు. "బాగానే వుంది సంబడం. గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించడం అంటే ఇదే. తెనాలి గవర్నమెంటు ప్లీడరు, భానుమూర్తి గారి కాళ్లు పట్టుకుని, మన విఠల్‌గాడికీ, విశ్వంగాడికీ ఉద్యోగాలు వేయించలేదూ నేను" అని దెబ్బలాడేది.

ఎవరి అబ్బాయికైనా ఉద్యోగం వచ్చిందని తెలిస్తే వాళ్ళని పనిగట్టుకుని ఇంటికి పిలిచి ఓ మనవరాలిని దొరకబుచ్చుకుని దానికి పట్టు పరికిణీ వేసి వాళ్లకెదురుగా నిలబెట్టేది. "చూశారుగా బంగారం బొమ్మ. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. మీ పిల్లవాడికి చేసుకోండి" అనేది. ఇలాటి పిచ్చి పనులన్నీ చేసి అందరిచేతా అక్షింతలు వేయించుకునేది.

రాన్రానూ ఆవిడతో విసిగిపోయాం అందరం. పైకి చెప్పకపోయినా అందరం భగవంతుడా మాకు విముక్తి ప్రసాదించు అనుకున్నాం. ఆవిడ వెళ్లిపోయింది. మా మేనత్తను చూసి నాకు జ్ఞానోదయం కలిగింది. ఆవిడ అంత హైరాన పడిపోయి ఎదుటి వారిని వేధించడానికి గల కారణం ఒక్కటే. పెద్దదాన్ని నాకెందుకు బయటి విషయాలు అంటూ బయట వస్తున్న మార్పులని గమనించకుండా కూపస్థ మండూకంలా వుండిపోయింది. వచ్చే మార్పు మనం వద్దనుకున్నా రాక మానదు.

మనం ఆచరిస్తామా లేదా అనే విషయాన్ని పక్కన పెట్టి మన చుట్టూ జరిగే మార్పులను ఓ కంట గమనించాలి. అన్నీ తెలుసుకోవాలి. ఆ నిర్ణయానికి వచ్చాక

ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇంగ్లీషు, తెలుగు దినపత్రికలు చదవడం, టి.విలో వార్తలు చూడడం నియమంగా పెట్టుకున్నాను. దాంతో అన్ని సంగతులూ తెలుసుకుంటూ కాలానుగుణంగా మాట్లాడుతూ వుండడంవల్ల పిల్లలూ నన్ను గౌరవించడం, అవసరం అయితే ఏదైనా సలహా అడగడం చేస్తూ వుంటారు. మనచుట్టూ ఎన్నో మార్పులు.

టెలివిజన్‌ని చూసుకుని మురిసిపోతూ వుండగానే కంప్యూటర్ వచ్చేసింది. జీవన విధానం మారిపోయింది. ఇక ఆ తరువాత గ్లోబలైజేషన్ వల్ల మరింత మార్పు వచ్చింది.

మాకు సిటీలో పెద్ద స్థలంలో ఇల్లుండేది. పాతకాలంనాటి ఇల్లు. అప్పటి పద్ధతి ప్రకారం కట్టారు. ఆ తర్వాత ఆ మోడల్ పాతబడిపోయింది. అందుకే అది పడగొట్టి ఆ స్థలంలో ఫ్లాట్సు కడదాం అన్నారు కుర్రకారు వాళ్లు. పెద్దవాళ్లు సరే అనక తప్పలేదు. కాకపోతే ఆ ఆస్తికి నలుగురు హక్కుదారులు. అధిక భాగానికి హక్కుదారు అయిన అన్నపూర్ణమ్మగారు ఒక మడతపేచీ పెట్టింది. కట్టబోయే ఇంటికి తన భర్తపేరు పెట్టాలని ఆవిడ ఆశ. అది విని మిగిలిన ముగ్గురూ కూడా వాళ్ల పెద్ద వాళ్ళ పేర్లు పెట్టాలని మొండికేశారు.

వాళ్ల పేర్లు వరుసగా జనార్దనం, లోకనాథం, వెంకటేశ్వర్రావు, కామేశ్వరం.

"అవన్నీ పాత పేర్లు. ఆ పేర్లతో జనార్దన నిలయం అనో వెంకటేశ సదనం అనో పెడితే పేరే ఇంత లక్షణంగా వుంది. బిల్డింగ్ ఇంకెంత లక్షణంగా వుంటుందో అని ఎవరూ రారు కొనుక్కునేందుకు. ఆ తర్వాత మనం "మార్బుల్ ఫ్లోర్ వేయించాం. మాడ్యులర్ కిచెన్ పెట్టిస్తాం అని నెత్తీ నోరూ బాదుకున్నా ఫలితం వుండదు" అంటాడు బిల్డర్. పాపం అతని వాదనలోనూ బలం వుంది. డ్రీమ్ హైట్స్, గ్లోరీ కార్నర్స్ అంటూ ఇళ్లకు అధునాతనమైన పేర్లు పెడుతూ వుంటే పాత చింతకాయ పేర్లు పెడితే ఎలా?

అలా అని పెద్ద వాళ్ళ బాధనూ కాదనలేం. పాపం కష్టపడి సంపాదించారు. ఆ ఇల్లు పోతే పోయింది వాళ్ళ పేరైనా వుండాలని వాళ్ల తపన.

అందుకే ఆలోచించి నేనే ఒక పేరు నిర్ణయించాను. జలోవెకా హోమ్స్ అని పేరు పెట్టాం. అటు బిల్డరూ సంతోషించాడు. పెద్దవాళ్లూ తృప్తిపడ్డారు. మొత్తం నలభై ఫ్లాట్లలో ఇరవై మా దాయాదులవే. మిగిలిన ఇరవై వేడి వేడి మిరపకాయ బజ్జీల్లా అమ్ముడు పోయాయి. అందరూ నన్ను మరోసారి మెచ్చుకున్నారు.



గతంలో విదేశాలకు వెళ్ళిన బంధువులు ఏ రేడియోనో వాచీనో తెచ్చి ఇస్తే నలుగురు ఆడ పిల్లల తరువాత పుట్టిన మగపిల్లాడిని చూసుకున్నట్లూ అపురూపంగా చూసుకునేవాళ్ళు. గ్లోబలైజేషన్ పుణ్యమా అని హద్దులన్నీ చెరిగిపోయాయి.

అమెరికాలో వున్న పిల్లలు మనకంటే ముందే తెలుగు సినిమాలు చూసేసి, చూడమనో వద్దనో మనకు సలహాలు ఇస్తున్నారు. ఆత్రేయపురం పూతరేకులూ, కాకినాడ కాజాలూ, బందరు లడ్డూలూ కొనేసుకుని తినేస్తున్నారు. నాణ్యమైన జీడిపప్పు కావాలంటే వేటపాలెంలో దొరకదు. అమెరికా వెళ్ళినప్పుడు అక్కడి నుండి తెచ్చుకుంటే ఢోకా వుండదు.

మనం మాత్రం తీసి పోయామా? మన మొక్కజొన్నకంకి ఎండకి ఎండుతూ వానకి తడుస్తూ రోడ్డు మీదే వుండిపోయింది. అమెరికన్ స్వీట్ కార్న్ అందలం ఎక్కి కూచుంది. ఏ పళ్ల దుకాణంలో చూసినా, స్వదేశీ రకాలు తక్కువ. విదేశీ రకాలు ఎక్కువ.

దిబ్బరొట్టె, గారెముక్కా చేసి పెడతాం తినండిరా అంటే పిల్ల వెధవలు, మనం కొట్టి చంపేస్తున్నట్లు ఏడిచి గోల చేసి, బయటికి వెళ్ళి పిజ్జాలూ, బర్గర్లూ కొనుక్కుని తింటారు.

మన వాస్తు శాస్త్రంతోనే వేగలేకపోతూ వుంటే చైనా వాళ్ల వాస్తు శాస్త్రం కూడా దిగబడిపోయింది.

ప్రపంచం అంతా మన ముంగిట్లోకి వచ్చేసరికి కొనుగోలు శక్తి విపరీతంగా పెరిగిపోయింది. ఆడా మగా తేడా లేకుండా పెద్ద చదువులూ, ఉద్యోగాలూ, లక్షల్లో సంపాదనలూ, అయినా అంతా హుళక్కే. ఆదాయం ఆరు, వ్యయం పదహారు అన్నట్లూ వుంటుంది వీళ్ళ వ్యవహారం. వుంటే ఆఫీసులో వుంటారు. లేకపోతే కొంటూనో తింటూనో బజార్లో వుంటారు.

డబ్బు అయిపోతే ఎలా బతుకుతాం అనే సమస్యే లేదు. అప్పు. ఉండే ఇల్లూ అప్పే. తిరిగే కారూ అప్పే. తినే తిండి, కట్టే బట్ట, రోగం వస్తే వైద్యం అన్నీ అప్పే. గతంలో అప్పు చేస్తే తప్పు చేసినట్లు సిగ్గుపడి పోయేవాళ్ళు. ఇప్పుడు ఎంత అప్పుచేస్తే అంత గొప్ప. అలా అప్పులు చేసే గొప్పవాళ్ళను గాలించి పట్టుకుని, 'నీ కాళ్ళు పట్టుకుంటాం పన్లో పనిగా మా దగ్గర కూడా అప్పు తీసుకో' అని వెంటబడి మరీ అప్పులిస్తారు అభినవ కాబూలీ వాలాలు.

ఇంద్ర భవనాల్లాంటి షాపింగ్ మాల్స్ ఊరంతా వెలిశాయి. కొన్నా కొనక పోయినా షాపింగ్ మాల్స్‌లో తిరగడం అంటే నాకు చాలా సరదా! బోలెడంత కాలక్షేపం.

గంటసేపు షాపులో తిరిగి అన్నీ చూసి ఏమీ కొనకుండా వచ్చేసినా ఎవరూ ఏమీ అనరు. మనకు బోలెడన్ని సంగతులు తెలుస్తాయి.

పిల్లలు ఏ షర్టో తీసుకొచ్చి అమ్మా 50% సేల్‌లో ఇది కొనుక్కున్నాం ఖరీదు పద్దెనిమిది వందలే అంటే ధామ్మని కిందపడకుండా, "అవున్లే మరి మంచి ఇంటర్నేషనల్ బ్రాండెడ్ కంపెనీ షర్టు కదా! ఆ మాత్రం వుంటుంది" అని సంతోషించవచ్చు.

మా ఇంటి చుట్టూరా అరడజను పెద్ద కంపెనీలు కూరల షాపులు తెరిచాయి. అలవాటు ప్రకారం సరదా కొద్దీ ఎయిర్‌కండీషన్డ్ కూరల షాపుకి వెళ్లాను. వెళ్ళాక నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. అంత అందంగా వుంది ఆ వాతావరణం, ఆ అమరిక. మా పిల్లలని చారులోకి కొత్తిమీర కొనుక్కురండర్రా అని పంపిస్తే గంట తర్వాత ఏడొందల ఎనభై రెండు రూపాయల బిల్లుతో ఎందుకు వస్తారో ఆ షాపులు చూశాక అర్థం అయింది. అక్కడ దొరకని వస్తువులేదు. కూల్ డ్రింకులేనా, కేకులేనా... నోరూరిస్తూ బారులు తీరి వున్నాయి. కూరల్లో కూడా వంకాయ రంగులో వుండే కేబేజి, ఆకు పచ్చని కాలీఫ్లవరు. ఎర్రని సిమ్లా మిర్చి మతి పోగొట్టేలా వున్నాయి. కాక్సీనియా అంటే దొండకాయ, కాలకేషియా అంటే చామదుంపా అని తెలుసుకున్నాక భలే సర్దావేసింది. పిచ్చి మొహాలు మన కూరలకి కూడా ఇంత గొప్ప పేర్లు వున్నాయి కదా అని గర్వంతో మనసు వుప్పొంగింది.

ఆ తర్వాత అవసరం వున్నా లేకపోయినా కొన్నా కొనకపోయినా అలా నడుచుకుంటూ వెళ్ళి ఆ కూరగాయల మయసభలో కాసేపు తిరిగి రావడం అలవాటయింది. ఓ రోజు హఠాత్తుగా ఒక అరలో ప్రత్యక్షం అయ్యాయి కూరగాయల ముక్కలు. వెజిటబుల్ బిర్యానీ పేకెట్, సాంబారు పేకెట్టు అంటూ విడివిడిగా వున్నాయి. నాలుగు గుమ్మడికాయ ముక్కలు, నాలుగు సొరకాయ ముక్కలూ, నాలుగు మునక్కాడ ముక్కలూ, గుప్పెడు చిన్న ఉల్లిపాయలు సర్ది పేకెట్లో పెట్టారు. సాంబారుకి అన్నీ విడివిడిగా కొని సగం వండి సగం ఎండబెట్టే బదులు ఎంత వెసులుబాటుగా వుంది ఈ పద్ధతి!! ఆ పనీ ఆలోచన ఎవరికొచ్చిందో వాళ్లు కనబడితే చెయ్యెత్తి దణ్ణం పెట్టానిపించింది. ఏవిటీ మాయ? కాదేదీ అమ్మకానికి అనర్హం!! ఒంద్రు మట్టి, ఉసిరిపొడి, అల్లం పేస్టు, అట్ల పిండీ ఒకటేమిటి. వుపాయం వుండి జనం దృష్టిలో పడగలిగితే కోటలో పాగా వేసినట్లే.

నాకూ ఏదైనా కొత్త పదార్థం కనిపెట్టి అమ్మాలని సరదా వేసింది. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు పుట్టాడు అన్నట్లు, మా విమల వదిన కూడా తోడైంది. ఆవిడ కోటీశ్వరురాలు.



మా వదిన వాళ్లకి ఒక చిన్న పరిశ్రమ వుంది. చిన్న పిల్లను సాకినట్లు సాకి వృద్ధిలోకి తీసుకొచ్చి పిల్లలకి అప్పగించేసింది. 'చేసినన్నాళ్లు చేశాను. ఇక ఇంట్లో విశ్రాంతిగా కూర్చుని భారత భాగవతాలు చదువుకుంటాను' అని ఫేక్టరీకి వెళ్ళడం మానేసింది.

అలా కూర్చోవడం విసుగ్గా వుండి అవస్థపడుతున్న తరుణంలో నా ఆలోచన ఆవిడ చెవిన వేశాను. బావుంది బావుంది - అని మెచ్చుకుంది. తప్పకుండా చేద్దాం అంది. డబ్బుకి కొరత లేదు. బోలెడంత అనుభవం వున్న మనిషి కాబట్టి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసేసింది. విజయ దశమినాడు మా ప్రాడెక్ట్‌ని లాంచ్ చేశాం. గ్రాండ్ సక్సెస్. బాగా పోతోంది. మాకు బాగానే వస్తున్నాయి లాభాలు.

ఇదే అదను. మలేషియాకీ, సింగపూర్‌కీ, కూడా ఎగుమతి చెయ్యండి అని సలహా ఇచ్చారు శ్రేయోభిలాషులు. ప్రస్తుతానికి వ్యాపారం బాగుంది కదా అని పెంచుకుంటూపోతే మొదటికే మోసం రావచ్చు. ఏదైనా కొత్త వస్తువు మార్కెట్‌లోకి వచ్చి, పేరు తెచ్చుకుంటే, వెనక పది మంది పోటీ పడతారు.

మన పొరుగుదేశం వాళ్ళు ఈ రంగంలో ఆరితేరినవాళ్ళు. రేపే పోటీకి మా కటాస్ నే టకాస్ పేరుమీద మేము అమ్మే దానికంటే తక్కువ ధరకే తయారు చేసి మార్కెట్లలో దిమ్మరించేస్తే మేము మునిగిపోతాం. మా 'ది కటాస్'కి ఈ మార్కెట్ చాలు.

ఇంతకీ ది కటాస్ అంటే ఏంటో చెప్పలేదు కదూ! ఆ పళంగా తినే పదార్థాలు. ఆ మధ్యన ఒకసారి పిల్లలతో కలిసి ఓ పెద్ద హోటల్‌కి డిన్నర్‌కి వెళ్ళాం. దాలే - దర్బారే- షెహన్ షా అని ఒక మొగలాయి వంటకం పెట్టాడు ఆ హోటల్‌వాడు. తీరా చూస్తే అది కలగలుపు పప్పు. నెలాఖర్లో తలాకాసినీ వున్న పప్పులన్నీ కలిపి వండేసి, తిరగమోత పెట్టేది మా అమ్మ. అదే ఈ దాలే దర్బారే షెహన్ షా. అది చూశాక నాకీ కటాస్ ఆలోచన వచ్చింది.

కటాస్ ట్రెండీ, అంటే పిండి పులిహోర, బియ్యం బరకగా మరపట్టించి పదునుగా ఉడకబెట్టి వార్చి చింతపండు పులుసు, ఉప్పు, పసుపు వేసి పులిహోర పోపు వేస్తాం.

ఆ పదార్థాన్ని రెండొందల గ్రాముల చొప్పున పేక్ చేయిస్తాం.

ఆలోచన నాది. ఆచరణ మా వదినది. ఉష్ణోగ్రతలూ, పాడైపోకుండా తీసుకోవలసిన జాగర్తలూ వగైరా చూసుకునేందుకు నిపుణులను నియమించింది. యంత్ర సామాగ్రీ, అనుమతులూ, అమ్మకాలూ అన్నీ పకడ్బందీగానే ఏర్పాటు చేసింది.

మా కటాస్ ట్రెండీ పేకెట్ మీద ఇంగ్లీషులో ముద్రించిన సమాచారాన్ని తెలుగులోకి అనువదిస్తే-

తినే పదార్థం బరువు రెండొందల గ్రాములు, కేలరీలు - మూడొందల యాభై, వాడబడిన పదార్థాలు బియ్యం, చింతపండు, ఉప్పు, ఇతర మసాలా దినుసులు, అనుమతింపబడిన రంగులూ, ప్రిజర్వే టివ్స్.

వాడే విధానం: పేకెట్‌ని రెండు నిముషాలు మైక్రోవేవ్ ఓవన్‌లో వేడి చేసి, కత్తిరించి ప్లేటులో వేసుకుని తినాలి. మీకు కావాలంటే నాలుగు చిప్స్ నంజుకు తింటే మరీ అమోఘంగా వుంటుంది.

అని వుంటుంది.

మా పిండి పులిహోర - అదే ది కటాస్ ట్రెండీ విజయం సాధించాక కొత్త ప్రయోగాలు మొదలు పెట్టాం. కొరివి కారం, గోంగూర, ఆవకాయవంటి పచ్చడులు ఉడికించిన రవ్వకి కలిపి, గ్రీన్ మెలోడీ, స్పైసీ డ్రీమ్, మెల్టింగ్ మూడ్స్ అని పేర్లు పెట్టి ప్రజల మీదికి వదిలాం. అవి ఇంకా బాగా పోతున్నాయి.

మా ప్రొడక్ట్‌కి ది కటాస్ అని పేరెందుకు పెట్టాం అంటే కాకతాళీయంగా మా అమ్మ పేరూ, మా విమలోదిన వాళ్ల అమ్మ పేరూ కూడా వెంకటలక్ష్మి. నాకూ మార్గదర్శకురాలు మా మేనత్త పూర్తి పేరు వెంకట సుబ్బమ్మ.

అన్నీ కలిసివచ్చాయి. అందుకే కాలానుగుణంగా ది కటాస్ అని పేరు పెట్టేశాం. మేమూ బతుకుతున్నాం. మరో పది మందికి పని కల్పిస్తున్నాం.

ముందే చెప్పానుగా ఇవి అమ్మేవాళ్ల రోజులు కాస్త బుర్ర ఉపయోగించి కొత్త పదార్థం అమ్మితే కొనేవాళ్లు కోకొల్లలు. మా కటాస్‌ని ఎవరైనా కాపీ కొడితే ఏ పేలపిండి వడియాలో అమ్ముచ్చు 'ది పేలాస్' అనే పేరుతో, ఏ విధమైన విద్యార్హతలూ లేకపోయినా నేనీ విధంగా పైకి వచ్చానంటే దానికి కారణం గ్లోబలైజేషనే.

అందుకే మనస్ఫూర్తిగా మరోసారి చెప్తున్నాను. గ్లోబలైజేషన్ జిందాబాద్.

స్వప్న మాసపత్రిక, మార్చి *2009*



# అత్తగారూ- స్వర్గంలో సీరియస్సూ...

పరిచారికలూ, అంగరక్షకులూ హడావిడిగా పరుగులు పెడుతున్నారు. అగరు ధూపాలు వేస్తున్న ఒక పరిచారిక కించిత్తు విసుక్కుంది.

"ఏమిటీ హడావిడి. నిలుచున్న చోట నిల్చోనీకుండా హడావిడి పెట్టి చంపేస్తున్నారు. చేసిన పనే మళ్ళీ చేయిస్తున్నారు. ఇంతకీ ఎవరొస్తున్నారుట? చక్రవర్తులా? మహారాజులా? పురుషులా? పురుషోత్తములా?" అంది.

"ఏమో మరి, మనందరినీ పరుగులు పెట్టించడం కాదు. ఆయనే పాపం చాలా టెన్షను పడిపోతున్నారు. మనకి చెమటలు పట్టవు కాబట్టి సరిపోయింది గాని లేకపోతే ఈ పాటికి నాలుగు బక్కెట్లు చెమటలు కక్కుకునేవారు" అంది రెండో పరిచారిక.

"ఎవరు? ఎవరు పడిపోతున్నారు టెన్షనూ?" అడిగింది పరిచారిక నెంబర్ వన్.

ఇంకెవరు! సాక్షాత్తూ దేవేంద్రుల వారు!"

"ఏవిటీ ఆయనే కంగారు పడుతున్నారూ అంటే ఇదేదో కొత్త విషయమే! ఆయన మామూలుగానే గాభరా పడిపోయి అందర్నీ గాభరా పెట్టేస్తారు. తీరా చూస్తే ఏమీ వుండదు" అంది పరిచారిక నెంబర్ వన్.

"కాదులే ఈసారి ఆయన కొత్తరకంగా కంగారు పడుతున్నారు" - సమాధానం చెప్పింది నెంబర్ టూ పరిచారిక.

"సర్లే మరికాసేపు ఆగితే ఏవిటో విషయం తెలుస్తుంది కదా! ఈలోగా మనం టెన్షను పడడం ఎందుకు? మన పని మనం చేసుకుందాం!" అంది మొదటమ్మాయ్.

అంతలోనే ఒక పెద్దాయన వచ్చి, "ఏవిటా కబుర్లు! ఇంకా బోలెడంత పనుంది. కబుర్లాపి పని చెయ్యండి" అని కసిరాడు.

"చేస్తున్నాం లేవయ్యా. ఆ పని మీదనే వున్నాం. నువ్వేం అజమాయిషీ చెయ్యక్కర్లేదు" అన్నారు పరిచారికలు మళ్ళీ పన్లో మునిగిపోతూ.

ఆ తర్వాత నాలుగు రోజులు స్వర్గంలో అంతా హడావిడీ - సందడి. అన్నీ సవ్యంగా వున్నాయో లేదో అని ఒకటికి పదిసార్లు చూసుకుని తృప్తిపడ్డారు.

అంతా ఎదురు చూస్తున్న శుభముహూర్తం రానేవచ్చింది. వందిమాగధులతో, సకల మర్యాదలతో, ఛత్రచామరాది లాంఛనాలతో దేవేరీ సహితంగా స్వర్గ ద్వారం వద్దకు వేంచేశారు దేవేంద్రులవారు.

మెల్లిగా వచ్చి ఆగింది విమానం. కుడికాలు ముందుపెట్టి దిగింది భానుమతి గారు.

మంగళవాయిద్యాలు మారుమోగాయి. పుష్పవర్షం కురిసింది. బహుపరాకులు పలికారు.

"స్వాగతం అమ్మా, సుస్వాగతం!" అంటూ స్వాగతం పలికారు ఇంద్రులవారు.

సుతారంగా కళ్ళజోడు సవరించుకుంటూ - "ఎవరు నాయనా మీరు? మిమ్మల్ని నేనింతకు ముందు చూడలేదే!" అందావిడ సంభ్రమాశ్చర్యాలతో.

"నేను స్వర్గలోకాధిపతిని, దేవేంద్రుడిని" - సమాధానం చెప్పాడాయన.

మరింత ఆశ్చర్యంలో మునిగిపోయిందావిడ.

"అంటే దేవేంద్రులు మీరేనా, నమ్మలేకుండా వున్నాను" అంది నోటితో నవ్వుతూనే నొసలుతో వెక్కిరింతగా.

"ఇందులో సందేహం ఏముందమ్మా? నేనే దేవేంద్రుడిని. మీకు నమ్మకం ఎందుకు కలగడం లేదు?" అడిగాడు ఇంద్రులవారు.

"అదికాదు, మీరు చూడబోతే దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నారు. ఆ దర్పం, ఆ ఠీవి - మా సినిమాల్లో దేవేంద్రుడంటే ఎప్పుడూ నిద్రమొహంతో నీరసంగా వుంటాడు" అనేసింది భానుమతిగారు.

ఇంద్రుడి మొహం మాడిపోయింది. అది చూసి ఆవిడ పాపం నొచ్చుకుంది.

"ఏమనుకోకండి. ఉన్నమాట ఠపీ మని మాటాడ్డం నాకు అలవాటు. అంతా అహంకారం అంటారు. కాదు ఆత్మాభిమానం అంటాను నేను" అన్నారు ఆవిడ.

"అవునమ్మా, అందరూ ఆ మాటే చెప్పారు. ఇకపోతే మీరు చెప్పింది అక్షరాలా నిజం. అక్కడ సినిమాల్లో ఇంద్రుడిని ఒకటి రెండుసార్లు చూడటం తటస్థించింది. జీవితం మీద విరక్తి కలిగింది. ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. కానీ మాకది సాధ్యం కాదు కదా!" అన్నారు ఇంద్రులవారు.



"బాధపడకండి. ఏం చేస్తాం? ఇంద్రుడి విషయంలో మాత్రమే కాదులెండి. మా సినిమా వాళ్ళు పంచ పాండవుల్లో నకుల సహదేవులనూ, దశరథ పుత్రుల్లో భరత, శత్రుఘ్నులనూ లెక్క చెయ్యరు. ఏబ్రాసి వాళ్ళను ఎంచి మరీ తీసుకొస్తారు. వాళ్ళేమో ఆవలించుకుంటూ, బుర్రలు గోక్కుంటూ వుంటారు. ఒక్కో సందర్భంలో మహారాజు మసిదీపంలా వుండి వింజామర వీచే సేవకుడు వెలిగిపోతూ వుంటాడు" అని సర్ది చెప్పింది భానుమతిగారు.

ఇంద్రుడి మొహం మళ్ళీ కళకళ లాడింది.

"ఇక్కడేనా కబుర్లన్నీ లోపలికి తీసుకువెళ్ళండి" అంటూ కర్తవ్యం గుర్తు చేశారు దేవేంద్రుని ఆంతరంగికులు.

"దయచెయ్యండి" అంటూ లోపలికి తీసుకువెళ్ళారు, ఉచితాసనం మీద కూర్చో బెట్టారు.

"ఏం పుచ్చుకుంటారు? కాఫీ, టీ, కూల్ డ్రింక్?" అడిగారు.

మళ్ళీ ఆశ్చర్యపోయారు భానుమతిగారు.

"స్వర్గంలో కూడా ఇవన్నీ వున్నాయా? మరి మా చక్కన్నగారు...?"

"ఎప్పటి చక్కన్నగారి మాటమ్మా. ఆ తర్వాత మాలోనూ చాలా మార్పు వచ్చింది. పెద్ద పెద్ద వాళ్ళందరూ వస్తుంటారు. వారి సౌకర్యార్థం వారికి కావలసిన విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం" అన్నారు ఇంద్రులవారు.

"అలాగా, చాలా సంతోషం" మెచ్చుకున్నారు భానుమతిగారు.

"ఇప్పుడు మీకు ఫిల్టర్ కాఫీ పంపించమంటారా? ఇన్‌స్టెంట్ కాఫీనా? ఎక్స్‌ప్రెస్సో కాఫీనా?" అడిగారు పరిచారికలు.

"ఇప్పుడేం వద్దు, ఇప్పుడేగా వచ్చాను. కాస్త విశ్రాంతి తీసుకుని..."

ఆవిడ చెప్తుంటే ఇంద్రులవారు కాస్త తటపటాయించారు.

"అక్కడ అందరూ మీ కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతకాలం ఏదో విధంగా ఆపగలిగాం. ఇక మావల్ల కావడం లేదు. మీరు వెంటనే వచ్చి పరిస్థితి చక్కదిద్దాలి" అన్నారు.

"ఏమిటా పరిస్థితి? నేనొచ్చి ఏం చెయ్యాలి?" అడిగిందావిడ.

"రండి తమరే చూద్దురుగాని" అంటూ తీసుకువెళ్ళారు.

అక్కడ పెద్ద సభ. తండోపతండాలుగా జనం. ఒక మూల వేదిక. దానిమీద తల పట్టుకుని నిలబడి వుంది రంభ.

జనం ఈలలు వేసి గొడవ చేశారు. వాద్యబృందంవారు వాయించడం మొదలు పెట్టారు. స్వర్గలోక గాయనీమణి కంఠం సవరించుకుని 'పిలచిన బిగువటరా?' అని పాట మొదలు పెట్టింది. వెంటనే రంభ లేని ఉత్సాహం తెచ్చుకుని ఆడడం మొదలు పెట్టింది.

జనం, "ఆపు... ఆపు..." అంటూ గొడవ పెట్టారు.

రంభ ఆట్టం మానేసి దీనంగా నిలబడింది.

"చూశారా అమ్మా, ఇదీ పరిస్థితి. వీరంతా భూలోకవాసులు. వీరికి వినోదం కలిగించడం మా బాధ్యత. వీరందరికీ మీరు చేసిన నాట్యం చూడాలని కుతూహలం. మా నర్తకీమణులందరూ ప్రయత్నించి విఫలులయ్యారు. రంభ మాత్రం ఆ నాటినించీ ఈనాటి దాకా ఓపిగ్గా ప్రయత్నిస్తోంది. అయినా ఆవిడ వశం కావడం లేదు. ఈ జనం కోరిక తీర్చకపోతే మాకు చెడ్డ పేరొస్తుంది. నా పదవికే మోసం. మీరొస్తున్నారని తెలుసుకుని నాకూ, మా రంభకీ కూడా ప్రాణం లేచివచ్చింది. దయవుంచి మీరు మా రంభకు ఆ మెళకువలు నేర్పి ఈ ఆపదనించి గట్టెక్కించాలి" అంటూ ప్రాధేయపడ్డారు ఇంద్రులవారు.

భానుమతికి నవ్వొచ్చింది.

"అంటే మీకు కోపం వస్తుందేమోగాని పాపం వాళ్ళ తప్పేముంది? అంత మంచి నర్తకీమణులున్నా ఎంతసేపూ తపస్సులు చెడగొట్టే నాట్య ప్రదర్శనలు ఇప్పించడం తప్ప జనరంజకంగా ఏనాడైనా డాన్సు చేయిస్తేగా! పాపం వాళ్ళేం చేస్తారు?" అనేసింది.

మళ్ళీ మొహమాటపడ్డారు ఇంద్రులవారు.

"నిజమే, ఏదో మరి? మా పద్ధతులు అవీ. ఇంతకీ మీరు మమ్మల్ని కరుణించాలి?" – మళ్ళీ బతిమాలారు.

ఈసారి ఆవిడ మొహమాటపడింది.

"అప్పుడంటే చిన్నతనం. ఇప్పుడు ఇంత వయసు వచ్చాక నేనేం నేర్పుతాను? పాపం ఆ రంభేం నేర్చుకుంటుంది?" అనేసింది.

"ఆ భయం మీకొద్దు, ఇది స్వర్గలోకం. తలచిన మరుక్షణం తలచిన రూపు ధరించగల అవకాశం వుంది. మీరు సరేననండి చాలు" – హామీ ఇచ్చారు ఇంద్రులు.



'సరే'నంది భానుమతిగారు. మరుక్షణం అప్పటి భానుమతి ఎదుట ప్రత్యక్షం అయింది.

దేవేంద్రుడు దిగ్భ్రమ చెందారు.

"అమ్మా ఏమి సౌందర్యం! ఏమి ఠీవి! సామాన్యులకు అందరాని ఈ తేజస్సు అంతా మీలోని విద్వత్ సంపద వల్ల కలిగిందేనా తల్లీ" అన్నారు వినయంగా.

"అదేమీ కాదు, మీ అభిమానం" అనేసింది భానుమతిగారు.

భానుమతిగారిని తీసుకుని వేదిక మీదికి వెళ్ళారు. ఇక జనం ఆనందోత్సాహాలకు అంతు లేదు. ఒక్కపెట్టున హర్షధ్వానాలు చేశారు. ఆ సందడి సద్దుమణగడానికి చాలా సమయం పట్టింది.

రంభ ప్రాణం లేచి వచ్చింది. భానుమతిగారి దగ్గర మెళకువలు నేర్చుకోవాలని ఆశగా ముందుకు వచ్చింది. భానుమతిగారు నేర్పేందుకు సిద్ధమయింది.

అంతలోనే మళ్ళీ జనం గొడవ మొదలు పెట్టారు. భానుమతిగారు వచ్చాక మళ్ళీ మధ్యలో రంభ ఎందుకని వారి వాదన. భానుమతిగారే స్వయంగా డాన్సు చెయ్యాలని వారి కోరిక.

భానుమతిగారు అసహనంగా చూశారు జనం వంక. ఒక్కొక్కరినీ గుర్తిస్తూ, అందరి వంకా చూస్తుంటే అందరూ తమ వాళ్ళే! చల్లని చిరునవ్వుతో దేవులపల్లివారు, అభిమానంగా చూస్తూ నాగయ్యగారూ, ఘంటసాలగారూ, బి.యన్.రెడ్డిగారూ, ఎస్. రాజేశ్వరరావుగారూ, ఎన్టీఆర్‌గారూ, చక్కన్నగారూ, ఎడం చెయ్యి తిప్పుతూ సూర్యకాంతమ్మ, ఓరకంట చూస్తూ సావిత్రి, అందరికంటే పక్కగా రామక్రిష్ణగారు.

భానుమతిగారి కళ్ళు చెమర్చాయి. ఆవిడ అణువణువూ పులకరించింది. ఆ పులకరింత మనోమర నర్తనమైంది.

ఆ నయగారము, ఆ ఒయ్యారము తిలకించిన వారంతా మంత్రముగ్ధులయ్యారు. హర్షద్వానాలు జగత్తంతా వ్యాపించాయి.

అందరూ ఆప్యాయంగా పలకరించారు. అందరితో మాట్లాడుతూ ముందుకి వెళ్తున్న భానుమతిగారు ఆశ్చర్యంతో ఆగిపోయారు.

ఎదురుగా గోల్కొండ వ్యాపారుల గోచీ సర్దుకుంటూ అత్తగారు.

"మీరిక్కడున్నారేవిటి?" ఆశ్చర్యంగా అడిగింది భానుమతిగారు.

"ఏవీ! అంత ఆశ్చర్యం. భానుమతి వున్నచోట అత్తగారుండదా– నీ చాదస్తం కాకపోతేనూ!" అన్నారు అత్తగారు.

"నిజమే మరి! భానుమతిదీ అత్తగారిదీ అవినాభావ సంబంధం" - అనేసింది భానుమతిగారు.

"ఎలా వున్నావే? మీ వాండ్లూ మా వాండ్లూ అంతా బావున్నారా?" కుశలం అడిగారు అత్తగారు.

"ఆ! పోయిన వాళ్ళు పోగా వున్నవాళ్ళంతా బాగానే వున్నారు. ఇంతకీ మీరెలా వున్నారు? స్వర్గలోకం బావుందా మీకు?" అడిగింది భానుమతిగారు.

"ఆ ఏం స్వర్గం? భూలోకం ఎంతో స్వర్గలోకమూ అంతే" అన్నారు తేల్గ్గా అత్తగారు.

భానుమతిగారు స్వర్గానికి పాతకాపు అయ్యారు.

'హమ్మయ్య ఇక నిశ్చింతగా వుందాం' అనుకుంటూ వుండగానే అత్తగారొచ్చేరు-

"నీతో ఓ మాట చెప్పాలి!" అనుకుంటూ.

"ఏమిటో చెప్పండి. ఆలస్యం ఎందుకూ?" అంది భానుమతిగారు.

"ఇప్పుడూ... అది కాదే! మరీ! అసలు విషయం ఏమిటంటే..." అంటూ నీళ్ళు నమలడం ప్రారంభించారు అత్తగారు.

"ఇదేం వింత? చెప్పదల్చుకున్నదేదో కుండబద్ధలు కొట్టి చెప్పే మీరు ఇలా మెత్తగా వున్నారేమిటి? స్వర్గానికి వచ్చాక మీ దార్ఢ్యకం తగ్గిపోయిందా ఏం?" అని అడిగింది భానుమతిగారు.

అత్తగారికి కోపం వచ్చింది.

"అదేం కాదులే. ఉన్నమాట చెప్పడానికి మొహమాటం ఎందుకూ? నీ మీద నాకు చాలా కోపంగా వుంది" అని చెప్పేశారు.

"ఎందుకుటా? నేనేం చేశాను?" అడిగింది కోడలు.

"నా మీద కథలు రాసి నన్ను ఆట పట్టించావు. భానుమతి అత్తగారంటే అందరికీ నవ్వులాటే!" అలిగింది అత్తగారు.

"భలేవారే! మీరంటే అందరికీ వల్లమాలిన అభిమానం. ఒక్కమాటలో చెప్పాలంటే అందరు కోడళ్ళూ మీలాటి అత్తగారు కావాలనుకుంటారు ఈనాటికీనూ!" అంటూ వున్నమాట చెప్పింది భానుమతిగారు.

"అవుననుకో, కానీ బొత్తిగా నాకే పనీ రానట్టూ రాశావు. అయిందేదో అయిపోయింది. ఇప్పుడింత కాలానికి ఇద్దరం ఒక చోటికి చేరిపోయాం. నీకూ తీరికే, నాకూ తీరికే కాబట్టి ఏదైనా మంచి పన్లు చేసి నేనూ మంచి పేరు తెచ్చుకుంటాను" అంది అత్తగారు మనసులోని మాట చెప్తూ.

"ఆలోచన బాగానే వుంది. కానీ ఇప్పుడర్జంటుగా మీరు ఏం మంచి పని చేస్తారు?" అడిగింది కోడలుగారు.

"నేనో ఆలోచన చేసే వుంచాను" అంది అత్తగారు.

"చెప్పండి, ఇంకెందుకాలస్యం" - ప్రోత్సహించింది కోడలు.

"ఏమీ లేదే, అక్కడ మన భూలోకంలో అవేవిటో ఇంటింటా వచ్చాయట. టీబీనో, క్షయో దాని పేరు - బొమ్మలు కనిపిస్తాయిట."

"టీ.బీ కాదు... క్షయా కాదు - టి.వి. అంటే టెలివిజన్" - పడీ పడీ నవ్వుతూ చెప్పారు భానుమతిగారు.

"ఆ ఏదో ఒహటి! ఆ బొమ్మల పెట్టెలో రోజూ కాస్త కాస్త కథ తీసి చూపిస్తారుట" అంది అత్తగారు.

"అవును! వాటిని డెయిలీ సీరియల్స్ అంటారు."

"అదేనుట. ఆ సీరియస్సే మనం ఒహటి తీద్దామా?" - అత్తగారి ఆలోచన.

గతుక్కుమంది భానుమతిగారు.

'మీ కథలన్నీ నేను టి.వీ. సీరియల్స్ తీసేశాను' అని చెప్పాలని నోటి దాకా వచ్చింది. కానీ కథలు రాసినందుకే చిర్రుబుర్రుమంటోందీవిడ - సీరియల్ కూడా తీసేశానని తెలిస్తే మరింత గొడవ చేస్తుందీవిడ' అని వూరుకుంది.

అందుకే, "అమ్మో, సీరియల్ తియ్యడం అంటే మాటలా? చాలా ఓర్పూ ఓపికా కావాలి!" - భయపెట్టాలని చూసింది.

"నాకు ఓర్పు తక్కువా? నీకు ఓపిక తక్కువా? ఓ సీరియస్సూ తీసేద్దాం. ఇక్కడ మా వాళ్ళందర్నీ అడిగే వుంచాను. భారీ ఎత్తున తియ్యాలంటే కష్టంగానీ పొదుపుగా తీసుకోవడం తేలికేనట" చెప్పేరు అత్తగారు.

"ఇంకేం చెప్పారు వాళ్ళు?" అడిగింది కోడలుగారు.

"ఏ వుందీ, పెద్దగా సరంజామా ఏం అక్కర్లేదుట? ఆ నిచ్చెనలూ, లైట్లూ ఏమీ లేకుండా ఒక్క కెమెరాతో సీరియస్సు తీయచ్చుట. ఆ కెమెరా కూడా సినిమాది అక్కర్లేదుట. ఈ మధ్య అన్ని పెళ్ళిళ్ళల్లోనూ, పేరంటాల్లోను తీస్తారుట - వీడియో కెమెరానో బోడియో కెమరానో - అది చాలునట!" - సూక్ష్మంలో మోక్షంగా చెప్పేశారు అత్తగారు.

నవ్వాపుకోలేక సతమతం అయిపోయింది భానుమతిగారు.

"బోడియో కాదు వీడియో కెమెరా! సరే వీడియో కెమేరాతోనే తీద్దాం. మరి పాత్రలు పోషించేందుకు ఏక్టర్లు కావాలిగా!" అడిగారు.

"ఆ! ఎందుకే పాత్రలూ, గ్లాసులూనూ? నువ్వూ నేనూ వున్నాం చాలదా!" అనేశారు అత్తగారు.

"అంటే! ఇప్పుడు మనిద్దరం ఒక వీడియో కెమెరాతో సీరియల్ తీద్దాం అంటారు అంతేనా!" అడిగింది భానుమతిగారు.

"అక్షరాల అంతే! అంతగా అవసరం అనుకుంటే అప్పుడింకో నలుగుర్ని కేకేస్తే వాళ్ళే వస్తారు!" - సలహా చెప్పారు అత్తగారు.

"సరే పాత్రలొద్దు! కథైనా కావాలి కదా!" భానుమతిగారి ప్రశ్న.

"ఎందుకే కథా కాకరకాయా... వున్న కథలే చాలు. నువ్వు నా మీద రాసినవన్నీ వున్నాయిగా!" గుర్తు చేశారు అత్తగారు.

చచ్చింది గొర్రె. ఇందాక తప్పించుకున్నానుగానీ ఇప్పుడేం చెయ్యాలని కంగారు పడింది భానుమతిగారు.

"అదేవిటీ ఆ కథలన్నీ రాసి మిమ్మల్ని నవ్వులపాలు చేశానని ఇప్పుడేగా అన్నారు. అంతలోనే మర్చిపోయారా! మళ్ళీ ఇంతలోనే ఆ కథలే సీరియల్ తీస్తానంటారేమిటి?"- తప్పించుకోవాలని ఆఖరు ప్రయత్నం చేసింది భానుమతిగారు.

'కాదు ఆ కథలే కావా'లని పట్టుపట్టింది అత్తగారు.

'ఇక లాభంలేదు. అన్యథా శరణం నాస్తి' అనుకుంటూ, "అది కాదత్తా ఆ కథలన్నీ నేను సీరియల్స్ తీసేశాను" అంటూ చెప్పేశారు.

అత్తగారు పకపకా నవ్వేశారు.

"ఓసినీ ఇంత వాన కురవా! తీసేశావూ! పోన్లే ఆ కథలన్నీ మార్చేసి సీరియస్సు తీసేద్దాం" అన్నారు. "ఆ కథలు మీకు నచ్చలేదన్నారుగా" అంది భానుమతిగారు.

"అయ్యో నెత్తిరాతా నాకా మాత్రం తెలియదుటే! ఆ కథలన్నీ మార్చేద్దాం." అన్నారు అత్తగారు నవ్వుతూ.

"మార్చినంత మాత్రాన మంచి కథలైపోతాయా?" అడిగింది కోడలు.

"ఆహా నిక్షేపంలా అవుతాయి. ఉదాహరణకి ఈ కథలో నేను పెట్టిన ఆవకాయ అందరూ లొట్టలేసుకుంటూ తింటారన్న మాట! అట్లానే నేనూ నువ్వూ తవ్వితే ఒకటీ కాదు నాలుగు లంకె బిందెలు దొరికి వాటితో నువ్వు ఇంకా బోలెడన్ని సినిమాలు తీస్తావన్నమాట!" - ఆవేశంగా చెప్పుకుపోయారు అత్తగారు.

నోరావలించి వింటూ వుండిపోయారు భానుమతిగారు.

కథలన్నీ ఏ విధంగా మార్చాలో చెప్పి ముగించారు అత్తగారు.

"అదన్నమాట సంగతి. మరింకా పాత్రలం వున్నాం. కథ వుంది. మళ్ళీ నీ మొగుడొచ్చి అడ్డం చెప్పేలోగా, గబగబా తీసేద్దాం సీరియస్సు" అన్నారు కంగారు పెట్టేస్తూ.

"ఆగండి, బాగానే వుంది మీ కంగారు. తలచిననాడే తాతకి కళ్యాణం అంటే ఎట్లా? కాస్త మంచి రోజైనా చూసుకోవాలా! మనిద్దరం కాక మరో నలుగురైనా నటీనటులు కావాలా! వీడియో వాడు కావాలా!"- ఆవిడ ఉత్సాహానికి ఆనకట్ట వెయ్యాలని వ్యర్థ ప్రయత్నం చేసింది భానుమతిగారు.

"అది కాదే! నేను స్వయంగా పని మొదలెడదామంటే మళ్ళీ మంచి రోజూ - సింగినాదం ఎందుకూ! నేను మొదలు పెడితే ఏ పనైనా ఎంత బాగా జరుగుతుందో నీకు తెలీదూ!" అంటూ గర్వంగా నవ్వింది అత్తగారు.

'తెలుసు కాబట్టే నా బాధ' - లోలోపలే అనుకుంది భానుమతిగారు.

"ఇవ్వాళ మంచిరోజే. ముందు నువ్వు పని ప్రారంభించు. 'అత్తగారూ పనివాళ్ళూ' కథ ముందుగా సీరియస్సు తీసేద్దాం. నువ్వూ, నేనూ వుండనే వున్నాం. ఇంద్రుడిని కేకేస్తే తిరువెంగళం పాత్ర వేస్తాడు. ఆ రంభని పిలిపించి పనిమనిషి ఎల్లమ్మ పాత్ర వేయిస్తే సరిపోయే"- సునాయాసంగా చెప్పేసింది అత్తగారు.

"ఏవిటీ రంభ ఎల్లమ్మ వేషం వేస్తుందా? ఇంద్రుల వారికి తిరువెంగళం వేషమా? వాళ్ళు వేస్తారా?" - అపనమ్మకంగా అడిగింది భానుమతిగారు.

"ఏం ఎందుకు వెయ్యరూ! వాళ్ళడిగితే నువ్వు డాన్సు వెయ్యలా? నువ్వడిగితే నిక్షేపంలా వేస్తారు"- ఖచ్చితంగా చెప్పేసింది అత్తగారు.

"సరే! రంభ ఎల్లమ్మ, ఇంద్రుడు తిరువెంగళం, మరి గుండు మణి పాత్రకెవరిని నిర్ణయించారు - చంద్రుడినా?" అడిగింది భానుమతిగారు.

"ఛ ఛా ఆ మసాలా వెధవ మణి గాడెందుకూ పీడాకారం? వాడి పాత్రే వద్దు. నువ్వూ, నేనూ, రంభా, ఇంద్రుడూ చాలు ప్రస్తుతానికి. మన నలుగురితో ఓ సీరియస్సు తీసి చూసి అంతగా కావలిస్తే అప్పుడింకో పాత్ర కలుపుకుందాం" అన్నారు అత్తగారు 'ఊరగాయలో ఉప్పు కలుపుకుందాం' అన్నంత తేలిగ్గా.

భానుమతిగారికి బుర్ర తిరిగిపోతోంది. నోట మాట రావడం లేదు.

"సరే అంతా రెడీ అయిపోయింది. నువ్వెళ్ళి ఇంద్రుడినీ రంభనీ కేకేసుకురా! నే వెళ్ళి ఆ వీడియోనో, బోడియోనో అది తీసే అబ్బాయిని తీసుకొస్తాను. అన్నట్లు నీతో చెప్పలేదు కదూ - నాకొక అబ్బాయి తెలుసు. పాపం బ్రతికుండగా ఆ వీడియోనో, బోడియోనో తీసుకునేవాడట. యమహానో, కుబేరహానో మోటరు సైకిలు మీద పోతూ ఎక్సిడెంట్లై ఇక్కడి కొచ్చేశాడు. నువ్వంటే చాలా అభిమానం. 'మీరు ఊ అనండి నేనొచ్చేస్తాను' అని ఏనాడో చెప్పి వుంచాడు. చూశావా, అన్ని ఏర్పాట్లు ఎలా చేసేశానో" అంటూ వెళ్ళిపోయారు అత్తగారు.

తల పట్టుకుని కూర్చున్నారు భానుమతిగారు. ఆవిడ కళ్ళ ముందు నక్షత్రాలు కనిపిస్తున్నాయి.

వెళ్ళినట్లూ వెళ్ళి వెనక్కి వచ్చింది అత్తగారు.

"చూశావా అసలు విషయం మర్చిపోయాం. మనకో పొలిటీషియను కావద్దూ!" అన్నారు.

"అసలే బుర్రలు పోయి ఏడుస్తుంటే పొలిటీషియను ఎందుకూ! ఇంకా బుర్ర తింటానికా?"- కాస్త విసుక్కున్నారు భానుమతిగారు.

"అయ్యో రామా! సీరియస్సు తీస్తుంటే మనం అంతా మేకప్పులు చేసుకోవద్దుటే. మరి మేకప్పుకి పొలిటీషియను కావద్దు."

"మేకప్పుకి పొలిటీషియన్ ఎందుకత్తా?" - అయోమయంగా అడిగారు భానుమతిగారు.

"అదేం విడ్డూరమే. ఇంతకాలం అక్కడున్నావు నీకు మేకప్పు చేసే పొలిటీషియన్ గురించి తెలియదూ, సినిమాలకైతే మేకప్పు మేసులు కావాలిట. ఇలా చిన్న చితకా వాటికి ఆడమేకప్పు పిల్లలు వుంటారుట. పెళ్ళిళ్ళకీ పేరంటాలకీ వాళ్ళే వచ్చి ఆడవాళ్ళ మొహాలకి సున్నాలూ, రంగులూ వేసి తలలు దువ్వి తయారు చేస్తారుట. వాళ్ళని పొలిటీషియన్లు అంటారట" - వీలైనంత వివరంగా చెప్పింది అత్తగారు.

పడీ పడీ నవ్వింది భానుమతిగారు.

"అయ్యో, రామా! వాళ్ళు పొలిటీషియన్లు కాదు, బ్యూటిషియన్లు" అంది.

"ఆ ఏదో ఎత్తుభారం, నాకో పిల్ల తెలుసు. ఆ పిల్లనీ పిల్చుకొస్తా, పని పెందలాడే మొదలు పెట్టేస్తే పెందలాడే అయిపోతుంది" అంటూ వెళ్ళిపోయారు అత్తగారు.

నవ్వాలో ఏడవాలో తెలియనిస్థితిలో వుండిపోయారు భానుమతిగారు.

*(భానుమతిగారికి నివాళి అర్పిస్తూ రాసిన కథ)*

*రచన మాసపత్రిక, ఫిబ్రవరి 2006*



# ఔను - వాళ్ళిద్దరూ కథ రాశారు

**మా**ర్నింగ్ వాక్‌కి వెళ్ళిన రాఘవరావు ఈల వేసుకుంటూ ఇంట్లోకొచ్చాడు.

వంటింట్లో కాఫీ ఏర్పాట్లలో వున్న మైథిలి గుండె ఠారుమంది. 'చచ్చాం ఈయన ఇవ్వాళ హుషారుగా వున్నారు. నాకు మళ్ళీ మూడింది' అనుకుంది.

ఆవిడలా దిగులుపడిందంటే దానికి తగిన కారణమే వుంది. రాఘవరావు పెద్ద ఉద్యోగంచేసి రెండేళ్ళ కిందట రిటైర్ అయ్యాడు. స్వంత ఇల్లుంది. ఇద్దరు పిల్లలూ ఆమెరికాలో వున్నారు. ఆర్థిక ఇబ్బందులులేవు. ఆరోగ్యాలు బావున్నాయి. అంతా బాగానే వుంది.

కాకపోతే కాలక్షేపం కావడమే కష్టంగా వుంది. ఆయన ప్రయత్నిస్తే ఏదో ఉద్యోగం దొరక్కపోదు. కానీ ఆయనకలా ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదు. అవసరం లేకుండా అందరూ ఉద్యోగానికి ఎగబడితే నిరుద్యోగ సమస్య మరింత పెరుగుతుందని ఆయన నమ్మకం.

అందుకే కాలక్షేపానికి మార్గాలు వెతుక్కుంటూ వుంటాడు అనుక్షణం. ఎక్కడ ఏ టూర్ కనిపించినా వెళ్ళొచ్చాడు కొన్నాళ్ళు. జ్యోతిర్లింగాలు, నవగ్రహాలు, అష్టగణపతులూ వగైరా అన్ని యాత్రలూ చేసేశాడు.

ప్రస్తుతానికి మా దగ్గర ఇంకేం టూర్లు లేవు. ఏవైనా కొత్తవి వేస్తే మీకే ముందు చెప్తాం అని నిస్సహాయులై చేతులెత్తేశారు టూరిజం డిపార్ట్‌మెంట్ వాళ్ళు.

దాంతో పాపం ఆయన పని అయోమయంగా తయారైంది. ఓ ఆరు పేపర్లు తెప్పించుకుని చదువుతాడు. న్యూస్ లన్నీ చూస్తాడు. ప్రపంచంలో ఎవరు ఏ మూల ఏ ఆట ఆడినా టీ.వీ.లో చూస్తాడు. ఏదోలా కాలక్షేపం అయిపోతోంది. కాకపోతే పెత్తనం చలాయించే అవకాశం కరువైపోయింది.

ఉద్యోగంలో వున్నప్పుడు చేతికింద వేల సంఖ్యలో మనుషులుండేవారు. వాళ్ళందరిమీదా దాష్టీకం చలాయించి పన్లు చేయించడం అలవాటైంది.

రిటైర్ అయ్యాక ఆ వైభోగం కాస్తా పోయింది. అప్పటికీ అలవాటు ప్రకారం పనిమనిషిమీద పెత్తనం చెలాయించి "ఏవిటీ పని ఇట్లా చేస్తే నిన్ను వెంటనే సస్పెండ్ చేస్తాను జాగ్రత్త" అని బెదిరించాడు.

పనిమినిషి బెదరలేదు సరికదా "మీరు కాదంటే నాకు పనే దొరకదా. నేనే పోతాను" అని ఇల్లు ఊడుస్తున్నదికాస్తా చీపురక్కడే పారేసి పోయింది.

అలా ఇద్దరికి ఉద్వాసన చెప్పాక భార్య ఎదురుతిరిగింది. మీరీ విధంగా పనివాళ్ళమీద దాష్టీకం చలాయించి వాళ్ళని వెళ్ళగొడుతుంటే ఈ చాకిరీ అంతా నా నెత్తిన పడుతోంది. నా వల్ల కావడంలేదు. మీరు మీ పద్ధతి మార్చుకోకపోతే నేనే కాశీకీ పోతానని చెప్పేసింది. దాంతో బెదిరిపోయి పనివాళ్ళ జోలికిపోవడం మానేశాడు.

కాకపోతే పూర్వపు వాసనలు పోవుకదా. ఇక మిగిలింది ఆ మహా ఇల్లాలు. ఆవిడకీ భర్తంటే పంచప్రాణాలు. అమిత గౌరవం. ట్రాన్స్‌ఫర్ల ఉద్యోగం. అడివైనా అరణ్యమైనా అంతా కలిసే వుందాం అంటూ కుటుంబాన్ని వెంటతీసుకెళ్ళాడేగానీ 'ఏ బస్తీలోనో పిల్లలు చదువులంటూ నన్నొదిలేసి నీ చావు నువ్వు చావు' అన్లేదు.

ఇల్లే కైలాసం అంటూ ఆ ఉద్యోగం చేసుకుని ఇంటిపట్టున వున్నాడే తప్ప క్లబ్బుల వెంటా మందు పార్టీల వెంటా తిరగలేదు. ఏ మాటకా మాట చెప్పుకోవాలి మా ఆయన బంగారం అంటుందావిడ.

మామూలుగా సాగిపోతే బానే వుంటుంది. కాకపోతే ఆ బుర్రలో ఏదో పురుగు తొలిస్తేనే కష్టం.

మామూలుగా మార్నింగ్ వాక్‌కి వెళ్ళి చిరాగ్గా వస్తాడు. ఎవడా వెధవ ఎద్దులా వున్నాడు రోడ్డు పక్కన. ఛీ ఛీ అని విసుక్కుంటాడు. ఎవర్తో మహాతల్లి. రోడ్డు తుడిచే మనిషి రోడ్డు తుడిచివెళ్ళింది. ఈవిడ చెత్త పోసేస్తోంది. ఇటువంటి వెధవలున్నంత కాలం మన దేశం బాగుపడదు అని విసుక్కుంటాడు.

అలా ధుమధుమలాడితే ఆవిడకేం ఇబ్బంది లేదు. ఆ ఆవేశం చల్లారాక కాఫీ ఇస్తే సరిపోతుంది.

ఎటొచ్చీ ఏదైనా మంచి ఎదురైతే ఈల వేసుకుంటూ వస్తాడు. అదే ఆవిడకి గండకత్తెర.

ఆ మధ్య మార్నింగ్ వాక్‌కి వెళ్ళి వస్తూ ఇన్ని మొలకెత్తిన గింజలు, దాంతోపాటు మొలకెత్తిన గింజలు తింటే కలిగే లాభాలు వివరించే ఒక పాంప్లెట్ పట్టుకొచ్చి, పెద్ద లెక్చర్‌దంచి ఆ వెధవ దోసెలూ, గారెలూ మానేసి ఇవి తిను. ఆరోగ్యానికి మంచిదన్నాడు.

"మరి మీరూ?" అందావిడ.



"నాకేం? ప్రెషరూ షుగరూ తప్పించి దుక్కలా వున్నాను. నువ్వే పాపం నడుం నొప్పి, కాళ్ళ పీకులూ అని అవస్థపడుతున్నావు" అంటూ నాలుగు రోజులు ఆవిడచేత మొలకెత్తిన గింజలు తినిపించాడు.

"ఇహ నా వల్లకాదు. ఇవన్నీ తిని బతకడానికి నేనేం గుర్రాన్నా?" అని భర్తకు ఎదురు తిరగాలనుకుంది ఆవిడ.

ఆ అవసరం లేకుండానే ఆ మర్నాడు మళ్ళీ ఈలేసుకుంటూ వచ్చాడాయన. చేతిలో ప్రాణాయామంవల్ల కలిగే లాభాలను తెలియజేసే కాయితంతో.

"ఇదుగో ఇది విన్నావా, ప్రాణాయామం చేస్తే ఆహారం విషయంలో నియమాలు పాటించకపోయినా నష్టం లేదుట" అని నట్టింట్లో చాపవేసి దానిమీద ఆవిడని కూర్చోబెట్టాడు. ఓ ముక్కు మూసి గాలి పీల్చు అని చూపించాడు.

అంతలో ఎవరో బెల్‌కొడితే వెళ్ళి వచ్చిన పేపరు వాడికి ఓ క్లాస్‌పీకి వచ్చాడు. అప్పటి కావిడ కాళ్ళు చాపుక్కూర్చుంది.

"ఏవిటి గాలి వదిలేశావా?" అన్నాడు.

ఆవిడకి చిర్రెత్తుకొచ్చింది

"బావుంది సంబడం. గాలి పీల్చమని చెప్పి మీరు పెత్తనాలకిపోతే మీరొచ్చేంత వరకూ అట్లానే వుంటే నా ప్రాణం గాల్లో కలిసిపోదూ!" అంది విసుగ్గా.

"అది కాదు క్రమబద్ధంగా వదలాలి కదా" అన్నాడు. ఓ నాల్గురోజులు ఆ ప్రాణాయామం కార్యక్రమం నడిచింది.

ఆయన్లో ఒక సుగుణం ఏమిటంటే ఏ పని తలపెట్టినా ఓ నాల్గురోజుల తర్వాత విసుగేసి మానేస్తాడు. కాబట్టి బతికిపోతోంది ఆ ఇల్లాలు. ఇప్పుడెందుకు విజిలేసుకుంటూ వచ్చాడా అని ఆలోచిస్తూ కాఫీ తీసుకుని వెళ్ళింది మైథిలి.

"నీతో చాలా ముఖ్యమయిన విషయం మాట్లాడాలి. నువ్వూ కాఫీ తెచ్చుకుని కూర్చో" అన్నాడు రాఘవరావు.

అలాగే వచ్చి కూర్చుంది. ఆయన చెప్పడం మొదలు పెట్టాడు. ఆ వేళ మార్నింగ్ వాక్‌చేసి కాసేపు విశ్రాంతి కోసం పార్కులో కూర్చుంటే పక్కనే దంపతులు కూర్చున్నారు. సాక్షాత్తూ కైలాసం నుండి దిగివచ్చిన ఆదిదంపతుల్లా వున్నారట.

మాట మాటా కలిసింది. వాళ్ళు ఎన్నో సంవత్సరాలుగా కలిసి రచనలు చేస్తున్నారుట. పేరుకి పేరు డబ్బుకి డబ్బు, కావలసినంత కాలక్షేపం. వాళ్ళ జీవితం గురించి చెప్తుంటేనే ఈయనకి నోరూరిందట.

"వాళ్ళను చూసిన తరువాత నేనో నిర్ణయానికి వచ్చాను" అన్నాడు.

"ఏమిటి వాళ్ళిద్దర్నీ మనింటికి భోజనానికి పిలుద్దామా?" అందావిడ.

"కాదు మనం వాళ్లలా కథలు రాద్దాం"

"ఏడిసినట్లుంది. ఎవరో ఏదో చేశారని మనమూ తయారైతే ఎట్లా? మనం ఏం రాస్తాం?" అంది మైథిలి.

"ఏంకాదు. మనిద్దరికీ అంతో ఇంతో రచనానుభవం వుంది" అన్నాడాయన.

ఆయన నలభై ఏళ్ళ కిందట కాలేజీ మేగజైన్‌కి ఒక ఆర్టికల్ రాశాడు. ఆవిడ పాతికేళ్ళ కిందట పత్రికకి ఒక ఉత్తరం రాసింది. అదే వారి రచనానుభవం.

మన వల్ల కాదంటుంది ఆవిడ. వీల్లేదంటాడు ఆయన. వీళ్ళిలా వాదులాడుకుంటున్న సమయంలోనే ఒక వారపత్రికలో ఒక ప్రకటన కనిపించింది.

ప్రేమ కథలపోటీ. మంచి బహుమతులు. లబ్ధప్రతిష్టులే కాదు. కొత్తవారూ కలాలు పట్టండి అని వూరుకున్న వాళ్ళకు కూడా ఉత్సాహం పుట్టేలా ప్రకటించారు.

తను రచనలు చెయ్యాలనుకోడం, ఇలా ప్రకటన కనిపించడం శుభసూచకంగా తోచిందాయనకు. దానికి తోడు కుడి కన్ను ఠకీఠకీమని కొట్టుకుంది.

ఆవిడ మాట చెల్లలేదు. ఒక మహత్కార్యానికి శ్రీకారం చుట్టబడింది.

ప్రేమకథ కాబట్టి హీరో హీరోయినూ వుండాలి. జయంత్, జయ, ఇక కథ! ఓ రోజంతా ఆలోచించారు.

"ఇలా ఎంతసేపు ఆలోచిస్తాం మొదలు పెట్టు. ఆ తర్వాత కథ అల్లుకోవచ్చు" అన్నాడు రాఘవరావు. ఆయన లేడీస్ ఫస్ట్ అని భార్యకీ అవకాశం ఇచ్చాడు.

"సూర్యుడు తూర్పున ఉదయించాడు"

"మండినట్లే వుంది. సూర్యుడెప్పుడూ తూర్పునే ఉదయిస్తాడు. నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా?" విసుక్కున్నాడు.

"ఇది మరీ బావుంది. కథ అన్న తర్వాత ప్రకృతి వర్ణనలుండాలి. మీకేం తెలుసూ? పెళ్ళానికిరాసే ఉత్తరం కూడా ఆఫీసు ఉత్తరంలా రాస్తారు. కాస్తంత కళాపోషణ కూడా వుండాలి" ఆవిడా విసుక్కుంది.

"ఓయబ్బో అంతోటి కళాపోసన నాకూ వుంది. కానీ ఇక్కడవాళ్ళు కథకి కేటాయించిందే పది పేజీలు. అందులో సూర్యుడు తూర్పున ఉదయించాడు. పడమరన అస్తమించాడు అంటూ కూర్చుంటే ఇక కథేం నడుస్తుంది? కాబట్టి వర్ణనలొద్దు" అన్నాడు.



"ఏదో అందంగా నాలుగు ముక్కలు రాద్దామనుకున్నాను. నా కంత స్వతంత్రం కూడానా! కథ మొదలెడ్తాను" అంది.

"జయంత్ వరండాలోకొచ్చి బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు. విసురుగా వీస్తున్న గాలికి అతని ఒత్తైన నల్లని క్రాఫ్ చెదిరి నుదుటి మీద పడింది"

"ఇకచాలు ఆపు. ఎక్కడ సందు దొరుకుతుందో అని కాచుకు కూర్చుంటావ్. నువ్వేం ఎగతాళి చెయ్యక్కర్లేదు. కాలంనాడు నాకూ ఒత్తైన జుట్టు వుండేది. నీతో వేగలేక ఇదుగో ఈ గతిపట్టింది" ఉక్రోషంగా అన్నాడు. తల మీద మిగిలిన నాలుగు వెంట్రుకలూ సర్దుకుంటూ.

"ఇది మరీ బావుంది. కథలో పాత్రని పొగిడితేనే ఓ ఇదైపోతున్నారు. మీరా ఎదురింటి మైత్రీ మజుందార్‌ని పట్టుకుని మెరుపుతీగలా వుంది అని మెచ్చుకుంటుంటే నేను వినూరుకోడంలేదూ" అని దెబ్బలాటకి దిగింది. ఇక ఆవేళ్టికి కథ ముందుకి నడవలేదు.

మర్నాడు మళ్ళీ కూర్చున్నాడు. ముందురోజు జరిగిన రభస గుర్తొచ్చి జాగ్రత్తగా కథ అల్లింది మైథిలి. "జయంత్ పెందలాడే లేచి మందు వేసుకున్నాడు. వంటింటి దగ్గరికి వెళ్ళి 'జయా డార్లింగ్ షుగరు మందేసుకున్నాను. అరగంటాగి టిఫిన్ తిని ప్రెషరు మందేసుకుని పళ్ళ డాక్టర్ దగ్గరికెళ్ళాలి' అన్నాడు" అంటూ కథ చెప్పింది.

"ఏమన్నా అంటే నోరెట్టుకు పడిపోతావ్. నీకీ మధ్య వెటకారం ఎక్కువైంది. నన్నేడిపించడానికి కాకపోతే వయసులో వున్న జయంత్‌కి షుగరూ, ప్రెషరూ వుంటాయా? అది చాలక పళ్ళడాక్టరు కూడానూ?" అని భార్యమీద విరుచుకుపడ్డాడు రాఘవరావు.

"అదంటే అదంటారు ఇదంటే ఇదంటారు. నేనేం కథలు రాయాలని ఏడిచిపోతున్నానా! నా వల్లకాదు" అంది. వ్యవహారం బెడిసికొట్టేసరికి మెత్తబడి భార్యని బతిమాలాడు. సరే అందావిడ. కానీ ఓ షరతు పెట్టింది. ఎవరిదోవన వాళ్ళు రాయాలి అంది.

"అలా అయితే చెరో దోవ్వా అయిపోదా?" అన్నాడాయన. అలా అయితే చెరో ఐదు వాక్యాలూ రాయాలి. ఒకరు రాసింది ఇంకొకరికి నచ్చకపోయినా సున్నితంగా విమర్శించాలిగాని విరుచుకుపడకూడదు. ఇలా సవాలక్ష నిబంధనలు ఏర్పరచుకున్నారు.

మళ్ళీ కథలోకి వెళ్ళారు. మైథిలి కథ చెప్పసాగింది.

"జయ కెంపుల నెక్లెస్ పెట్టుకుంది. జయంత్‌కి భార్య అంటే చాలా ప్రేమ. బంగారం ఎందుకు దండగ అని విసుక్కోడు. నీ ఆనందంకంటే నాకేం కావాలి జయా అని నగలు కొనిపెడతాడు. అంతే కాదు నువ్వు పెట్టుకుంటే ఆ నగకే అందం వచ్చిందని మెచ్చుకుంటాడు" అని అయిదు వాక్యాలూ ముగించింది.

రాఘవ్‌కి చిరాకువేసింది కానీ నియమావళి గుర్తొచ్చి ఆగిపోయాడు. "జయ నెక్లెస్ పెట్టుకుందంటే చాలదా! భర్త మెచ్చుకోవడంలో వింతేముంది. ఏ మొగుడైనా మెచ్చుకుంటాడు" అన్నాడు కినుకగా.

"ఏమోలెండి భార్య కొత్త చీరె కట్టుకుని ఎదురుగా తిరుగుతున్నా పట్టించుకోక పేపరు చదువుకునేవాళ్ళు సవాలక్షమంది తెలుసు నాకు" అంది మైథిలి.

ఆయన పళ్ళుకొరుక్కుని కథ మొదలుపెట్టాడు. "అలంకరించుకుని అమ్మ వార్లా తిరక్కుండా భర్తకి టిఫిన్ పెట్టింది జయ. దూదుల్లాంటి ఇడ్లీలు పెట్టింది. వాటిపై కమ్మని నెయ్యివేసింది, వేడి సాంబారు, అల్లంపచ్చడి, కొబ్బరిపచ్చడి, కారప్పొడీ వేసింది. లోపలికి వెళ్ళి ఎర్రగా కాల్చిన పెసరట్టు లోపల జీడిపప్పు ఉప్మాతో..." చెప్పుకుపోతూంటే ఆపేసింది.

"ఇక చాలాపండి. మీ అయిదు వాక్యాలూ అయిపోయాయి. కాఫీకీ చోటు లేదు" గుర్తుచేసింది.

"అప్పుడే అయిపోయాయా?" నీరసపడ్డాడు.

"నాకు తెలీక అడుగుతాను. అన్ని చెయ్యడానికి ఆవిడ హోటలు నడుపుతోందా?" అంది మైథిలి.

"హోటలేం నడపక్కర్లేదు. మొక్కుబడిగా మొగుడి మొహాన ఇంత పడేసే వాళ్ళే కాదు అనువుగా వండిపెట్టే పతివ్రతామతల్లులూ వున్నారు" అన్నాడతను.

ఆవిడ కథ మొదలయింది.

"సుష్టుగా తిని వెళ్ళిపోలేదు జయంత్. జయా నువ్వూ తిను అన్నాడు. అనడమే కాదు. దగ్గరుండి తినిపించాడు. అంతలో చీరెల మూటలవాడు వచ్చాడు. అమ్మగారూ చీరెలు తీసుకుంటారా అన్నాడు" చెప్తోంది మైథిలి.

"ఇక ఆపు. నీ అయిదు వాక్యాలూ అయిపోయాయి. ఆ మూటలవాడొకడు నా ప్రాణానికి యముడిలాగా, నెలకోసారొచ్చి అంటకత్తెరవేసి పోతాడు. ఇక కథలో కూడా వాడే నా నక్షత్రకుడిలాగా?" అడ్డుపడ్డాడాయన.



"వద్దులేవయ్యా, ఇంటినిండా పడున్నాయి చీరెలు. అయినా చీరెల మీద పెట్టడం డెడ్ ఇన్వెస్ట్‌మెంట్. దానికి బదులు ఏ మ్యూచ్యువల్ ఫండ్‌లోనో పెడితే డివిడెండ్ అయినా వస్తుంది అంది జయ తెలివిగల ఇల్లాలు కాబట్టి" ఆయన కథ ముగిసింది.

ఆ విధంగా ఇద్దరూ ఎడాపెడా రాసి పారేశారు.

ఇరవై పేజీలు అయింది కథ. దాన్ని చీల్చి చెండాడి పది పేజీలకు కుదించారు. పార్కుల్లో షికార్లూ రాసుకు పూసుకు తిరగడాలే లేవుగాని బానేవుంది. ఈ ప్రేమ కథ అని కథల పోటీకి పంపించేశారు.

*స్వాతి వారపత్రిక, 24 ఫిబ్రవరి 2006*

# ప్రసాదరావూ-వంట సరస్వతీ

'ఎంత మాటనేసింది! ఎంత ధైర్యం? ఎంత పొగరు? అమ్మో ఇప్పుడే ఇట్లా వుంటే రేపు రిటైరయిన తరువాత ఇంట్లోంచి వెళ్ళగొడుతుందేమో, ఇక లాభంలేదు దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. చేతులు కాలకుండానే ఆకులు పట్టుకోవాలి' అనుకున్నాడు ప్రసాదరావు.

కూర్చున్నా నుంచున్నా భార్య మాటలే గుర్తు వస్తున్నాయి. ఇంతకీ తనేమన్నాడనీ. కొడుకు ఫోన్‌చేశాడు. వాళ్ళ అత్తగారికేదో అవసరంవచ్చి ఊరెళ్ళాలిట. కోడలు బాలింత. ఒక నెలరోజులు అమ్మని పంపిస్తారా? అని అడిగాడు. ఓ దానికేం వస్తాను అంది సరస్వతి.

'నాకూ చాలా సెలవులు మిగిపోయాయి. నేనూ రానా పోనీ' అన్నాడు తను. అడిగినందుకైనా తీసికెళ్ళచ్చు, లేదా మర్యాదగా కాదనవచ్చు. అంతేగానీ 'మీరెందుకు నా వెంట గుదిబండ లాగా. ఇక్కడే వుండండి' అనేసింది. అదేవిటంటే పెద్ద పురాణం చదివేసింది.

'మీకే మీ చేతకాదు. డేరా మేకులాగా నిలబడితే అన్నీ నేనే అందించాలి. కాళ్ళకీ చేతులకీ అడ్డం తగుల్తారు. ఇంట్లో అయితే ఎలాగా తప్పదు. పొరుగూరికి కూడా ఎందుకు సంబడం' అనేసి వెళ్ళిపోయింది.

ఇంటి వ్యవహారాలన్నీ ఆవిడగారే చూసుకుంటుంది. నిజమే, అదేం గొప్ప. తను నెల తిరిగేసరికి కుడుముల్లా రూపాయలు తెచ్చిస్తేగా ఈవిడ ఆటలు సాగేది.

ఏవిటంత పొగరూ అంటే బయటి పనులు ఉదాహరణకి బేంకు పనులు, షాపింగు అన్నీ ఆవిడ చెయ్యగలదుట. ఇంటిపని తనకు ఇసుమంతైనా రాదుట.

అదేం ఖర్మమో చిత్తశుద్ధితోనే వెతికినా తనకు ఏ వస్తువూ కనిపించదు. ఆవిడగారొచ్చి చిటికెలో తీసి ఇచ్చేస్తుంది. పండగరోజు ఒకసారి ఎప్పుడో తను పనిలో వుండి అలమర్లోంచి కొత్త లుంగీతీసి పసుప్పెట్టి కట్టుకోమంటే అలమర్లో వెతికి కొత్త పేకెట్‌లోంచి లుంగీతీసి పసుప్పెట్టి కట్టుకున్నాడు. 'కొత్తరకం డిజైను



బాగానే వుంది సరస్వతీ' అని వంటింటి దగ్గరకు వెళ్ళి చూపిస్తే పడీ పడీ నవ్వింది, అది సింగిల్ బెడ్‌షీటుట.

'ఇంకా నయం పసుప్పెట్టి దిండు గలీబు బనీను లాగా తొడుక్కోలేదు' అంది నవ్వుతూ

ఆ విషయం అడిగినవాడికీ, అడగనివాడికీ కూడా చెప్పేసింది. వాళ్ళంతా ఒకటే నవ్వడం. పోనీ కదా పన్లోవుంది అని సాయం చేస్తే ఇదీ ఫలితం. ఎంత పనిమంతురాలైతే మాత్రం అంత పొగరా? ఏవిటావిడకి వచ్చిందీ తనకు రానిదీను. ఆ బోడి వంటేగా.

తను తల్చుకుంటే చిటికెలో నేర్చుకోగలడు. సరస్వతి వచ్చేలోగా వంట నేర్చుసుకోవాలి. గట్టి నిర్ణయానికి వచ్చి ఆ ప్రయత్నం మొదలెట్టాడు. ఆఫీసులో పనిచేసే పరమశివాన్ని పిలిచి 'నాకు అర్జెంటుగా వంటమనిషి కావాలి' అని చెప్పాడు. అరగంటకి ఒకావిడని పట్టుకొచ్చాడు పరమశివం. ఆవిడచేసిన ఉప్మాతిని అరగంటలో ఆవిడకి ఉద్వాసన చెప్పాడు ప్రసాదరావు. అలా అరడజను మందిని వెళ్ళగొట్టాక సరస్వతి అంత బాగా కాకపోయినా ఆవిడ వంటకి దరిదాపుల్లో వుండేలా వంటచేసింది ఒకమ్మాయి. కాకతాళీయంగా ఆ అమ్మాయి పేరుకూడా సరస్వతే. రెండుపూటలా కాఫీ, టిఫిన్, భోజనం వండి పెట్టడానికి నెలకి వెయ్యి రూపాయలు కావాలి అంది. "రెండు వేలు ఇస్తాను. వంట నేర్పుతావా?" అని అడిగాడు.

ఆశ్చర్యపోయింది. "మీరు వంట నేర్చుకుంటారా? ఎందుకు?" అడిగింది. విషయం అంతా చెప్పేశాడు. కొంగు అడ్డం పెట్టుకుని నవ్వింది వంట సరస్వతి.

"ఆవిడేదో చిరాకులో అనుంటారు. ఈ భాగ్యానికి వంట నేర్చుకోవాలా? నన్ను పర్మనెంట్‌గా పన్లో పెట్టుకోండి. పిన్నిగారు వచ్చాక కూడా నేనే వండిపెడతాను"

"వంట మనిషిని పెట్టుకోవడం ఆవిడ ఇష్టం నాకు మాత్రం వంట నేర్పాలి నువ్వు. విద్య వచ్చి వుండడం ఎందుకైనా మంచిదేగా" అన్నాడు పంతంగా.

"సరే మీ ఇష్టం బాబాయిగారూ" అంది నవ్వుతూనే.

"చూడు వంట సరస్వతీ. అలా వరసలు పెడితే సెంటిమెంటు అడ్డం వచ్చేస్తుంది. ఇక్కడ నువ్వు గురువ్వి నేను శిష్యుడిని. కాబట్టి ప్రసాదరావ్ అనే పిలు. నేను సరస్వతీ అంటాను. రేపటినించే పని మొదలు పెడదాం. మనకింకా పదిహేనురోజులే వుంది. రేపటినించీ సెలవు పెడతాను. ఆవిడ వచ్చేలోగా పూర్తిగా వంటలో ప్రవీణుడిని చేసెయ్యాలి" అన్నాడు.

రాత్రి లిస్టు తయారు చేశాడు. టిఫిన్లు వారానికి సరిపడా ఇడ్లీ, దోసె, ఉప్మా పూరీ, ఊతప్పం, పెసరట్టు, వడ. పొద్దున వంటలోకి పదిహేను రకాల కూరలు, పచ్చళ్ళు, రాత్రి వంటకి మరో పదిహేను రకాల వేపుళ్ళ జాబితా తయారు చేశాడు. లిస్టు చూసుకుని మురిశాడు.

ఈ మాత్రం దానికి, 'టిఫిను ఏం చెయ్యను, వంట ఏం చెయ్యను అని హైరానా పడిపోతుంది సరస్వతి. ఎంతైనా మగవాడి తెలివితేటలు ఆడదానికెలా వస్తాయి?' అనుకున్నాడు. మర్నాడు సరస్వతి రాగానే, "వంట సరస్వతీ ఇవన్నీ నాకు నువ్వు నేర్పాలి" అన్నాడు. పది పేజీలు వున్న ఆ జాబితా చూసి నోరావలించిందామె.

"చాలా ఇవన్నీ?" అడిగింది సరస్వతి.

"ఇవికాక ఇంకా చాలా నేర్చుకోవాలి" అన్నాడు.

"సరేలే పద" అని కుక్కరు తియ్యబోతే వారించాడు.

"అలా కాదు నాకు చెప్పు. నేను చేస్తా" అన్నాడు.

"సరే ముందు బియ్యం, కందిపప్పు పట్టుకురా!" అంది కుర్చీలో కూర్చుని. బియ్యం తెచ్చి ఇచ్చి కందిపప్పుకోసం వెళ్ళినవాడు అక్కడే ఉండిపోయాడు.

"ఏం చేస్తున్నావు ప్రసాదరావ్?" అంది సరస్వతి.

"పప్పుకోసం వెతుకుతున్నా" అన్నాడు. వెళ్ళి చూస్తే స్టీలు డబ్బాలన్నీ దించి మూతలు తీసి పెట్టివున్నాయి. ఇంకా డబ్బాలు దించుతుంటే అడ్డుపడింది.

"ఇదుగో ఇక్కడే వుందిగా కందిపప్పు" అంది.

"ఏదీ? ఎక్కడా?" కళ్ళజోడు సర్దుకుంటూ అడిగాడు.

"ఇదుగో, ఇక్కడ" అంది సరస్వతి.

"ఓ! వండకముందు ముద్దపప్పు ఇట్లా బద్దలుగా వుంటుందా? నేనింకా ముద్దపప్పు డబ్బాలో కూడా పప్పులాగానే వుంటుందేమో అని వెతుకుతున్నా" అన్నాడు.

తలబాదుకుంది. "చంపావు పో. వండకముందు పప్పెలా వుంటుందో తెలియనివాడివి నువ్వు వంటేం నేర్చుకుంటావు ప్రసాదరావ్?" అంది దీనంగా.

"నేర్చుకుంటాలే సరస్వతీ, తెలియక అస్తవ్యస్తాన పడ్డానుగానీ తెలుసుకున్నాక పులిని" అన్నాడు.

"సరే పద, పనొప్పుకున్నాక తప్పుతుందా?" అని కుర్చీలో కూర్చుని "ఒక పావు బియ్యం, అరపావు కందిపప్పు విడివిడిగా ఆ కుక్కర్ గిన్నెల్లో పొయ్యి. కుక్కర్‌లో



గ్లాసెడు నీళ్ళు పోసి పొయ్యిమీద పెట్టు. గ్యాస్ వెలిగించు. ఇప్పుడు బియ్యం, పప్పు కడుగు, త్వరగా కడిగెయ్. అవతల నీళ్ళు తెర్లుతున్నాయి" చకచకా చెప్తూ అనుమానం వచ్చి లేచి చూసింది. పప్పు బియ్యం సగంపైగా సింకులో పడిపోయాయి. మరోసారి తలబాదుకుని.

"నీకు ఏబీసీడీలు కూడా రావు ప్రసాదరావు. నేను కూర్చుని నీచేత చేయిస్తే కొంప కొల్లేరవుతుంది గానీ, ముందు రెండు రోజులు నా వెనకే వుండి ఫండమెంటల్స్ నేర్చుకో..." అని కసిరింది సరస్వతి.

ఎదురుచెప్పబోయి మానేశాడు ప్రసాదరావు.

కుక్కరుపెట్టి "ఫ్రిజ్‌లోంచి వంకాయలు తీసుకురా. అంగుళం ముక్కలు తరుగు. అంగుళం అన్నా కదా అని స్కేలు కోసం పరిగెట్టకు. సుమారుగా చూసి తరిగి ముక్కలు నీళ్ళలో పడెయ్. తరిగేక నీళ్ళల్లో వెయ్యమన్నా కదా అని ముందే కడగడం మానకు. కడిగి తరుగు. వేళ్ళుకోసుకోకు" అని చెప్తుంటే చెమటలు కక్కుతూ కూర తరిగాడు.

"వెరీ గుడ్. ఇప్పుడు వెళ్ళి మినప్పప్పు తీసుకురా. నానబోసి రుబ్బితే రేపు ఇడ్లీలు వండుకోవచ్చు. మినప్పప్పు ఇడ్లీలా వుండదు. చిన్నగా తెల్లబద్దల్లా వుంటుంది" అని చెప్పింది. మళ్ళీ వెళ్ళి డబ్బాలన్నీ దింపసాగాడు.

"అదేంటి. డబ్బాలన్నీ దింపుతావేం?" అంది.

"మరెలా తెలుస్తుంది. ఏ డబ్బాలో ఏం వుందో?"

"ఒక సులువు చెప్తానుండు" అంటూ ఒక్కో డబ్బాతీసి ఆడించి "ఇదుగో చూడు ఇది పెసరపప్పు. ఇది శనగపప్పు. ఇలా శబ్దంబట్టి తెలుస్తుంది. ఒక రోజులో తెలియదనుకో. రోజూ వాడే వాళ్ళకి డబ్బాలు గుర్తుండిపోతాయి. ఇప్పుడు నువ్వు ఆడించి చూడు" అంది.

వెంటనే ఓ డబ్బాతీసి బలంగా ఆడించాడు. మూత ఊడి శనగపిండి ఒళ్ళంతా పడింది. పగలబడి నవ్వింది. "పిచ్చి ప్రసాదరావూ? రెండో చేత్తో మూతపట్టుకోవద్దూ. ఇంకా నయం కారం డబ్బా ఆడించావు కాదు. కథాకళి చెయ్యాల్సి వచ్చేది" అంది నవ్వుతూనే.

"ఇప్పుడేం చెయ్యమంటావు?" అడిగాడు.

"స్నానం చేసిరా" అని చెప్పింది సరస్వతి. స్నానంచేసి వచ్చేసరికి వంట అయిపోయింది.

"అదేవిటి నేనొచ్చాక చేస్తే నేనూ చూసేవాడినిగా" అన్నాడు.

"పన్నెండు దాటింది. నేను వేరేచోట వంటకివెళ్ళాలి. సాయంత్రం పెందలాడే వచ్చి నేర్పుతానులే" అంది.

భోజనంచేసి పడుకున్నా శనగపిండి డబ్బా గుర్తుకి వచ్చి నిద్రపట్టలేదు. వెంటనే లేచి తయారై వెళ్ళి పెర్ల్‌పెట్ సీసాలు కొనుక్కొచ్చేసి సరుకంతా ఆ డబ్బాల్లోకి మార్చాడు.

సాయంత్రం సరస్వతి వచ్చి "బానే వుంది. ఇంతింతేసి ఖర్చుపెట్టడం మా ఆడవాళ్ళవల్ల కాదమ్మా, వున్నదాంట్లోనే సర్దుకుపోతాం" అంది.

"అవునవును. ఇలాంటి చిన్నవన్నీ పిక్కించి వేలకు వేలు పోసి అనవసరంగా బంగారం కొని దాచిపెట్టడంలో సిద్ధ హస్తులు మీ ఆడవాళ్ళు" అన్నాడు ప్రసాదరావ్.

"సర్లే పద వంటచేద్దాం" అంది సరస్వతి.

ఆ పూట వంట వేపుడు ముక్కలూ, చారూ, పెసరపచ్చడీ, రాత్రి పడుకున్నాక పొద్దుటినించీ జరిగిన వంట కార్యక్రమం నెమరు వేసుకున్నాడు ప్రసాదరావు. సరస్వతి ఆరేడుసార్లు తిరగమోతలు పెట్టింది.

ప్రతిసారీ మూకుడు కాలేసి నూనె వెయ్యనూ, తిరగమోత డబ్బాతీసి దినుసులు వెయ్యనూ, చిన్నడబ్బాలోంచి కరివేపాకు తీసివెయ్యను, మళ్ళీ ఇవన్నీ సర్దనూ, మళ్ళీ తియ్యనూ చాలా హైరానా పడింది. ఇంతకంటే సులువైన మార్గం కనిపెట్టాలి. సీరియస్‌గా ఆలోచించాడు. వెంటనేలేచి వంటింట్లోకి వెళ్ళి మూకుడు వేడి చేసి అందులో సగందాకా నూనె పోసి, దోసెడు ఎండుమిరపకాయలు వేసి తిరగమోత డబ్బాలో సరుకులన్నీ వేసేసీ, దోసెడు కరివేపాకువేసి, మరికొన్ని దినుసులువేసి, ఇంగువ డబ్బా మొత్తం పంచేసి భారీ ఎత్తున తయారుచేసి దాన్ని ఒక గిన్నెలోవేసి చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టాడు.

మర్నాడు సరస్వతి రాగానే "సరస్వతీ నీకోటి చూపిస్తాను" అంటూ ఆ గిన్నె తెచ్చి చూపించాడు.

"ఏవిటీ బ్రహ్మ పదార్థం?" అంది ఆశ్చర్యంగా.

"చూశావా నువ్వు కూడా గుర్తుపట్టలేకపోయావు. ఇది తిరగమోత. మాటి మాటికి అవస్థపడకుండా ఓ చెంచాడు తీసి వేసేసుకుంటే నెల్లాళ్ళు వస్తుంది. ఎలా వుంది నా ఐడియా?" అన్నాడు ప్రసాదరావు గర్వంగా.

"మండినట్లే వుంది. పెసరపచ్చడిలో తిరగమోత వేరు, కొబ్బరిపచ్చడికి వేరు, కూరకి వేరు, చారుకి వేరు, ఇంగువేసి బీరకాయకూడా చేస్తే ఇక జన్మలో బీరకాయ



ముట్టవు. అదీగాక దీన్లో పావుశేరు ధనియాలు కూడా పోశావు. ఇంకెందుకు పనికొస్తుంది" అంది విసుగ్గా.

అంటే నా ప్రయోగంవల్ల ప్రయోజనం లేదా? ఇదెందుకూ పనికి రాదా?" అని అడిగాడు దీనంగా.

"అందులో వేసిన జీడిపప్పులూ, వేరుశనగపప్పులూ ఏరి పక్కనపెట్టు. కాస్త ఉప్పుజల్లి ఇస్తా తినేసెయ్. మిగిలింది చెత్తబుట్టలో పారెయ్. తీరికూచుని వంద రూపాయల సరుకు తగలేశావు" అంది.

చిన్నబుచ్చుకుని ఆ పనిచేశాడు. వారం రోజులు గడిచినా ప్రసాదరావు వంట ముందుకి సాగలేదు.

"ఏవిటిది సరస్వతీ. ఈ వంట ఏ వెధవ కనిపెట్టాడో గానీ ఓ పద్ధతీ పాడూ లేవేం. మాకు చూడు సిమెంటూ ఇసకా నీళ్ళు ఇన్ని పాళ్ళల్లో కలిపితే సిమెంటు మిక్చర్ తయారవుతుంది. అలాగే కాంక్రీటుకి ఇంత. ఎంత బిల్డింగుకి ఎన్ని పిల్లర్లు వుండాలి. ఎంత ఇనుము వాడాలి. అన్నీ ఓ పద్ధతి ప్రకారం నిర్ణయం అయివుంటుంది.

ఈ వంట అలా కాదే. ఇడ్లీ పచ్చడికి ఎండు మిరపకాయలు పనికిరావు. కందిపచ్చడికి పచ్చిమిర్చి పనికిరాదు. దోసకాయపచ్చడికి ఏ మిరపకాయైనా వేసేయొచ్చు. వంకాయ నీళ్ళల్లోకి తరగకపోతే కనరు వస్తుంది. బెండకాయ నీళ్ళల్లోకి తరిగితే జిగురొస్తుంది.

ఇన్నేళ్ళనించీ వంటచేస్తున్నారు. ఒక పద్ధతి కనిపెట్టలేకపోయారు. ఇలా ఐతే మీ ఆడవారికి ఫర్వాలేదు గానీ కొత్తగా చెయ్యికాల్చుకునే మాలాటివాళ్ళ సంగతి ఏమిటి? అంతా గందరగోళంగా వుండదూ?"

"వంటలోవున్న మహత్యం అదేమరి" అతని అంత పొడుగు ప్రశ్నకీ అతి చిన్న సమాధానం చెప్పింది.

మరైతే కిం కర్తవ్యం. వారం రోజుల్లో నా ఇల్లాలొచ్చేస్తుంది. నువ్వు పక్కన లేకుండా ఏ పనీ చెయ్యలేకపోతున్నాను. నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరేనా?" అన్నాడు దీనంగా.

"చూడు ప్రసాదరావూ! వంట నేర్చుకుని నీ భార్యచేత శెభాషనిపించుకోవాలనే నీ ఆశయమైతే బాగానే వుందిగానీ ఏనాడూ మంచినీళ్ళు కూడా ముంచుకు తాగని నువ్వు పదిహేనురోజుల్లో వంట మొత్తం నేర్చుసుకోవాలనుకోవడం అత్యాశ. నువ్వెంత

హైరానాపడినా ఈ వయసులో రాదు. నా మాట విను. తేలికైనవి నాలుగైదు నేర్చుకో" అంది.

తర్వాత వారం రోజులూ గిర్రున తిరిగి వచ్చాయి. కమ్మగా ఉప్మా చెయ్యటం నేర్చుకున్నాడు. పూరీ కూడా బాగానే చేశాడుగానీ గుండ్రంగారాలేదు. ఫర్వాలేదు డబ్బామూతతో కట్‌చెయ్యి అని చెప్పింది సరస్వతి. రెండు కూరలూ, రెండు పచ్చళ్ళు నేర్చుకున్నాడు. మల్లె పువ్వులా అన్నం  వండడం వచ్చేసింది.

"ఇంకేం. ఇక నీకు తిరుగులేదు. అప్పట్లో నలభీములూ ఇప్పుడు నువ్వు వంట సరస్వతి డ్యూటీ ఆ పూటతో ముగిసిపోతోంది. మర్నాడు ఇంటి సరస్వతి వచ్చేస్తుంది.

రెండువేలు తెచ్చి సరస్వతికి ఇచ్చాడు ప్రసాదరావు.

"ఇదేవిటి నెలకి వెయ్యి, వంటనేర్పితే రెండు వేలనుకున్నాం కదా. వంట నేర్పనేలేదు. ఆ లెక్కన నెలకి వెయ్యి, పదిహేనురోజులకి ఐదువందలు చాలు"

"ఫర్వాలేదులే వుంచు సరస్వతీ. వంట నేర్పలేదేమో గానీ చాలా చాలా నేర్పావు?" అన్నాడు.

"ఏం నేర్పాను?" అన్నది సరస్వతి.

"వంట చెయ్యడం ఎంత కష్టమో నేర్పావు. ఈ పది హేనురోజుల్లో నేను చాలా విషయాలు తెలుసుకున్నాను. డబ్బు తెచ్చిపడేస్తే సంసారం దిద్దడం, వంట చెయ్యడం ఓ గొప్పా అనుకునేవాడిని. అదెంత కష్టమో తెలిసి వచ్చింది. నిజం చెప్పాలంటే దానిమీద పంతంతో ఈ పని మొదలు పెట్టాను. ఇప్పుడాలోచన మారింది.

"ఇంతకాలం నా భార్యకి ఏనాడూ సెలవంటూ లేదు. దినం అస్తమానం పనే. రిటైర్ అయ్యాక వేరే ఉద్యోగం చెయ్యాలనుకునేవాడిని. ఇప్పుడా అభిప్రాయం మారింది. ఇంట్లోనే వుండి నా భార్యకి తోడుగా వుంటాను. ఈ వయసులో నేను సంపాదించే మరికొన్ని వేలరూపాయలకంటే నా ఆసరా అవసరం దానికి, ఏనాడైనా అది బద్దకిస్తే నాకొచ్చిన కూరా పచ్చడీచేసి దానికి అన్నం పెడతాను. నాకీ వంటనేర్పింది నువ్వే కదా" అన్నాడు.

"పిన్నిగారు అదృష్టవంతురాలు ప్రసాదరావ్" అంది వంట సరస్వతి చెమర్చిన కళ్ళతో నవ్వేస్తూ.

(కామెడీ కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ)

స్వాతి వారపత్రిక, *22 అక్టోబర్ 2004*



# అప్పిచ్చువాడు-వైద్యుడు

కాలింగ్‌బెల్ మోగింది.

సోఫాలో కూర్చుని ప్రశాంతంగా పేపరు చదువుకుంటున్న ఆనందరావు అదిరిపడి పేపరు కిందపారేసి "శశీ, శశీ" అంటూ వంటింటివైపు పరిగెత్తాడు.

ఈ ఉపద్రవం ఊహించి చేతిలో పని వదిలేసి హాల్లోకి వచ్చింది శశికళ. అమాంతం తనని కావలించుకుని వణికిపోతున్న భర్తను చూసి జాలిపడింది.

మళ్ళీ కాలింగ్‌బెల్ మోగింది. "వచ్చేశాడు మళ్ళీ అప్పులవాడొచ్చేశాడు" అన్నాడు దీనంగా.

ఫ్చ్. సింహంలా వుండే మనిషి ఎలా అయిపోయాడో" అనుకుంది శశి. "మీరూరుకోండి నేను చూస్తాగా!" అంటూ అతన్ని ఓదార్చి ధైర్యం చెప్పింది.

ముచ్చటగా మూడోసారి మోగింది కాలింగ్ బెల్.

వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా చిదంబరం. ఆనందరావు పాతఫ్రెండ్. "ఏవండీ చిదంబరంగారు వచ్చారు" అని చెప్పింది సంతోషంగా.

"చిదంబరమా! అప్పులవాడు కాదా!" అంటూ హాల్లోకి వచ్చాడు ఆనందరావు.

"మీరు మాట్లాడుతూ వుండండి. నేను కాఫీ తెస్తాను" అని వంటగదిలోకి వెళ్ళింది శశికళ.

స్నేహితులిద్దరూ కూర్చున్నారు.

"ఏమిటి ఆనందరావ్? ఎలా వున్నావ్? అదోలా వున్నావేం?" అంటూ పలకరించాడు చిదంబరం.

"ఏం లేదులే. బానేవున్నాను" అంటూ నీరసంగా నవ్వేడు ఆనందరావు.

శశికళ కాఫీలు తెచ్చింది. ఇద్దరికీ ఇచ్చింది.

కాఫీ తాగుతుండగా టెలీఫోన్ మోగింది. అదిరిపడి కాఫీ మీద పోసేసుకున్నాడు ఆనందరావు. "మళ్ళీ ఫోనొచ్చింది. ఏ అప్పులవాడో" అన్నాడు దీనంగా.

భర్తవంక దీనంగా చూసి ఫోన్ తీసింది శశికళ.

"సారీ రాంగ్ నెంబర్. ఇక్కడ వెంకట్రామిరెడ్డి అనే పేరుగలవాళ్ళెవరూ లేరు" అనేసి ఫోన్ పెట్టేసి లోపలికెళ్ళి ఓ తువ్వాలు తడిపి తెచ్చింది. దాంతో మీదపడిన కాఫీమరకలు తుడుచుకున్నాడు ఆనందరావు.

ఇదంతా చూస్తూ ఆశ్చర్యపోయాడు చిదంబరం. ఈ అప్పులవాళ్ళ గోలేంటీ? ఇతను ఇంతగా బెదిరిపోవడం ఏమిటి? వీళ్ళకి ఇలాంటి ఆర్థికదుస్థితి వచ్చే అవకాశాలు లేవే! పిల్లలిద్దరూ అమెరికాలో వున్నారు. ఇల్లూ వాకిలీ వున్నాయి. తను పనిచేస్తున్న కంపెనీ మూతపడే పరిస్థితి వస్తుందని ముందు జాగ్రత్తపడి, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఆ వచ్చిన డబ్బు బ్యాంకులో వేసుకున్నాడు. మరీ అప్పుల గొడవేమిటి? కాసేపు తర్జనభర్జన పడి చివరికి వాళ్ళనే అడిగేశాడు.

"ఏం చెప్పమంటారు. అంతా మా ఖర్మ" అంది శశికళ.

ఒక సంవత్సరం కిందట ఓ రోజు పొద్దున్నే ఓ అబ్బాయి వీళ్ళింటికి వచ్చాడు. చక్కగా టిప్‌టాప్‌గా తయారై రాజకుమారుడిలా వున్నాడు.

"గుడ్ మార్నింగ్ సార్. నా పేరు రాజేష్. నేను స్వీటీ ఫైనాన్స్ కంపెనీనించి వస్తున్నాను" అన్నాడు.

"అలాగా ఏం పనిమీదొచ్చారు?" అడిగాడు.

"మేము మీకు అప్పు ఇవ్వాలని వచ్చాం"

ఆశ్చర్యపోయాడు ఆనందరావు. "అప్పా? నాకెందుకిస్తారు? నేను అడగలేదే" అన్నాడు.

ఫెళ్ళున నవ్వి "భలేవారే. ఏ కాలంలో వున్నారు? అడిగితేనే అప్పిచ్చేరోజులు ఏనాడో పోయాయి. అడిగి అప్పిచ్చేరోజులొచ్చాయి" అన్నాడు రాజేష్.

"ఏమో, వచ్చాయి కాబోలు. నాకు అప్పుచెయ్యాల్సిన అవసరం లేదు. అగత్యం అంతకంటే లేదు".

"అప్పుకి అవసరం ఏమిటి సార్. సరదాగా తీసుకోవచ్చు. మేము మీకో లక్ష అప్పు ఇస్తాం. మీరు నెల నెలా కొంత పైకం చొప్పున రెండేళ్ళకి తీరుస్తారు. చూడండి ఎంత సుఖమో, ఈ లక్షతోనూ మేడమ్‌కి డైమండ్ నెక్లెస్ కొన్నారనుకోండి. ఆవిడ ఎంత ఆనందిస్తారు? ఒక్కసారి ఎలాగూ కొనలేరు. ఇలా నెలకింత అంటే సునాయాసంగా కొనొచ్చు" అంటూ చెప్పాడు.



అప్పటిదాకా అక్కడే కూర్చున్న శశికళ గభాల్న లేచి వెళ్ళి కూల్‌డ్రింక్ తెచ్చి ఇచ్చింది. "మనీ తీసుకుందామండీ. అటు ఆ అబ్బాయి సరదా తీరుతుంది. వజ్రాల నెక్లెస్ కొనుక్కోవాలనే నా సరదా తీరుతుంది" అంది.

ఆవిడ అలా అనేసరికి రాజేష్ మరిన్ని కబుర్లు చెప్పి ఊరించాడు. మర్నాడు తనే వచ్చి వాళ్ళాఫీసుకు తీసుకెళ్ళి బోలెడన్ని కాయితాలమీద సంతకాలు పెట్టించుకుని వెంటనే లక్షరూపాయలూ ఇతని బ్యాంక్ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించేశాడు. మళ్ళీ రాజేష్ భద్రంగా తీసుకొచ్చి ఇంటిదగ్గర దింపి వెళ్ళాడు.

శశికళ తయారై సిద్ధంగా వుంది. "మరి బజారుకెళ్ళి డైమండ్ నెక్లెస్ కొనుక్కొద్దామా" అంది.

"సాయంత్రం వెళ్దాం" అని స్వీటీ ఫైనాన్స్‌వారిచ్చిన కాయితాలు మరోసారి చదివేసరికి కళ్ళు తిరిగాయి ఆనందరావుకి. అన్నీ కూడుకుంటే లక్షమీద రెండేళ్ళకి నలభైరెండువేలు అదనంగా కట్టాల్సి వస్తుంది.

వెంటనే ఫైనాన్స్ కంపెనీని ఫోన్‌చేసి ఇదేం అన్యాయం. వడ్డీ లేదన్నారుగా అంటే "అబ్బే రామరామ, అది వడ్డీ కాదు. హేండిలింగ్ ఛార్జెస్. డాక్యుమెంటేషన్ ఛార్జీలు, సెక్యూరిటీ ఛార్జీలూ" అన్నారు.

"అవ్వ పేరే ముసలమ్మ. ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోడానికి. మీ అప్పులూవద్దు ఏం వద్దు. ఇప్పుడే తిరిగి ఇచ్చేస్తాను. మీ లక్షా మీరు తీసుకోండి" అన్నాడు ఆనందరావు చిరాగ్గా.

"ఆశ, దోశ, అప్పడం, వడ. ఇప్పుడు కట్టినా లక్షా నలభై రెండువేలూ కట్టాల్సిందే" అన్నారు ఫైనాన్స్‌వాళ్ళు.

"నేను కోర్టుకి వెళతాను. మీ భరతం పడతాను" అన్నాడు ఆనందరావు ఆవేశంగా.

ఏ మాత్రం భయపడకుండా "విష్ యూ ఆల్ ది బెస్ట్" అనేసి ఫోన్ పెట్టేశారు ఫైనాన్స్‌వాళ్ళు.

వెంటనే లేచి తనకు తెలిసిన ఓ లాయరు దగ్గరికి వెళ్ళారు ఆనందరావు శశికళతో.

అంతా విని "ఈ ఫైనాన్స్ కంపెనీలవాళ్ళు గుండెలు తీసిన బంటులు. చాలా పకడ్బందీగా వ్యవహారం నడిపిస్తారు. మీ చేత కాయితాలమీద సంతకాలు పెట్టించుకున్నారా" అన్నాడు ఆ లాయరు.

"ఒకటా! ఓ అరదస్తాదు కాయితాలమీద సంతకాలు పెట్టాను" ఒప్పుకున్నాడు ఆనందరావు.

"మరిహనేం? మిమ్మల్ని ఇరికించేశారు. వాళ్ళ షరతులకు మీరొప్పుకున్నట్లు సంతకం పెట్టించుకునుంటారు. మీరింకేం చెయ్యలేరు" అన్నాడు లాయరు.

"నా దగ్గర వాళ్ళ పప్పులేం ఉడకవు. నేను డబ్బులు కట్టను ఏం చేస్తారో చూస్తాను" అన్నాడు ఉక్రోషంగా.

"పోస్ట్‌డేటెడ్ చెక్కులిచ్చేశారుగా. ఒకవేళ చెక్‌బౌన్స్ అయితే అది పోలీసుకేసు అవుతుంది. ఎందుకొచ్చిన గొడవ. ఇప్పటికిలా కానిచ్చెయ్యండి, ఇకముందు జాగ్రత్త పడండి" అన్నాడు లాయరు.

"ఏమిటో... వాళ్ళు తోచనివ్వకుండా మాట్లాడేసి కంగారు పెట్టేశారు. నేనూ వెర్రి వెధవలా బుట్టలో పడిపోయాను" అని బాధపడ్డాడు ఆనందరావు.

లాయరు దగ్గర్నించి బయటికి రాగానే "ఎలాగూ మునిగాం. ఆ డబ్బుతో డైమండ్ నెక్లెస్ కొనుక్కోనా?" భర్తను ఆశగా అడిగింది శశికళ.

"ఓ చెంప మోసపోయి నేనేడుస్తుంటే వజ్రాల నెక్లెస్ కావలసివచ్చిందా నీకు? నోర్మూసుకో" అని తిట్టాడు ఆనందరావు. దాంతో శశికళకి కోపంవచ్చి ఆనందరావుతో మాట్లాడ్డం పూర్తిగా మానేసింది.

బయటికి చెప్పుకోలేక మనసులో దాచుకోలేక క్షోభ పడిపోయాడు ఆనందరావు. ఒక్కసారి నేరంచేసినవాడి పేరు నేరస్తుల జాబితాలో ఎక్కి ప్రతి పోలీస్ ఎదుటా ప్రత్యం అయినట్లు అప్పుతీసుకున్న ఆనందరావు పేరు అప్పులిచ్చేవారి జాబితాలో జేరిపోయింది.

తెల్లవారడం ఆలస్యం... ఫోన్లు, మీకు అప్పు ఇస్తాం. తీసుకోండి అంటూ ఊదరపెట్టడం.

ఏదో బుద్ధి గడ్డితిని ఒక్కసారి బోల్తాపడ్డాను. మళ్ళీ అటువంటి పొరపాటు చెయ్యను అని ఖచ్చితంగా చెప్పేవాడు మొదట్లో, రాత్రాను ఓపిక నశించిపోయింది. అందులోనూ అవతలివాళ్ళు వాళ్ళ గొడవేగానీ ఇవతలి వాళ్ళు చెప్పేది అస్సలు వినిపించుకోరు.

ఒకసారి ఏబీసీడీ బ్యాంక్‌నించి, మరో గంటాగి హర్షా ఫైనాన్స్ నించి మరో గంటాగి మరొకరి దగ్గర్నించి ఊపిరాడకుండా ఫోన్లమీద ఫోన్లు.

'అప్పిస్తాం ఇల్లు కట్టుకోండి'



'మాకు ఇల్లు వుంది మా కొద్దు నాయనా'.

'పోనీ కారు కొనుక్కోండి'.

'కారు కూడా వుంది'.

'అయితే మా దగ్గర అప్పుతీసుకుని పిల్లాడిని చదివించండి. పిల్ల పెళ్ళిచెయ్యండి'.

"అన్నీ చేసేశాం. వాళ్ళిద్దరూ అమెరికాలో వున్నారు".

"అయితే ఇకనేం అప్పుతీసుకుని వాళ్ళదగ్గర కెళ్ళండి". ఈ విధంగా వేధించుకు తినడం, కొంతమందైతే –

"మిమ్మల్ని బరువులెత్తమన్నామా బండలు దొర్లించమన్నామా? అప్పు ఇస్తాం తీసుకోమంటే తీసుకోడానికేం మాయరోగం?" అని మందలిస్తున్నారు.

రోజులో ఇద్దరైనా ఇంటికొచ్చి అప్పుతీసుకో అని పీకల మీద కూర్చుంటున్నారు. మొదట్లో ధైర్యంగానే వున్నా, ఆ తర్వాత డీలాపడిపోయారు. ఎవరెక్కడ మాయమాటలు చెప్పి అప్పు ఇచ్చేస్తారా అని భయం. ఒకవేళ తీసుకోనని మరీ మొండికేస్తే చెయ్యి చేసుకుంటాడేమో అని టెన్షన్.

మొదట్లో ఎలాగో మోసపోనేపోయాం ఆ డబ్బుతో డైమండ్ నెక్లెస్ కొనలేదని ఈయనని కోపగించుకున్నా, తర్వాత కడుపు తరుక్కు పోతుందంటే నమ్మండి చిదంబరం గారూ. ఏమిటో ఆ దర్జా, ఆ దర్పం అన్నీ పోయాయి. ఇదుగో ఇట్లాపిరికిగా తయారయ్యారు" అని చెప్పుకుంది శశికళ. అంతా విని నిట్టూర్చాడు చిదంబరం.

"నిజమేలెండి. ఓసారి వాళ్ళ వలలో చిక్కితే మునిగిపోయినట్లే. అప్పిచ్చేవాడిని చూస్తే భయం వుండచ్చు. కానీ మరీ ఇంతలా అధైర్యపడిపోవడం వింతగానే వుంది. పోనీ ఎవరైనా డాక్టర్‌కి చూపిస్తే బావుంటుందేమో".

కెవ్వున కేకేసి సోఫాలో అదిరిపడ్డాడు ఆనందరావు.

"ఊరుకోండి. ఊరుకోండి. భయంలేదు. నేనున్నానుగా" భర్తని ఓదార్చి చిదంబరం వైపు తిరిగింది శశికళ.

"ఏం చెప్పమంటారు చిదంబరంగారూ, ఈ రోజుల్లో ఆరోగ్యంగా వుంటే ఫర్వాలేదు గానీ డాక్టరు దగ్గరికి వెళ్తే అరుకాషుడి నోట్లో పడ్డట్లే కదండీ. గతంలో అంటే ప్రతివారికీ ఓ ఫ్యామిలీ డాక్టర్ వుండేవారు. ఇంట్లోని వాళ్లందరి శరీర తత్వాలూ

వాళ్ళకి క్షుణ్ణంగా తెలిసి ఉండేవి. ఏ మాత్రం తేడా చేసినా చూసి మందిచ్చేవాళ్ళు. వ్యాధి నయమయ్యేది. ఇప్పుడలా కాదాయే.

ఈయనిలా బెదిరిపోతుంటే నరాల బలహీనత ఏమో అని డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళాను. ఆ డాక్టరుగారు చూసి అన్నిటెస్టులూ చేయించమన్నాడు. డాక్టర్ రాసిన టెస్టులు సి.టి. స్కాన్ దగ్గర నుంచి హెచ్.ఐ.వి. టెస్ట్ దాకా అన్నీ చేయించాను. ఓ పదివేలు వదిలాయి. ఏం లేదు ప్రస్తుతానికి. భవిష్యత్తులో ఏమైనా రావచ్చు. ఎందుకైనా మంచిది నెలకోసారి వచ్చి ఇలా అన్ని టెస్టులూ చేయించుకెళ్ళండి' అని చెప్పి పంపించారు.

అంతటితో వదిలినా బావుండేది. వారం తిరక్కుండా ఫోనొచ్చింది. 'కిందటి నెలలో మీరు సంప్రదించిన ఆ డాక్టరు హరిగోవిందగారు యూనివర్సల్ హాస్పిటల్‌కి మారారు. మీరు వెంటనే వచ్చి పరీక్షలు చేయించుకుంటే పాతిక శాతం డిస్కౌంట్ ఇస్తారు' అని చెప్పింది.

'ఇప్పుడు మా ఆరోగ్యం బాగానే ఉందమ్మా, ఏదైనా అవసరంవస్తే అప్పుడొస్తాం హరిగోవిందగారి దగ్గరికి' అని చెప్పాం. 'సరే అయితే ఓ వెయ్యికట్టి మీ పేరు ఎన్‌రోల్ చేయించుకుంటే ఏడాదిలోగా ఎప్పుడొచ్చినా టెన్‌పర్సెంట్ డిస్కౌంట్ ఇస్తాం' అంది. 'ముందుగా ఫీజుకట్టి మెంబర్ కావడానికి ఇదేమైనా లైబ్రరీనా. మా కొద్దు' అన్నాం.

మర్నాడు మరో ఫోన్. 'మేము కొత్త ప్యాకేజీ పెట్టాం. భర్త బైపాస్ సర్జరీ చేయించుకుంటే భార్యకి హిస్టరెక్టమీ ఆపరేషన్లో ఫిఫ్టీ పర్సెంట్ డిస్కౌంట్, మీరు వెంటనే రండి' అంది.

'మా కొద్దు తల్లీ ఏదో ఆ దేవుడి దయవల్ల ఆరోగ్యంగానే వున్నాం' అని చెప్పాం.

'భలేవారేనండీ. గాల్లో దీపం పెట్టి దేవుడా నీ మహిమ అంటూ కూర్చుంటే ఎట్లా? జబ్బు వచ్చాక అప్పుడు తీరిగ్గా హాస్పిటల్‌కి వెళ్ళామనుకుంటే ఎట్లా? అందులోనూ, ఆయనకి యాభై అయిదేళ్ళు, ఇంకెంత? ఇవ్వాళ కాకపోతే రేపు, కాకపోతే మర్నాడు, బైపాస్ తప్పదు కదా!

'ఇక మీ విషయానికి వస్తే మీకు ఇంకా ఆ గర్భసంచి ఎందుకు, దండగ? లక్షణంగా ఆపరేషన్ చేయించుకుంటే సరిపోతుంది. ఈ ప్యాకేజీ చాలా మంచిది. మీరు ఆపరేషన్ కోసం చేరినప్పుడు మీకు రూమ్‌రెంట్‌లో డిస్కౌంట్ వుంటుంది. మరో ఎట్రాక్షన్ ఏమిటంటే ప్యాకేజీ ఏడాదిపాటు అమల్లో వుంటుంది.



'ఈ ఏడాదిలోగా మీకు ఆ రెండు జబ్బులూ రాలేదనుకోండి. ఐనా మీకు నష్టం ఏమీ లేదు. మా దగ్గరికొస్తే మాకు చేతనైన ఆపరేషన్లు చేసి పంపిస్తాం. ఈ రాయితీలు అన్నీ ఆ వైద్యానిక్కూడా వర్తిస్తాయి' అని చెప్పింది.

మాకు భయంవేసింది. 'మాకొద్దు తల్లీ నీ రాయితీలు, ప్యాకేజీలు' అని ఫోన్ పెట్టేశాం.

వదిలితేనా? రెండ్రోజులకోసారి ఫోన్‌చేసి 'ఏమిటండీ ఇంకా ఆనందరావుగారికి హార్ట్ ప్రాబ్లమ్ రాలేదా? ఇంకెప్పుడొస్తుంది? ఇవతల మా ప్యాకేజీ గడువు ముగిసిపోతోంది' అని పీక్కుతింటోంది. తథాస్తు దేవతలుంటారని అంటారు. వీళ్ళ గొడవకి నిజంగా జబ్బు వచ్చేస్తుందేమోనని భయంగా వుంది" దీనంగా చెప్పింది.

"నిజమేనమ్మా వీళ్ళ బారినుండి తప్పించుకోడం చాలా కష్టంగానే వుంటోంది" అన్నాడు చిదంబరం జాలిగా.

"పడలేకపోతున్నాం చిదంబరంగారూ! మా పల్లెటూర్లో మాకు పాత ఇల్లుంది. అక్కడికి వెళ్తే అప్పిచ్చువాడూ, వైద్యుడూ వుండడు. ఈ బాధలుండవు. వెళ్దామా అనుకుంటున్నాం" అన్నాడు ఆనందరావు దీనంగా.

*స్వాతి వారపత్రిక, 14 సెప్టెంబర్ 2007*

# వైరాగ్యస్థితి

ఫోన్ మోగింది. తీశాను.

మా శారదత్తయ్య.

"రేపు మంగళవారం" అంది.

"అవును ఎల్లుండి బుధవారం!" అన్నాను.

"ఏడిశావులే వెధవ తెలివితేటలూ నువ్వూనూ, రేపైనా వస్తున్నావా?" కోప్పడింది.

"రేపు కుదరదేమోలే వచ్చేవారం చూద్దాం!" అన్నాను.

"ఇప్పటికి చాలా రోజుల్నించి పూరుకున్నాను. ఇక లాభం లేదు. రేపు రాకపోతే కాళ్లు చేతులూ కట్టేసి లాక్కుపోతా!" అంది ఖచ్చితంగా.

వరుసకి అత్తయ్యేగానీ దానిదీ నా వయసే. కాకపోతే చుట్టరికం వంక పెట్టుకుని నా మీద పెత్తనం చెలాయిస్తూ వుంటుంది. నేనూ వినయంగా వింటూ ఉంటాను. నేను ఊళ్ళన్నీ ఊరేగి ఇక్కడికి చేరానుగానీ అది మొదటినుంచి ఇక్కడే పాతుకుపోయింది.

నేనిక్కడికి వచ్చిన కొత్తల్లో "ఏవిటీ నీ దినచర్య?" అని అడిగింది!

"ఏవుందీ? తెల్లవారుతూనే ఆయన వాకింగ్‌కి వెళ్తారు. నేను ఇల్లొదిలిపోతే పాలవాళ్ళూ, పనివాళ్ళూ వచ్చి తిరిగిపోతారు కాబట్టి నేను ఇంటి చుట్టూ తిరుగుతాను.

"ఆయనొచ్చాక కాఫీ తాగుతాం. పేపరు. మరోసారి కాఫీ. స్నానం అయ్యాక టిఫెనూ, కాఫీ, ఆ తరవాత ఆయన లెఖ్ఖా డొక్కా చూసుకుంటారు. నేను వంట చేస్తాను. భోజనాలు, నిద్ర, నిద్ర లేచి కాఫీ.

"ఆయన టి.వి. చూస్తారు. నేను టిఫిన్ చేస్తాను. టిఫిన్ తిని కాఫీ తాగుతాం. ఇద్దరం బజారుకెళ్ళొస్తాం. ఆయన ఆరేడు న్యూస్‌లు చూస్తారు. నేను వంట చేస్తాను. భోంచేసి పడుకుంటాం" అని దినచర్య చెప్పాను.



నా వంక అదోలా చూసింది. "శ్రీ రమణగారు రాసిన మిధునం కథలో అప్పదాసుగారూ, బుచ్చిలక్ష్మిగారూ లాగా దినం అస్తమానం తిండం తాగడం తప్పించి ఓ దేవుడూ, భక్తీ లేవా మీకు?" అని అడిగింది.

"అయ్యో చూశావా మర్చేపోయాను. స్నానం చెయ్యగానే ఆయన పూజ గదిలోకి వెళ్ళి దీపాలు వెలిగించి పూలు పెట్టి ఆయన కొచ్చిన స్తోత్రాలు చదువుకుని బయటికొస్తారు. నేను వెళ్ళి నా కొచ్చిన స్తోత్రాలు అన్నీ చదువుకొని ఏ పండో ఫలమో నైవేద్యం పెట్టి హారతిస్తాను" అని తప్పు దిద్దుకున్నాను.

"పోన్లే కొంతలో కొంత నయం. కానీ ఇది చాలదు సాధన చెయ్యాలి. ఇహం వదిలేసి పరం గురించి పాకులాడాలి!" అంటూ ఏవిటేవిటో చెప్పింది విన్నాను.

ఆ మాటకొస్తే ఈ విషయాలు గతంలో చాలామంది చెప్పారు. నేను మెడిటేషన్ చెయ్యాలని గట్టిగానే ప్రయత్నించాను. అదేం ఖర్మమో కళ్ళు మూసుకుంటే అత్తగారి వేధింపులూ, అమ్మ సాధింపులు గుర్తు వస్తున్నాయే తప్ప భగవంతుడి మీద దృష్టి నిలవదు.

ఆ మాటే చెప్తే శారదత్తయ్య మందలించింది. అదంతేనుట. పారిపోవడమే మనసు లక్షణంట. అట్లా పారిపోతున్న మనసుని లాక్కొచ్చి కూర్చోబెట్టాలంటే గురువు కావాలిట. తనకు గురువుగారుందిట. ఆవిడ దగ్గరికి నన్నూ తీసికెళ్తానని పోరు.

"టీవీలో బోలెడు ఛానల్సు వచ్చిన దగ్గర్నించీ కావలసినంత సమాచారం అందుతోంది. పుట్టమీద దొర్లే అమ్మవార్ని, కోడి బాబానీ, కొళాయి బాబానీ, టీవీలో చూసి భక్తి పోయి నవ్వొస్తోంది. ఇప్పుడు నీ గురువు గారు కూడా ఆ బాపతేనా?" అంటే లెంపలు వేసుకుంది నన్నూ వేసుకోమంది.

చాలా పవర్ వున్న మనిషట. నేను చెప్పడం ఎందుకు చూస్తే నువ్వే గ్రహిస్తావు. అని ఊదర పెడుతోంది. పోనీ చూసొద్దాం అని బయలుదేరాను.

ఇల్లు పెద్దదే. ఇంకా ఆ చివర ఏసి గదులనీ కట్టిస్తున్నారు. ఖాళీస్థలం నిండా రేకుల షెడ్లు పందిళ్లు. ఎకరాల కొద్దీ వుంది ఆవరణ. మంచినీళ్ళ కూలరూ. కాళ్ళు కడుక్కునే స్థలం, చెప్పుల స్టాండు వగైరా హంగులన్నీ వున్నాయి. ఓ పక్క రెండుమూడు దుకాణాలు ఉన్నాయి. పూసల దండలూ, శాలువాలూ, ఫోటోలూ అమ్ముతున్నారు.

కొంతమంది వాలంటీర్లు వున్నారు. మమ్మల్ని హాల్లోకి పంపించారు. హాల్లో ఆ చివరన పెద్దపాలరాతి అరుగు. దానిమీద ముఖమల్ సోఫా. దానిమీద ఆశీనులై వున్నారు అమ్మగారు.

మనుషుల దగ్గర ఏం మహిమలుంటాయిలే అనుకున్న నాకు ఆవిడని చూడగానే జ్ఞానోదయం కలిగింది. నిస్సందేహంగా ఏదో శక్తి వుంది ఆవిడకి.

ఎందుకంటే ఎండ మండిపోతోంది. ఈ చెవిగాడుపు ఆ చెవికి కొడుతోంది. అంత వేడిలోనూ జరీ ముద్దలావున్న మూరెడంచు పట్టుచీరె, మాచింగ్ జాకెట్టు వేసుకుంది. నగల షాపు మోడల్‌లా మెడనిండా హారాలు, చేతులకి గాజులు, ఇవన్నీ వేసుకుని కూడా చిరునవ్వు నవ్వుతోందంటే మహిమవుండే వుంటుంది.

భజన జరుగుతోంది. అదయ్యాక ప్రవచనం మొదలైంది. అందరూ నిశ్శబ్దంగా వింటున్నారు.

"అసలీ సృష్టి అంటే ఏమిటి? మానవ జన్మ పరమార్థం ఏమిటి? ఎక్కడినించి వచ్చాడీ ప్రాణి? ఎక్కడికి పోతున్నాడు?" సాగిపోతోంది ఉపన్యాసం.

నా గుండె తరుక్కుపోయింది. సాటి ఆడకూతురు. అస్తవ్యస్థాన పడిందంటే వింతేముంది? లోపలికి తీసికెళ్ళి ఆ నగలన్నీ ఒలిచి, చెంబుడు చన్నీళ్ళు పోసి నూలు చీర కడితే వేడి తగ్గి బుర్ర పనిచేసి సమాధానాలు తడతాయి ఈ ప్రశ్నలకి.

ఆ మాటే అంటే మండిపడింది అత్తయ్య "ఇటువంటి వెధవ్వేషాలు వేస్తూండు. రేపు పైకెళ్ళాక ఆ యమధర్మరాజు నిన్ను బూర్ల మూకుట్లో వేసి వేయిస్తాడు" అంది.

ఒక్క నిముషం భయం వేసింది. తర్వాత ధైర్యం వచ్చింది. నన్ను ఒక్కదాన్నే వేయించడు కదా! నాలాంటి వాళ్ళు చాలామందే వుంటారు. నలుగురితో నారాయణా, పదిమందితో పరంధామా! అదీ బానే వుంటుంది.

ఆ మాటంటే అత్తయ్య మళ్ళీ తిడుతుంది. అందుకే వూరుకున్నాను. కాసేపు గడిచాక ప్రవచనం అయిపోయింది. ఇక ప్రశ్నోత్తరాలు జరుగుతాయట.

మైకులో ప్రకటించారు. భక్తుల సందేహాలకు అమ్మగారు సమాధానం చెప్తారుట. అందులోనూ మూడు కేటగిరీలు. మొదటిది రెండొందల యాభైపెట్టి శాలువా కొంటే, సందేహం తీర్చి శాలువా కప్పుతారుట.

రెండవది. నూటయాభై ఇచ్చి పూసల మాల కొనుక్కుంటే సమాధానం చెప్పి దండవేస్తారు.

మూడవది. వంద పెట్టి ఫోటో తీసుకుంటే సమాధానం చెప్పి ఫోటో మంత్రించి ఇస్తారుట.

"నువ్వు ఏమైనా అడగాలనుకుంటే అడుగు" అంది శారదత్తయ్య.



"అమ్మగారి చేతులకి ఉన్న కెంపుల గాజులు బావున్నాయ్. ఎక్కడ చేయించుకున్నారో అడగాలనుకుంటున్నాను" అన్నాను.

"నీ బొంద. ఇటువంటి పిచ్చి ప్రశ్నలు కావు. పారమార్థిక విషయాలు అడగాలి. సమస్యలుంటే చెప్తే పరిష్కారం చెప్తారు" అంది రుసరుసలాడుతూ. ఆవిడ వేసుకోగా లేనిది నేను అడిగితే అపరాధమా?

ఆ భగవంతుడి దయవల్ల నాకే సమస్యలూ లేవు. వున్నదల్లా ఒకటే ఈ బరువు ఎలా తగ్గించుకోవాలా అనే సమస్య. ఆ ముక్క ఆవిడని అడుగుదామంటే ఆవిడే నాకు నాలుగింతలుంది. ఇంకేం అడుగుతాను? అందుకే నాకేం సమస్యలు లేవు అన్నాను.

శారదత్తయ్య పూసలమాల కొనుక్కుని క్యూలో నుంచుంది. నాకు విసుగేసి బయటికి వచ్చేశాను.

బయట పెద్ద చెట్టు వుంది. దానికింద అరుగుమీద కూర్చుని ఉన్నారు ఇద్దరు అమ్మాయిలు. చూస్తుంటేనే తెలిసిపోతోంది, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులని. నేనూ వెళ్ళి కూర్చున్నాను. పలకరించారు. మీరు అమ్మవారి శిష్యులా అని అడిగారు. కాదు, మా అత్తయ్య వెంట వచ్చాను అని చెప్పాను.

వాళ్ళు వాళ్ళ బాస్ భార్య అమెరికానించి వస్తే ఆవిడని తీసుకొచ్చారుట.

"అబ్బా అమెరికానించి వచ్చారా?" అని అడిగాను.

"రాకేం చేస్తారు? బాగా శఠగోపం పెట్టింది ఈవిడ" అన్నారు నవ్వుతూ.

ఏమిటో అర్థం కాలేదు నాకు. ఆ మాటే అంటే "చెప్తాం వినండి, మంచి టైమ్‌పాస్" అంటూ మొదలు పెట్టారు. ఆ మధ్య ఈ సదరు అవతారమూర్తులంతా అమెరికా వెళ్తే బాగా గిట్టుబాటు అవుతుందని సమ్మర్ రాగానే వలసలు వెళ్ళేవాళ్ళు. అక్కడి ఎన్.ఆర్.ఐ.లు వీళ్ళని నెత్తిన పెట్టుకుని చూసుకునే వాళ్ళు.

ఈవిడా అలానే వెళ్లిందిట. మా బాస్, ఆయన భార్య అమిత మర్యాదస్తులు. వాళ్ళింట్లో వీళ్లకి ఆతిథ్యం ఇచ్చారుట.

ఫిల్టరు కాఫీలు దక్షిణాది వంటకాలు, వాటితోబాటు, ఉత్తరాది వంటకాలు, ఇవన్నీకాక అమెరికాలో దొరికే పిజ్జాలూ బర్గర్లూ అడిగినవన్నీ కాదనకుండా పెట్టారుట.

శిష్యుల కాషాయవస్త్రాలు, అమ్మవారి కాషాయ నైటీలూ నోరెత్తకుండా ఉతికిపెట్టారుట. వీరింట్లో మకాం వేసి మిగలిన వారిళ్ళకి పాదపూజలకి వెళ్తూ నెల్రోజులు కాలక్షేపం చేశారుట.

తిరుగు ప్రయాణం అవుతూ బాస్‌ని పిలిచి నాయనా నువ్వు కెంపుల హారం తీసుకుంటావా, పచ్చల పతకం తీసుకుంటావా అని అడిగారుట.

వద్దమ్మా నాకేం వద్దు అన్నారుట ఆయన మొహమాటపడుతూ, సరే అయితే రెండూ తీసుకో అన్నారుట అమ్మవారు.

వద్దన్నా వినడంలేదు ఏంచేస్తాను మీ దయ అన్నాడుట మా బాస్ సరదా పడిపోతూ!

వెంటనే రిసీట్ బుక్ తీసి ఫలానివారు కెంపుల హారానికి పచ్చల పతకానికి ఇచ్చిన సొమ్ము లక్షాయాభై వేలు అని రిసీట్ రాసి ఆయన చేతులో పెట్టారుట వీళ్లు.

మా బాస్ కళ్ళు పచ్చబడ్డాయుట. ఇదేం అన్యాయం తీసుకో తీసుకో అంటే నాకిస్తారేమో అనుకున్నానంటూ లబోదిబో మన్నాడుట.

"నీ చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించుకునే మహద్భాగ్యం నీకు ప్రసాదించారు. అందుకానందించు" అని ఇరుకున పెట్టేసి డబ్బు తీసుకున్నారుట.

ఆ మరుసటి సంవత్సరం ఈవిడ వెళ్ళినప్పుడు మా బాస్ తప్పించుకు తిరుగుతుంటే వెతికి పట్టుకుని నాయనా యాగశాల తీసుకుంటావా? ఆలయగోపురం తీసుకుంటావా? అని పీక్కుతింటూంటే, నావల్ల కాదు అని ఏదో కొంత సమర్పించుకున్నారుట.

రాన్రాను అక్కడి మన వాళ్లు విసిగిపోయారు. వీళ్లని ఎంటర్ టెయిన్ చెయ్యడం మానేశారు.

దాంతో పాపం వీసాలున్నా విమానం ఖర్చులు భరించలేక వీళ్ళంతా వేసవిలో కూడా స్వదేశాల్లోనే వుంటున్నారు.

స్వయంగా వెళ్ళలేకపోయినా ఫోన్లున్నాయి. ఫోన్లు చేసి హోమం చేస్తున్నాం, ఘృతం తీసుకుంటావా? సమిధలు తీసుకుంటావా? మహాకుంభాభిషేకం చేస్తున్నాం అన్నదానం చేసుకుంటావా? వస్త్రదానం చేసుకుంటావా? అని విసిగించడం మొదలు పెట్టారుట. మా వల్ల కాదంటే మీ ఇష్టం. మీకసలే గ్రహస్థితి బాగాలేదు. దివ్యదృష్టితో చూశారు అమ్మవారు. ఏదైనా సేవ చేసుకుంటే ఆపద గట్టెక్కుతుందని చెప్పాం అంటూ సెంటిమెంటల్ బ్లాక్‌మెయిల్ చెయ్యడం. అంతే పాపం వాళ్లకి నిద్రపట్టక అవస్థలు పడడం. అందుకే ఇప్పుడీవిడ వస్తూంటే ఇక్కడకు వెళ్ళి ఏదో సమర్పించుకుని ఇక



మా జోలికి రావద్దని చెప్పి రా అన్నాడుట బాస్. అందుకే ఆవిడ వచ్చింది" అంటూ ముగించారు ఆ సాఫ్ట్‌వేర్ పిల్లలు.

ఇంకా ఇటువంటి అవతారమూర్తుల గురించే కాసేపు కబుర్లు చెప్పుకొన్నాం. ఓ పక్కగా కలకలం. ఒకావిడ కాషాయాలు ధరించి నిద్రలో నడుచుకుంటూ వస్తోంది. వాలంటీర్లు ఆశ్రమవాసులూ తప్పుకొని దారి ఇస్తున్నారు. యోగిని మాత వస్తోంది అని వినయంగా నమస్కరిస్తున్నారు.

వాళ్ళల్లో ఒకరిని దొరకబుచ్చుకొని వివరాలు రాబట్టాం. పూర్వాశ్రమంలో ఆవిడ పేరు నరసమ్మగారుట. అమ్మగారి తొలినాటి భక్తుల్లో ఒకర్తె. అప్పట్లో ఇల్లూ పొలాలు వుండేవిట. సర్వం ఈ అవతారమూర్తికి సమర్పించుకుని ఇక్కడే వుండి పోయిందిట. మన లోకంలో వుండదుట. మేము చూస్తుండగానే వెళ్ళి ఒక చెట్టు కింద కూర్చుని, కాసేపు జపమాల తిప్పుతూ తనలో తనే ఏదో గొణుక్కుంటూ వింతగా ప్రవర్తిస్తోంది.

"ఇదంతా భక్తి పారవశ్యమేనంటారా?" అడిగాను ఆ పిల్లలని. "ఏం కాదు. ఉన్నదంతా వూడలాక్కున్న తర్వాత ఇంకేం మిగుల్తుంది వైరాగ్యం కాక? ఇదీ అటువంటి కేసే" అనేశారు ఆ పిల్లలు నవ్వేస్తూ.

అంతలోనే వచ్చింది మా అత్తయ్య.

ఈ మాల ఆయన మెళ్ళో వేస్తే షుగరూ ప్రెషరూ దెబ్బకి తగ్గిపోతాయని చెప్పారు అమ్మవారు. మందులు కూడా అక్కర్లేదన్నారు. నెలకోసారి అయిదువేలు పెట్టి పూజ చేయిస్తే చాలుట అంది సంబరపడిపోతూ.

మా అత్తయ్య కూడా ఆ యోగిని గారిలా పూర్తి వైరాగ్యస్థితికి చేరుకుంటుందేమో అని భయం వేసింది నాకు.

*విపుల మాసపత్రిక, ఫిబ్రవరి 2006*

# ఇదో వింత

నేనూ, భవానీ, యశోద, సీత ఒక గ్రూప్. అందరం ఇల్లాళ్ళమే. కలిసిన కాసేపూ వాళ్లమీదా వీళ్లమీదా చెప్పుకోకుండా, జోకులేసుకుని మనసారా నవ్వేసుకుని కాఫీలు తాగి విడిపోతాం. ఫోన్లు చేసుకుని కబుర్లు చెప్పుకుంటాం. గత పదిహేనేళ్లుగా దినదిన ప్రవర్ధమానం అవుతోంది మా స్నేహం.

మధ్యాహ్నం మూడింటికి భవాని దగ్గర్నుంచి ఫోను, "వెంటనే వస్తే నీకో తమాషా చూపిస్తా" అంటూ. వెంటనే తయారై ఆటోలో వెళ్లాను వాళ్లింటికి. మా ఇంటికి దూరమే వాళ్లిల్లు.

భవాని కూతురు సుమ డిగ్రీ పాసై ఒక ప్రైవేట్ కాన్వెంటులో పనిచేస్తోంది. సాయంత్రంపూట చిన్నపిల్లలకి సంగీతం నేర్పుతూ తను నేర్చుకున్న సంగీతాన్ని సార్థకం చేసుకుంటుంది.

నే వెళ్లేసరికి వాకిట్లోనే ఎదురయింది సుమ. "ఏమిటి సుమా? నన్నెందుకు రమ్మన్నారు అంటే "రండి ఆంటీ మీకో విశిష్ట వ్యక్తిని చూపిస్తాను" అంది.

లోపలికివెళ్లాం. భవాని దగ్గరుంది ఒక పాప. అయిదేళ్లుంటాయి. బొద్దుగా ముద్దుగా వుంది.

"ఇదుగో ఈ పాపగురించే నీకు చెప్పింది" అంది భవాని.

"నీ పేరేమిటమ్మా" అని అడిగాను.

"భానవ" అంది ముద్దుగా. అర్థం కాలేదు. మళ్లీ అడిగాను. చెప్పింది "భానవ".

"అంటే, భావన అని అర్థం అన్నమాట" అంది సుమ.

నాకు మరీ ముద్దు వచ్చింది. ఊరీ ఊరని ముక్క రుచి వచ్చీరాని మాట రుచి అన్నాను.

"అవునవును. ఇంకా విను" అని "భావనా ఒక పాట పాడమ్మా" అంది భవాని.

వరణీవా మృదుణాపీ

వనరుహ చెలినుణారీ

సుచరిర బంఛరణేవీ.

అని పాడసాగింది. నాకు భలే నవ్వొచ్చింది.

"ఈ పాపని వున్నపళంగా టి.వి.కి పంపిస్తే మరో రివర్స్ గేర్, గజిబిజి గపదని అవుతుంది" అన్నాను.

"అబ్బే ఇది గిన్నిస్‌బుక్ కేసు" అంది భవాని.

అంతలోనే ఓ కుర్రాడు వచ్చాడు. ఇద్దరికీ పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ పాప అన్నట.

"నీ పేరేమిటి నాన్నా?" అన్నాను.

"భతర్" అని చెప్పాడు.

"భరత్ ఇవ్వాళ ఆలస్యం అయిందేం?" అంది సుమ.

"ఇల్లావ స్పోర్ట్స్ రీపియడ్ వుంది మిస్. అందుకే లేట్ అయింది" అన్నాడు.

"పద వాళ్లింటికి వెళ్దాం. అందర్నీ పరిచయం చేస్తాను" అంది భవాని.

పక్క సందులోనే వాళ్లిల్లు. వాకిట్లోనే ఎదురయ్యాడు పిల్లల తండ్రి భాస్కరరావు. మమ్మల్ని చూడగానే మొహం ఇంత చేసుకుని పలకరించాడు.

"భనావి గారా? రండమ్మా రండి. గాబున్నారా? మా భానవ గంసీతం ఎందాకా వచ్చింది" అన్నాడు.

"బాగానే వుందండీ" అంది భవాని.

మెల్లిమెల్లిగా ఆ భాష అర్థం అవసాగింది నాకు.

"జాకనీ, జాకనీ" అని పిల్చాడు. లోపల్నించి భార్యవచ్చింది.

రండి అని ఆహ్వానించింది. ఆవిడ చాలా మితభాషి.

ఇద్దరి బదులూ ఆయనే మాట్లాడుతున్నాడు.

"వీరు భనావి గారి ఫ్రెండు. మా ఇంకిటి రావడం చాలా తంసోషం. ఏదో మామూలు వాళ్లం. దీసా దాసా సంసారం" అని చెప్పుకొచ్చాడు.

వెళ్లిపోతాం అన్నా వినకుండా, "వేడిగా మెరకపాయ బజ్జీలు తెస్తాను. మా వీధి చిరవ దంబీవాడు బాగా చేస్తాడు" అని వెళ్లాడు.

అప్పుడు నోరువిప్పింది జానకి.

"ఏమండీ అయోమయంగా వుందా? కొత్తవాళ్లకి అంతేమరి. అందరూ అంతే. పెళ్లిలో జాకని అని నా పేరు చెప్తే జోక్ చేస్తున్నారేమో అనుకున్నాం. మిగిలినవాళ్ల లతంబ్రాలు, నావగల్లి అంటూవుంటే హడావిడికి మాట తడబడుతున్నారనుకున్నాం. తర్వాత తెలిసింది నిజస్వరూపం" అంది జానకి.

"పోనీ ఏ డాక్టరుకైనా చూపించకపోయారా?"

"ఆ వైభోగమూ అయింది. పాపం ఒక సైకియాట్రిస్ట్ వెంకటరామ్‌గారని ఆయన వైద్యం చేశారు."

"మరి ఫలితం కనిపించలేదా?" అడిగింది భవాని.

"కనిపించకేం దివ్యంగా కనిపించింది" చెప్తుండగానే ఫోన్ మోగింది.

కాలర్ ఐ.డి.లో నెంబరు చూసి అరుగో సమయానికి దేవుడల్లే ఆయనే ఫోన్ చేశారు. మీరే చూడండి" అంటూ స్పీకర్ స్విచ్ నొక్కింది.

"లహో" అని వినిపించింది ఒక కంఠం.

"డాక్టర్ వెంటకరామ్‌ని" అన్నాడాయన.

"నేనేనండీ జానకిని" అందీవిడ.

"ఏమ్మా లాచా రోజుల రతువాత మీతో మాట్లాడుతున్నాను. ఏమిటి శివేషాలు? మీ శ్రీరావూ లిప్పలూ బావున్నారా?" అని పలకరించి దడదడా మట్లాడేస్తుంటే వాళ్లావిడ వచ్చినట్లుంది.

"ఎవరూ జానకిగారా? ఏం మహాతల్లీ. ఇంకా మమ్మల్ని వదలవా? లక్షణంగా ప్రాక్టీసు చేసుకుంటూ రెండు చేతులా సంపాదించుకునేవారు. మీకేసు తీసుకుని ఇదుగో ఇలా తయారయ్యాడు".

"నీకంటే మేము దొరికాం తేరగా. మరి మాకెవరూ దొరకడం లేదే. ఈ ఊళ్లో అందర్నీ బతిమాలి భంగపడి ఢిల్లీ బాంబే కూడా వెళ్లొచ్చాను. ఫలితం శూన్యం. ఇదంతా మీ పుణ్యమే" అంటూ ఏమిటేమిటో మాట్లాడుతోంది.

"శాదరా తప్పు శాదరా! అని అవతల డాక్టరుగారు భార్యని వారించి ఫోన్ పెట్టేశాడు.

జాలిగా జానకిగారి వంక చూశాం.

"ఆవిడ తిట్టిందంటే తిట్టదూమరి! మా కారణంగా పాపం ఆవిడ బతుకు అస్తవ్యస్తం అయిపోయింది" అంది దీనంగా.



"ఏమిటో ఈ విచిత్రం. పిల్లలు ముద్దుగా మాట్లాడితే బాగుంటుంది గానీ పెద్దవాళ్లు అస్తవ్యస్తాన పడితే ఇబ్బందే" అంది భవాని.

"రండి హాల్లో కూర్చుందాం..." అంది.

"మాకు జడిసి మా ఇంటికెవరూ ఓ పట్టానరారు. ఏం చెప్పమంటారు నా బాధ" అంది దీనంగా.

అంతలోనే ఒకతను వచ్చాడు. నలభై దరిదాపుల్లో వుంటుంది అతని వయసు. నలిగిన బట్టలు, రేగిపోయిన తల, అయోమయంగా వున్నాడు చూడ్డానికి.

"గుడీవినింగ్ మేడమ్" అంటూ విష్ చేశాడు.

జానకి మొహం ఎర్రబడింది. "నువ్వొకడివి నా ప్రాణానికి చాతకపక్షిలా దాపురించావు" అంది విసుగ్గా.

"మీరిలా విసుక్కుంటే నేనేమైపోతాను మేడమ్. నా భవిష్యత్తు మీ చేతుల్లో వుంది" అన్నాడు దీనంగా.

"నా వర్తమానానికి గతి లేదు. నీ భవిష్యత్తు బాగుచేస్తాను నేను" అంది ఉక్రోషంగా.

"అలా అనకండి మీరు. అన్నివిధాలా అన్యాయం అయిపోయాను. మీరు ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం" అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

ఏమిటండీ ఇది? ఎవరితను? అని అడిగింది భవాని.

జానకినోరు విప్పేలోగానే అతనే కళ్లు తుడుచుకుని "నేను చెప్తాను మేడమ్" అంటూ మొదలుపెట్టాడు.

అతని పేరు పవన్‌కుమార్‌ట. ఆ పేరుకి తగినట్లు బలవంతుడూ శక్తివంతుడూ బుద్ధిమంతుడూ అవుతాడని ఆశపడ్డారుట తల్లిదండ్రులు. అవేమీ కాదుగానీ గాలివాటంగా తయారైందిట అతని బతుకు.

చదువు సరిగ్గా వంటబట్టలేదు. ఎలాగో డిగ్రీపూర్తిచేసి, ఒక స్కూల్లో టీచరుగా చేరాడుట. అది కాస్తా గాలివానకి కూలిపోయిందట. ఆ తర్వాత ఒక చిట్‌ఫండ్ కంపెనీలో చేరాడట. అది మూతబడిపోయింది. ఆ తరువాత ఒక పత్రికలో చేరి దగా బతుకులు, బడుగు జీవులూ అని కాలమ్ రాశాడుట. ఆ పత్రికా మూతబడి పోయిందిట. ఆ తర్వాత ఒక టి.వి. ఛానల్‌లో చేరాడుట. ఉగ్రవాదులకి తీవ్రవాదులకీ గల వ్యత్యాసం అని ఒక ప్రోగ్రాం చెయ్యాలని నడుం కట్టుకుని వాళ్లని వెతుక్కుంటూ

వెళ్లి ప్రశ్నలడగబోయేసరికి వాళ్లు కాళ్లు విరగ్గొట్టి పోయారుట. ఫాక్చరై నాలుగు నెలలు మంచంలో వున్నాడుట.

ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నాల్లో వున్నాడుట. అతని గత వైభవం చూసి ఎవరూ ఉద్యోగం ఇవ్వటం లేదుట.

తిరగ్గా తిరగ్గా ఒకళ్లెవరో ఉద్యోగం ఇస్తానన్నారుట. వాళ్లు శేషా టి.వి. అని ఛానెల్ ప్రారంభిస్తున్నారుట.

నువ్వేదైనా వైవిధ్యభరితమైన సంఘటన వెతికి షూట్ చేసి తీసుకొస్తే అది మాకు నచ్చితే ఉద్యోగం ఇస్తాం అన్నారుట.

దేశం మీదపడి గాలిస్తుంటే ఈ కుటుంబం దొరికింది. వీళ్లని ఇంటర్వ్యూచేసి ఆ కేసేట్ వాళ్లకి చూపిస్తే తప్పకుండా ఉద్యోగం దొరుకుతుందని ఆశ.

ససేమిరా అంటోంది జానకి. అయిన అల్లరి చాలు ఇంకా దేశం అందరికీ తెలియాలా? అంటుందావిడ.

"ఏ పుట్టలో ఏ పాముందో. మీ గురించి తెలుసుకుని ఎవరైనా మీకు సాయం చెయ్యవచ్చు. లేదా ఇది చూసి ఇలాటి వారెవరన్నా ఇంకెక్కడైనా వుంటే వారి ఆచూకి మీకు తెలియజేస్తే దానివల్ల మీకు కొంత వూరట కలగవచ్చు. ఇవన్నీ ఇలా వుంచి మీ దయ వల్ల నీ జీవితానికి ఒకదారి చూపిస్తే ఆ పుణ్య ఫలాన మీకు కూడా మంచి జరగచ్చు" అంటాడు పవన్‌కుమార్.

ఇద్దరికీ వాదన జరిగింది. చివరకు 'సరే' అనక తప్పలేదు జానకికి.

కష్టపడి కిందామీదా పడి పెళ్లాం మెడలోని పుస్తే పూసా తాకట్టుపెట్టి కేసెట్ తీశాడు పవన్‌కుమార్. మా భవానే స్క్రిప్టురాసిచ్చింది.

మాకు కేసెట్ వేసి చూపించాడు పవన్‌కుమార్. అతని ఉపోద్ఘాతం అనంతరం భాస్కరావుగారిల్లు.

భాస్కరావుగారి తండ్రి ఎర్రరంగు పట్టుబట్టలు కట్టుకుని విభూతి రేఖలు దిద్దుకుని సంధ్యావందనం చేస్తున్నారు.

"కేచమ్యా, ఆశవాయస్వాహా."

*(హాస్యకథల పోటీలో బహుమతి పొందిన కథ)*

*నవ్య వారపత్రిక, 29 డిసెంబర్ 2004*



# తిక్క కుదిరింది

"అయితే ఈసారి కూడా నాకోరిక తీర్చవన్నమాట!" అడిగాడు విశ్వం.

"ఏమిటండీ మీరూ మీ వ్యవహారం? ఎవరైనా వింటే నవ్విపోతారు" అంది ఉమ.

"ఎందుకటా నవ్వడం? ఎవరి సరదా వాళ్ళది. నా సరదా ఇది. నువ్వు నా భార్యవి. నేను కోరిన కోరికలు తీర్చాల్సిన బాధ్యత నీది కాదా! ఎప్పుడు ఏం అడిగినా కాదు పొమ్మంటావేం?" గట్టిగా అడిగాడు.

"మీకు ఖచ్చితంగా పిచ్చెక్కింది. ఇదంతా నా ఖర్మ" అన్నది ఉమ.

"నీ ఖర్మ కాదు నా ఖర్మ. గతంలో ఏదో సర్దాపడితే గాలి సోకిందని నానా జాతరా చేయించావు. ఇప్పుడు పిచ్చిపట్టిందని ప్రచారం చేసి నన్ను పిచ్చాసుపత్రిలో పారేయించు" ఆక్రోశించాడు.

"అవునవును. ఇదంతా సరదాకోసం చేస్తున్నాను. ఏ ఆడదైనా మొగుడు ప్రయోజకుడని ప్రచారం చేసుకుంటుందిగానీ గాలీ, పిచ్చీ అని బయటకు చెప్తుందా, మీ తలతిక్క వేషాలవల్ల నా బతుకు బజార్న పడుతుంది!" ఉమ కంఠం భారమైంది.

"ఈ ఏడుపు ఎప్పుడూ వుండేదేగా! అసలు విషయం తేల్చి చెప్పు. ఈ సారి అటో ఇటో తేలిపోవాల్సిందే. నేనెంతో సరదాపడి డబ్బు ఖర్చుపెట్టి ఎంతో శ్రమపడి ప్రయత్నాలు చేసుకువస్తే, అయ్యో కట్టుకున్న మొగుడే అంత శ్రమపడి సరదా పడుతున్నాడే అని కాస్తయినా జాలివుందా నీకు?" నిలదీసి అడిగాడు విశ్వం.

రపామని తలబాదుకుంది ఉమ.

"ఇదెక్కడి గోల మహాప్రభో! రాన్రానూ రాజుగారి గుర్రం గాడిద అయిందన్నట్లు వుంది మీ వ్యవహారం.

ఇంటినిండా జనం. నలుగురూ చూస్తే మన పరువేం కావాలి. ఆ మాత్రం ఇంగితంలేదు. ఏళ్ళొచ్చాయి ఎందుకూ ఏడవనా?" విరుచుకుపడింది.

"నువ్వు ఊ అంటే ఆ ఏర్పాట్లు కూడా నేనే చేస్తాను. ఈ సారి నా సరదా తీర్చకపోయావంటే ఏ హిమాలయాలకో పోయి సన్యాసుల్లో కలిసిపోతాను" అని గట్టిగా వార్నింగ్ ఇచ్చేసి గదిలోంచి బయటకు దూసుకుపోయాడు విశ్వం.

అల్లుడి గదిలోంచి ఘర్షణ వినిపించి వంటింట్లోంచి వచ్చిన దుర్గ అతను బయటికి వెళ్ళడం చూసి గదిలోకి వెళ్ళింది.

"ఏమిటే! మళ్ళీ గొడవపడుతున్నట్లున్నారూ?" అంది ఆదరంగా.

"ఏముంది. ఏదో పెటకం పెట్టారు. దినదిన గండంలా తయారైంది నా కాపురం" అంది ఉమ కళ్ళొత్తుకుంటూ.

"ఏమిటో దిక్కుమాలిన గోల మన ఖర్మకొద్దీ సంప్రాప్తం అయ్యాడు. పెళ్ళికి ముందు వ్యభిచారా? సిగిరెట్లు తాగుతాడా? తాగుబోతా? జూదం ఆడుతాడా? అంటూ అన్నీ అడిగి తెలుసుకుని మరీ పిల్లనిచ్చాం. ఈ విధంగా ఏడిపించుకు తింటాడని ఊహించనైనా లేదు. ఎక్కడా కనీవినీ ఎరగం" అని బాధపడి కూతుర్ని ఓదార్చింది.

✧ ✧ ✧

ఈ గొడవకంతా కారకుడైన విశ్వం పొలంగట్ల మీదుగా రంయ్‌మంటూ సైకిల్ తొక్కుకుంటూ పోతున్నాడు. సెంటర్‌కి వెళ్ళి మొదటాట చూసి రావడం అతని దినచర్య. 'ఈసారి మెత్తపడకూడదు. వెధవది సగంబతుకు గడిచేపోయింది. తనిలా ఉపేక్షించి వూరుకుంటే మిగిలినది కూడా నిస్సారంగా గడిచిపోతుంది' అనుకుని దృఢనిశ్చయం చేసుకున్నాడు.

విశ్వానికి సినిమాలంటే మా చెడ్డ ఇష్టం. అసలతను పుట్టటమే సినిమాహాల్లో పుట్టాడు. అతని తల్లి నెలలు నిండాక ఒంటెద్దు బండీలో ఇద్దరు పిల్లల్నీ మొగుడినీ వెంటబెట్టుకుని పక్క ఊరు టూరింగు టాకీసుకి సినిమాకెళ్ళింది.

మొదటి పార్టు కాగానే నొప్పులు మొదలయ్యేసరికి సినిమాకి వచ్చిన ఆడంగులు అంతా పూసుకుని పురుడు పోశారు. ఆ పురిటిగుడ్డుని పక్కలో వేసుకుని హాలు వాకిలి దగ్గర పడుకుని సినిమాచూసి ఇంటికెళ్ళింది అతని తల్లి.

అలా పుట్టినదాదిగా సినిమాలు చూస్తూనే వున్నాడు విశ్వం. పల్లెటూర్లో వుండేవాడేమో, సినిమాల వసతి తక్కువే. అయినా అధైర్యపడక అద్దెసైకిలు వేసుకుని ఎంత దూరం అయినా సరే పోయి ఎంచక్కా సినిమాచూసి వస్తూ వుండేవాడు.



అదంతటితో ఆగితే బాగానే వుండేది. ఇతనిదో వింత వ్యవహారం. సినిమాల్లో జరిగే ఉత్కంఠభరితమైన సంఘటనలన్నీ తన జీవితంలో జరగాలనీ, జీవితం చిత్ర విచిత్రమైన మలుపులు తిరగాలనీ కోరిక.

చిన్నతనంలో ఏదో ఒకరోజు తల్లిదండ్రీ తనని పిల్చి "బాబూ నువ్వు మా కన్నకొడుకువి కావు. ఫలానా తిరణాల్లో దొరికావు" అని చెప్తారేమో అప్పుడు తను వెళ్ళి అసలు తల్లిదండ్రులకోసం వెతికి వాళ్ళకాళ్ళమీద పడి వాళ్ళని ఆనందపరవశంలో ముంచెత్తచ్చు అని సర్దాపడ్డాడు. ఎదురుచూసి చూసి విసుగేసి ఓ రోజు తల్లినే అడిగేశాడు.

"నిజం చెప్పు నేను నీ కన్నకొడుకునేనా?" అన్నాడు గంభీరంగా. వెంటనే మాడు పగిలేలా కొట్టిందావిడ.

"అక్కయ్యకీ అన్నయ్యకీ పెరుగేసి నీకు మజ్జిగ పోశానని అంతమాట అంటావా? అంట్లవెధవా! నీకు అజీర్తిరోగం. పెరుగు అరగదని మజ్జిగ పోశాను" అని తిట్టింది. ఆ తర్వాత తండ్రి వచ్చి నాలుగు తన్ని గంటసేపు గోడకుర్చీ వేయించాడు.

ఆ దెబ్బతో కొన్నాళ్ళు బుద్ధిగానే వుండి మళ్ళీ మొదలెట్టాడు. అన్నని కూర్చోబెట్టి "ఒరే అన్నయ్యా నువ్వు పరీక్షలో తప్పురా! నాన్న నిన్ను కొడతాడు. అప్పుడు నువ్వు ఇంట్లోంచి పారిపోయి బూట్‌పాలీష్ చేసుకో. నేను పెద్దయి నిన్ను వెదకడానికి బయలుదేరతాను. నా పుట్టుమచ్చలు చూసి నేనూ ఒకర్నొకరు గుర్తుపట్టి కావలించుకుని మళ్ళీ అమ్మా నాన్న దగ్గరికి వద్దాం" అన్నాడు. అన్నయ్యకి కోపం వచ్చి చింత బరికతో బాది వదిలిపెట్టాడు.

ఆ తర్వాత కొన్నాళ్ళకి అక్క దగ్గరకు వెళ్ళి "అక్కా ఒకవేళ నిన్నెవడైనా మానభంగం చేస్తే నాకు ఉత్తరం రాసిపెట్టి నువ్వు చెట్టుకి ఉరివేసుకుని చచ్చిపోవే. నేను నిన్ను అన్యాయం చేసినవాడిమీద పగతీర్చుకుని జైలుకెళ్తాను" అన్నాడు ఆశగా. అక్క భోరున ఏడిచి వెళ్ళి తల్లితో చెప్పింది. అంతే! ఆవిడ వెంటనే గరిట కాల్చి వాత పెట్టింది. అలా గడిచిపోయింది విశ్వం బాల్యం అంతా.

యవ్వనంలోకి అడుగుపెట్టాక చదువంతగా వంట పట్టకపోయినా కుర్రాడు బాగానే వుంటాడు కాబట్టి పొరుగూర్లో కాస్త కలిగిన కుటుంబంవారు తమ ఏకైకపుత్రిక నిచ్చి పెళ్ళి చేశారు.

ఆ పెళ్ళిలో కూడా మామగారు కట్నం ఇచ్చుకోలేకపోతే తండ్రి కోపగించి లేవరా పీటలమీద నుండి అంటాడేమో తను పెళ్ళి కూతురి దీనవదనం చూసి ఓ

డైలాగుకొట్టి పెళ్ళికూతురి మెడలో పుస్తెకట్టి అందరి ప్రశంసలకూ పాత్రుడవాలని ఎంతో సర్దాపడ్డాడు. నవ్వుకుంటూ భుజం భుజం రాసుకుంటూ పెళ్ళిపందిట్లో తిరుగుతున్న వియ్యంకులని చూసి అలా ఇకిలించుకుంటూ తిరిగే బదులు ఎంచక్కా కొట్టుకు చావరాదూ! అని విసుక్కున్నాడు.

ఆ రాత్రే శోభనం. గదిలోకిరాగానే భార్యను పలకరించి -

'నువ్వెవరినైనా ప్రేమించేవా? ప్రేమిస్తే భయపడకుండా చెప్పు. నా విశాల హృదయంతో నిన్ను క్షమిస్తాను' అని పీక్కుతిన్నాడు. అబ్బే అలాటిదేం లేదు. అనేసింది ఉమ. అతనికి చిరాకేసింది.

జీవితం అంతా ఇలా చప్పగా సాగిపోతుంటే ఇక మలుపు తిరిగేది ఎప్పుడు; అందుకే 'సరే నువ్వు ప్రేమించకపోతే పోయావు. నేనో అమ్మాయిని ప్రేమించాను. మా అమ్మా నాన్న బలవంతంమీద నిన్ను పెళ్ళి చేసుకున్నాను. మనిద్దరం లోకం దృష్టిలో మాత్రమే భార్యాభర్తలం. నువ్వు దిండు తీసుకుని కిందవేసుకుని పడుకో. నేను మంచంమీద పడుకుంటాను. నా ప్రేమకోసం పూజలవీ చేసుకో. నెమ్మదిగా నా మనసు మార్చుకుంటాను" అన్నాడు. వెంటనే తలుపు తీసుకుని బయటికి వెళ్ళిపోయింది ఉమ.

తల్లితో జరిగినది అంతా చెప్పింది. ఆవిడవెళ్ళి భర్తని లేపింది. ఆయన వెళ్ళి వియ్యంకుడిని లేపాడు. ఆరుబయట పెద్ద పంచాయితీ జరిగింది.

కొడుకు వ్యవహారం దాచి పెళ్ళి చేశారని ఆడపెళ్ళివారు ధ్వజం ఎత్తారు. మా వాడికి అటువంటి వ్యవహారాలేం లేవు అని చెప్పారు మగపెళ్ళివారు. చివరికి అసలు నాయకుడిని ప్రవేశపెట్టారు.

కాసేపు నీళ్ళు నమిలి బుర్ర గోక్కుని "అయ్యావార్ని చెయ్యబోతే కోతి అయినట్లు నేనేదో సర్దాపడి అబద్ధం చెప్తే ఆ పెళ్ళి కూతురు ఇంత గోలచేసింది" అంటూ అసలు విషయం బయటపెట్టాడు.

ఎవడైనా వున్న లొసుగులు దాచుకుంటారుగానీ లేనివి కల్పించి చెప్తారుట్రా తింగరి వెధవా అని తిట్టారు మగపెళ్ళివారు. కుర్రాడు బొత్తిగా తిక్కమేళంగా వున్నాడు. మా అమ్మాయిని పంపం. ఎలాగూ పెళ్ళయింది కాబట్టి ఈ శాల్తీని ఇక్కడే వదిలేసిపోండి. ఇల్లరికం వుంటాడు అన్నారు ఆడపెళ్ళివారు. వదిలిందే చాలు పీడా అని వదిలేసి చక్కాపోయారు వాళ్ళు.



అల్లుడిలా ప్రవర్తిస్తున్నాడంటే అదేమైనా గాలి ప్రభావం ఏమో అని గణాచారిని పిలిపించారు అత్తవారు.

అతగాడు పరీక్షచేసి మొండిదయ్యం పట్టిందని నిర్ధారించి నిమ్మకాయలు కోసి ధూపంవేసి విశ్వాన్ని వేపమండలతో చావబాది దయ్యాన్ని సీసాలో బంధించి దండిగా పారితోషికం పట్టుకుపోయాడు.

ఇక ఫర్వాలేదని మళ్ళీ శోభనం ఏర్పాటు చేశారు. ఈసారి విశ్వం బుద్ధిగానే వున్నాడుగానీ ఉమ మాత్రం దగ్గరికొచ్చిన భర్తని సత్యభామ స్టైల్‌లో గాడిదలెవెల్లో తన్నింది. దాంతో అతనికాపురం సజావుగా సాగడానికి మరో పదిరోజులు పట్టింది.

భార్యకి నొప్పులొస్తుంటే సర్దాపడ్డాడు. తను ఏరు ఈది ఆ తర్వాత డొంకకి అడ్డం పడి పరిగెట్టుకు వెళ్ళి డాక్టర్ని రమ్మంటే, అతను రాకపోతే బెదిరించి తీసుకొచ్చి చావుబతుకుల్లో వున్న భార్యని బతికిస్తాడు. అని ప్లాను వేసుకుని బెదిరించడం కోసం తనెప్పుడో పోస్ట్‌లో తెప్పించుకున్న మాయ తుపాకీకోసం వెతికాడు.

అటుగా వెళ్తున్న అత్తగార్ని పిల్చి "తుపాకీ ఎక్కడ పెట్టిందో ఉమని అడగండి" అన్నాడు.

"ఓ చెంప అది నెప్పులతో ఏడుస్తుంటే నీకు తుపాకీ ఎందుకు నాయనా కాల్చి చంపడానికా!" అని విసుక్కుంది ఆవిడ.

తనే తుపాకీ వెతుక్కుంటూ వుండగానే లోపల్నించి కేరుమని శబ్దం వినిపించింది. అందరూ తేలిగ్గా పురుడొచ్చింది. మగబిడ్డ అని ఆనందపడుతూ వుంటే నా ఖర్మ అని తలబాదుకున్నాడు విశ్వం.

ఆ తర్వాతకూడా అతనేదో పిచ్చివేషాలు వెయ్యడం ఉమ ఏడవడం సర్వసాధారణం అయిపోయింది.

కిందటిరోజు రోడ్డుమీదికి వెళ్తే వ్యాపారం కోసం బండినిండా అల్యూమినియం బిందెలు వేసుకుని ఊరూరా తిరిగే వ్యాపారి ఒకడు కనిపించాడు. ఆ బిందెలు చూసి ఇతని బుర్రలో పురుగు తొల్చసాగింది. ఆ వ్యాపారితో మాట్లాడి ఒప్పందం కుదుర్చుకుని ఇంటికి తీసుకొచ్చాడు.

ఆ బిందెలన్నీ బోర్లిస్తాడుట. దానిమీద ఉమ డాన్సు చెయ్యాలిట. అదీ కోరిక. ఎప్పటిలా కాకుండా మొండి పట్టుపట్టాడు. హిమాలయాలకు పోతానని బెదిరిస్తున్నాడు. తిక్కమేళం పోయినా పోతాడు.

పోనీ నువ్వే ఏదో సర్దుకుపోవే అందామంటే మరీ బొత్తిగా బిందెలమీద నిలబడి డాన్సెం చేస్తుంది ఆకుచాటు పిందెలా పెరిగిన అయినింటి ఆడపిల్ల?

ఏం చెయ్యాలా అని ఇంటిల్లిపాదీ నెత్తిన చేతులు పెట్టుకుని నట్టింట్లో కూర్చున్నారు. అదే సమయంలో ఆపద్బాంధవుడిలా వచ్చాడు రాజారావు. ఈ రాజారావు ఉమకి పెత్తల్లి కొడుకు.

"ఏవిట్రా అలా కూర్చున్నారు సర్వం మునిగిపోయినట్లూ!" అన్నాడు.

విషయం అంతా వివరించి కళ్ళనీళ్ళు పెట్టుకుంది ఉమ తల్లి. దీర్ఘంగా ఆలోచించాడు రాజారావు. మీరేం భయపడకండి. బావగారి తిక్క నేను కుదురుస్తా అని హామీ ఇచ్చాడు. సినిమానుండి వచ్చిన విశ్వం రెక్కపుచ్చుకుని బయటికి లాక్కుపోయాడు. ఏమిటలా వున్నారూ అని అడిగి విషయం తెలుసుకున్నాడు.

"ఈ మనుషులంతా ఇంతే బావగారూ! పొద్దస్తమానం పండుకోనూ తిననూ నిద్ర తప్పించి ఓ థ్రిల్లూ వుండదు పాడూ వుండదు. ఏం జీవితం వెధవ జీవితం మలుపులు తిరగని బతుకూ ఓ బతుకేనా! నాకూ మీలాగే బోలెడు సర్దాలున్నాయి. ఏం లాభం తీరిచస్తేనా!

మొన్న మా అత్తారింటికి వెళ్ళినప్పుడు నా మరదల్ని పట్టుకుని 'మీ అక్కకి బుద్ధి చెప్దాం! నువ్వు నన్ను ప్రేమించినట్లు నటించు. మీ అక్క చూస్తుండగా నన్ను ముద్దెట్టుకో. నా పక్కలోకొచ్చి వుత్తుత్తినే పడుకో' అన్నాను. విన్లేదు సరికదా లాగి లెంపకాయ కొట్టింది.

"నీతో ఇలాటి వెధవ్వేషాలు వేస్తే ఆనక నాకు పెళ్ళి కావద్దా?" అంది.

పోనీలే అని మా బావమరిదిని పిల్చి నువ్వు వెనక్కి తిరిగి నుంచోరా నేను నీ నడుంమీద తంతాను ఫలాని సినిమాలో లాగా అన్నాను. వద్దులే బావా నువ్వే వెనక్కి తిరుగు నేను తంతాను వెరైటీగా వుంటుంది అన్నాడు.

కాస్తంతైనా కళాదృష్టిలేని మనుషులతో ఎలా చస్తాం చెప్పండి! వీళ్ళతో మనకి ఎందుకుగానీ మనిద్దరమే కూడబలుక్కుని మన సరదా తీర్చుకుందాం" అన్నాడు.

విశ్వానికి బోలెడంత సర్దావేసింది. ఇన్నాళ్ళకి తనకి తగినవాడు దొరికాడు. ఏం చేద్దాం చెప్పండి అన్నాడు.

"రేపు మీరు పొలం బయలుదేరే ముందు నేను బండి ఇరుసు లాగేస్తా మీరు అందరికీ పేరు పేరునా చెప్పి పిల్లాడిని ముద్దెట్టుకుని నిన్ను నా కంటే పెద్ద రైతుగా చూడాలని వుందిరా అని చెప్పి బండి ఎక్కి వేగంగా తోలండి.



"ఊరు చివరికి వెళ్ళేసరికి బండి బోల్తా పడుతుంది. మీరు దొర్లి పల్లంలో పడతారు. మీ బుర్ర పగుల్తుంది. మాకు కబురు తెలిసి హుటాహుటీ హాస్పిటల్‌కి తీసికెళ్తాం. ఆపరేషన్ చెయ్యాలంటాడు డాక్టరు. ఆపరేషన్ థియేటర్ తలుపు మూసుకుంటుంది.' ఎర్రలైటు వెలుగుతుంది. డాక్టర్లంతా టోపీలు పెట్టుకుని మూతులకి గుడ్డలు కట్టుకుని వస్తారు. పెద్దలైటు వెలుగుతుంది. రక్తం బాటిల్, ఆక్సిజన్ సిలెండరు. డాక్టర్ బయటికి వచ్చి పెదవి విరుస్తాడు. మొహం మీద గుడ్డ కప్పుతాడు. అంతా ఘొల్లున ఏడుస్తారు.

"ఇంటికొస్తాం మిమ్మల్ని కుర్చీలో కూర్చోబెట్టి స్నానం. ఆ తర్వాత బొట్టు పెట్టి పూలదండ, పాడెమీద అంతిమయాత్ర. ముందు కుండతో నిప్పు పట్టుకుని ఏడ్చుకుంటూ మీ నాన్న, చితి, చితిమీద మీరు, చితికి నిప్పు. ఎగసిన మంటలు ఫెడీల్న కపాలమోక్షం!"

వింటూన్న విశ్వం కెవ్వున అరిచాడు. "చాల్లే నోర్ముయ్" అన్నాడు వణికిపోతూ.

"అది కాదు బావగారూ నాకు సర్దాగా వుంది" బతిమాలాడు రాజారావు.

"మండినట్లే వుంది నీ సర్దా! పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటం అంటే ఇదే. మళ్లీ మాట్లాడావంటే పళ్ళు రాలగొడతాను!" అన్నాడు.

"సరే ఏం చేస్తాం మీరూ సహకరించడం లేదు. భవిష్యత్తులో మనసు మార్చుకుంటే నాకు కబురెట్టండి. వచ్చి బండి ఇరుసు పీకేస్తా!" అని హామీ ఇచ్చాడు.

బెదిరిపోయిన విశ్వం మళ్ళీ ఎప్పుడూ థ్రిల్ జోలికి పోలేదు. జీవితం మలుపులు తిరగాలని అనుకోలేదు. దెబ్బకి దయ్యం వదిలింది. తిక్క కుదిరింది.

*స్వాతి వారపత్రిక, 7 జులై 2000*

# ఇల్లు కట్టి చూడు

"ఇంకెంతసేపు పడుకుంటారు? జాము పొద్దెక్కింది లేవండి" విసుగ్గానే భర్తకి మేలుకొలుపు పాడింది రాధ.

బద్ధకంగా పక్కకు పొర్లాడు మోహన్, "హబ్బా! అప్పుడే తెల్లారిందా? వెధవది. అలవాటు లేని పని. ఒళ్ళంతా విరగ్గొట్టినట్లు ఉంది. ఇంకాసేపు పడుకుని లేస్తానోయ్" అన్నాడు గారంగా.

"నేను మాత్రం మట్టి తట్ట నెత్తిన పెట్టుకుని పుట్టానా? నాకూ అలవాటు లేని పనే! నా ఒళ్ళూ హూనం అయిపోతోంది. మీకేం, నిన్న రాగానే మహారాజులా మంచం ఎక్కి పడుకున్నారు. మీ అందరికి వండి వడ్డించి అన్నీ సర్దేసరికి పదకొండయింది. మళ్ళీ తెల్లారి అయిదింటికే లేచాను. నేనెవరికి చెప్పుకోను" అంటూ ముక్కు చీదింది రాధ.

లేచి కూర్చుని భారంగా నిట్టూర్చాడు మోహన్. "ఏం చేస్తాం? ఇదంతా మన కర్మ. ఏ ముహూర్తాన ఈ వ్యవహారం తలపెట్టామోగాని, ప్రాణానికి సుఖం లేకుండా పోయింది" అన్నాడు గద్గద కంఠంతో.

"ఏం చేస్తాం? తలరాత తప్పించగలమా? ఇంకా ఏదో గుడ్డిలో మెల్ల అన్నట్లు ఈనాటికి ఇంతమాత్రంగా ఉన్నాం. అందుకానందించండి. మొన్న పేపర్లో చదవలా? పాపం వాళ్ళెవరో లక్షలకు లక్షలు చిట్‌ఫండ్ కంపెనీలో దాచుకుంటే ఆ కంపెనీ కాస్తా మూసుకుపోయాదుట. వాళ్ళతో పోల్చుకుంటే మనం అదృష్టవంతులం కాదూ! లేవండి. మళ్ళీ ఆలస్యం అయితే మాట పడాలి" అంటూ భర్తని ఓదార్చింది రాధ.

లేచి బ్రష్ చేసుకుని కాఫీ తాగాడు మోహన్. గడ్డం, స్నానం సాయంత్రానికి వాయిదా వేశాడు. పేపరు అందుకోబోతుంటే పిలిచింది రాధ. "వీళ్ళు చూడండి స్కూలుకి వెళ్ళమని మొండికేస్తున్నారు" అంది.

"ఏమిట్రా! ఎందుకెళ్ళరు స్కూలుకి" అంటూ ఇద్దరు కొడుకులనీ నిలదీశాడు.

"మేం వెళ్ళం. మేము మీతో వస్తాం ఎంచక్కా ఇసకలో ఆడుకుంటాం" అన్నారు ఇద్దరూ వంతులు వేసుకుని.



చిర్రెత్తుకొచ్చింది మోహన్‌కి. ఇద్దర్నీ చెరొకటేసేసి, "వెధవల్లారా పదండి స్కూలుకి" అని కసిరాడు. దాంతో ఏడ్చుకుంటూ లోపలికి పోయారు ఆ సుందోప సుందులు.

ఆ తర్వాత దంపతులిద్దరూ ఆదరా బాదరా పిల్లల్ని స్కూలుకి పంపించి, టిఫిన్ తిని క్యారేజీ సర్దేసుకున్నారు.

వంకెన ఉన్న నలిగిన బట్టల వంక ఓసారి చూసి, చాల్లే నేనేం పెళ్ళికి వెళ్ళడం లేదు కదా అనుకుని అవే వేసుకున్నాడు. రాధ కూడా తల దువ్వుకుని, మొహం కడుక్కుని తయారైపోయింది.

దొడ్లో మేకుకి తగిలించి ఉన్న సంచీ తీసి అందులో అన్నీ ఉన్నాయో లేదో ఓసారి చూసింది. ఆ మాత్రం కదలికకే సంచీలోంచి దుమ్మూ, సిమెంటుల మిశ్రమం మేఘంలా లేచింది. ఆ దుమ్ము ముక్కు, నోటా దూరి హచ్ అంటూ తుమ్మడం మొదలు పెట్టింది రాధ.

"శుభమా అని బయలుదేరుతూ ఉంటే ఏమిటా తుమ్మడం?" విసుక్కున్నాడు మోహన్.

"మనం వెళ్ళబోయే ఇంతోటి రాచకార్యానికి నా తుమ్ముల వల్ల ఆటంకం రాదులేండి" బదులు చెప్పింది రాధ.

భార్యనైతే మందలించాడు గానీ ఆ దుమ్ముకి అతనూ తుమ్మడం మొదలు పెట్టాడు. ఎలాగైతేనేం, భార్యాభర్తలు బయటపడి తలుపు తాళం వేసి నాలుగడుగులు వేశారో లేదో పక్కావిడ పిలిచింది.

"పొద్దున్నే ఎక్కడికో బయలుదేరినట్లున్నారు" అని అడిగింది.

'రోజూ ఇదో పీడాకారం' లోలోపలే విసుక్కున్నారు దంపతులు.

వాళ్ళు సమాధానం చెప్పకపోయేసరికి మళ్ళీ మొదలెట్టింది ఆవిడ.

"ఇంటిదగ్గరకేనా? త్వరగా తెమిల్చేసుకోండి. ఈ నెలా పైనెలా దాటితే మళ్ళీ మూఢాలు. ముహూర్తాలు ఉండవు. ముందే చెప్తున్నా. మా అందరికీ ఘనంగా విందు భోజనం పెట్టాలి సుమా" అంది నవ్వుతూ.

"దానికంటే ముందు నీకు తగిన సన్మానం చేసి ఫలానావిడ పళ్ళు రాలగొట్టాం పార్టీకి రండి అని అందర్నీ పిల్చి ఘనంగా విందు చేస్తాను. దిక్కుమాలిన పీనుగా" అంటూ మెల్లిగా గొణిగాడు మోహన్.

"హుష్ ఆవిడ వింటుంది. పిల్లికి చెలగాటం ఎలుక్కి ప్రాణసంకటం అంటే ఇదే. ఏం చేస్తాం? రోజులు మనవి కానప్పుడు ఎన్నైనా భరించాలి" అంటూ భర్తని లాక్కుపోయింది రాధ.

ఇద్దరూ గమ్యం చేరారు. అప్పటికే ఎనిమిదిన్నర అయింది. హనుమంతరావు ఇసక దిబ్బమీద కూర్చుని రిజిష్టరు తీసి అందరి పేర్లూ పిలుస్తున్నాడు. హమ్మయ్యా సమయానికే వచ్చాం అని గబాల్న వెళ్ళి హాజరు వేయించుకున్నారు రాధ, మోహన్.

"ఆనందరావుగారు ఏరీ?" కాస్త అసహనంగా ప్రశ్నించాడు రామక్రిష్ణ.

"వాళ్ళ అమ్మగార్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలిట. మధ్యాహ్నం నుండి వస్తానన్నాడు." సమాధానం చెప్పాడు ఆనంద నందనం నిర్మాణ సంఘం అధ్యక్షుడు ప్రసాద్.

ఇది మరీ బావుంది. ఏరు దాటాక తెప్పతగలెయ్యడం అంటే ఇదే. తన పని జరిగినంత కాలం ఠంచనుగా వచ్చాడు. ఆ తర్వాత ఏవో కుంటిసాకులు పెట్టి పనెగ్గొట్టడం మొదలు పెట్టాడు." మండిపడ్డాడు శ్రీధర్.

"ఇలా అయితే లాభం లేదండీ. మాకు మాత్రం లేవా పన్లు? రూలంటూ పెట్టాక కచ్చితంగా పాటించాల్సిందే. తనకు వీలుగాకపోతే తన బదులు ఇంకెవరినైనా పంపాలని ముందుగానే అనుకున్నాం కదా!" పాయింట్ పట్టాడు శేఖర్.

"అవును. అందుకేగా మొన్న వీలుగాకపోతే మా తమ్ముడిని పంపిందీ? మాకో రూలూ, ఆయనకో రూలూనా? ఇలా అయితే కష్టం సుమండీ" అన్నాడు శ్రీనివాస్.

"అసలు విషయం అదికాదు లెండి. ఈ హనుమంతరావుగారికీ, ఆనందరావుకీ దూరపు బంధుత్వం ఉందికదా!" వ్యంగ్యంగా ఓ విసురు విసిరాడు ఆనందరావు.

దాంతో హనుమంతరావుకి కోపం వచ్చింది.

"అంటే ఏమిటండీ మీ ఉద్దేశం? నేను సెక్రటరీని కాబట్టి నా బంధువుకి ఫేవరు చేస్తున్నాననా? మీరంతా కలిసి నా నెత్తిన బాధ్యత పెట్టినందుకు గొడ్డులా పనిచేస్తున్నాను కదా! అది కనిపించడం లేదా మీ కళ్ళకి" అంటూ ధ్వజమెత్తాడు.

"అదేం లేదులెండి. ఊరికే మాటవరసకి అన్నాడాయన. అయినా ఈ విషయంలో మీరేం చేస్తారు? అసలిదంతా ప్రసాదుగారు ఇచ్చిన అలుసు. ఆయన కాస్త కరుగ్గా ఉంటే బావుంటుంది" అన్నాడు ఆంజనేయులు.



"మా బాగా చెప్పారు. ఏదో మోటు సామెత చెప్పినట్లు. ఆయనకా కరుకుదనమే ఉంటే మనకీ గతి ఎందుకు? నోట్లో వేలు పెడితే కొరకలేని అమాయకుడు. అపర అహింసావాది. గాంధీగార్ని చంపి పుట్టాడు" అన్నాడు ఆనందరావు హేళనగా.

కడుపులోంచి దుఃఖం తన్నుకొచ్చింది ప్రసాద్‌కి.

"ఇది మరీ బావుందండీ. నేను ఇరుక్కున్నది చాలక మా ఇద్దరు బావగార్లని ఇరికించాను. అటు వాళ్ళు నన్ను ఫుడ్‌బాల్ తన్నినట్లు తంతున్నారు. ఇక్కడ చూడబోతే వయసులో పెద్ద, మీకే ప్లాట్లు ఎక్కువ అని నా దుంపతెంచి నాకీ అధ్యక్ష పదవి అంటగట్టారు. ఏదో నా చేతనయినట్లు చేస్తూనే ఉన్నాను కదా! అంతగా మీకు నచ్చకపోతే నా పోస్టు మరెవరైనా తీసుకుని సమర్థంగా నిర్వహించండి. అంతేగానీ, ఇలా పొడుచుకు తినడం అంత సమంజసంగా లేదు సుమండీ" అన్నాడు గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ.

ఇక లాభం లేదని లేడీసు పూనుకుని అందరికీ సర్దిచెప్పి కర్తవ్యోన్ముఖులను చేశారు.

అందరూ లేని పాంట్లు, షర్టులు తీసి మేకులకి తగిలించి సంచీల్లో వెంట తెచ్చుకున్న హాఫ్ పాంట్లూ, లుంగీలూ ధరించారు. ఆడవాళ్ళు కూడా లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని పాత చీరలు కట్టుకుని తలకి గుడ్డలు చుట్టుకున్నారు. అంతలోనే సుజుకీ బైక్‌మీద వచ్చాడు మేస్త్రీ యాదగిరి.

"ఏంది సారూ! అంత ఆరాముగా కూకుని మాట్లాడేకి ఇదేమైనా మీ దఫ్తరా? లెండి. జల్దీ కామ్ షురూ జెయ్యన్రి" కసిరాడు. దాంతో కంగారుగా లేచి బొచ్చెలూ, కడవలూ వగైరా పరికరాలు అందుకున్నారు. అందరూ తమ దీనస్థితికి తామే జాలిపడుతూ పని ప్రారంభించారు.

పాపం వాళ్ళంతా లక్షణంగా చదువుకుని సుమారైన ఉద్యోగాలు చేసుకుంటున్నవాళ్ళు. నాలుగేళ్ళ కిందటిదాకా దర్జాగానే బతికారు. ఆ తర్వాతే పట్టింది శని.

పోనీ వాళ్ళేమైనా వ్యసనాలకి డబ్బు తగలేశారా అంటే అదీ కాదు. అయ్యవారిని చెయ్యబోతే కోతి అయిందన్నట్లే అయింది వాళ్ళ వ్యవహారం.

అద్దె ఇళ్ళల్లో ఎన్నాళ్ళు పడుంటాం. పెరిగిపోతున్న అద్దెలు, అడ్వాన్సులు. కాస్త స్థిరపడ్డాం అనుకునేసరికి ఇంటివాళ్ళు ఖాళీ చెయ్యమనడం, మళ్ళీ ఇంటి వేట మొదలు.

ఈ పాట్లన్నీ పడే బదులు సొంత ఇల్లు అమర్చుకుంటే సుఖం. అందులో ప్రస్తుతం ఇల్లు కొనుక్కోవడం అంత అలవిగాని పనేం కాదు. డబ్బులిస్తే ఫ్లాటు కట్టిపెట్టేవాళ్ళున్నారు. కాబట్టి ఆ ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఇల్లు అమర్చుకోవడం మరీ అంత కష్టం కాకపోయినా, సులభం కూడా కాదు. ఇంటి లోన్‌కి తీసుకున్న డబ్బుకి, అలివి మించిన నెలసరి వాయిదా చెల్లించి, కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకోవడం సాధ్యం కాదు. మరీ ఊరి పొలిమేర దాటి పాతిక మైళ్ళ దూరంలో ఇల్లు దొరికినా సుఖం లేదు.

కాబట్టి అనూ పానూ చూసుకుని చివరికెలాగైతేనేం ఒక బిల్డర్ కట్టబోయే అపార్ట్‌మెంట్స్‌లో ఇల్లు కొనుక్కోవాలని నిర్ణయించుకున్నారు. నగరం నడిబొడ్డులో కాకపోయినా అన్ని సదుపాయాలూ ఉన్న ఏరియాలోనే ఉంది. ధర కూడా అందుబాటులోనే ఉంది. అయిదంతస్తుల భవనం. అంతస్తుకి నాలుగు ఫ్లాట్లు మొత్తం ఇరవై భాగాలు.

బిల్డరు మంచివాడే. ఆఫీస్ రూమ్ నిండా దేవుడి ఫోటోలు మొహాన రకరకాల బొట్లు పెట్టుకుని, దైవభక్తీ, పాపభీతీ ఉన్నట్లూ కనిపించాడు. నిర్మాణానంతరం భవనం ఎలా ఉంటుందో వివిధ కోణాల్నించి బొమ్మలు గీయించి ఇంటికి తాను అమర్చబోయే మొజాయిక్ ఫ్లోరింగూ, సదుపాయాల వివరాలు తెలియజేస్తూ కరపత్రాలు కళాత్మకంగా తయారు చేయించాడు. అంతా బాగానే ఉంది కాబట్టి అనతి కాలంలోనే అన్ని ఫ్లాట్లూ అమ్ముడైపోయాయి. మొత్తం విలువలో పది శాతం ఫ్లాట్ బుక్ చేసినప్పుడు ఇమ్మన్నాడు. ఆ తర్వాత స్తంభ ముహూర్తం రోజున పది శాతం, గుంటలు తీయగానే మరో పది శాతం శ్లాబులు కాగానే యాభై శాతం, మిగిలినది ఫ్లాటు అప్పగించే సమయంలోనూ ఇవ్వమన్నాడు.

ఏణ్ణర్థంలో బిల్డింగ్ పూర్తయిపోతుంది, గృహప్రవేశాలకు ముహూర్తాలు పెట్టుకోండి అన్నాడు. ఆ భవనానికి ఆనంద నందనం అని నామకరణం చేశారు.

ఏడాది తిరిగి వచ్చింది. ఓనర్లందరి దగ్గరా ఎనభైశాతం సొమ్ము వసూలు చేశారు. అయిదు అంతస్తులకూ శ్లాబులూ, మూడో అంతస్తు వరకూ గోడలూ పూర్తయ్యాయి. ఆ తర్వాత బిల్డర్ కనిపించడం మానేశాడు.

వాళ్ళ మామగారు పోయారు. ఊరికెళ్ళారు. కర్మ పూర్తికాగానే వస్తారు అన్నాడు ఆఫీసు బాయ్. ఆ తర్వాత అతగాడు కూడా అజాపజా లేకుండా పోయాడు. తాళంవేసిన ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయి అంతా ఏకమై తాళం పగలగొట్టి లోపలికి



వెళ్ళారు. వాడిపోయిన దండలతో దేవుని పటాలు తప్ప బిల్డర్‌కు సంబంధించిన సామానుగానీ, సమాచారం గానీ లేదు.

ఇంటి నంబర్‌కు ఫోన్ చేస్తే "ఈ నంబర్‌తో ప్రస్తుతం ఏ టెలిఫోనూ పనిచెయ్యడం లేదు" అని చిలకలా సమాధానం వచ్చింది. అడ్రస్ పట్టుకుని ఇంటికి వెళ్ళి చూస్తే అది అద్దె ఇల్లనీ, అక్కడి నుంచి ఖాళీచేసి వెళ్ళిపోయాడనీ తెలిసింది.

లబోదిబోమంటూ ఆనంద నందనం సభ్యులంతా సమావేశమై కింకర్తవ్యం అని తలలు పట్టుకున్నారు. ఏం చెయ్యాలన్నా డబ్బు కావాలి కాబట్టి అంతా తలా కాస్తా వేసుకుని ఒక సంఘంగా ఏర్పడ్డారు.

పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు. వివిధ ఆఫీసులచుట్టూ తిరిగి తమ గోడు వెళ్ళబోసుకున్నారు.

ఆయా చోట్ల తమవంటి బాధితులు కొంతమంది తటస్థపడ్డారు.

"ఏవిటీ? మీకు అయిదంతస్తులకీ శ్లాబులు వేసి, మూడంతస్తులకు గోడలు లేపి, అప్పుడు పారిపోయాడా మీ బిల్డర్? ఎంత అదృష్టవంతులండీ మీరు. మా బిల్డర్ ఓ అంతస్తుకి మాత్రమే శ్లాబు వేసి పరారైపోయాడు" అన్నారు కల్పవృక్షం అపార్ట్‌మెంట్స్ ఓనర్లు వీళ్ళ వంక అసూయగా చూస్తూ.

"నా పాత ఇల్లు పడగొట్టి ఆ స్థలంలో ఫ్లాట్లు కడతానంటే, ఫిఫ్టీ ఫిఫ్టీ షేరు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాం. తీరా ఇల్లు పడగొట్టి బోరు వేసి నీళ్ళు పడలేదని చెప్పి పత్తాలేకుండా పోయాడు. నేనే గంగలో దూకేది" అంటూ జేబురుమాల్తో కళ్ళొత్తుకున్నాడు ఒకాయన.

ఆనంద నందనం సభ్యులంతా విసుగుచెందని విక్రమార్కుల్లా వివిధ ప్రయత్నాలు చేశారు. ఆ ప్రాంతం ఎం.పిని కలిసి అర్జీ సమర్పించారు. ఈ కలవడాలకీ, పార్టీల చేతులు తడవడానికీ పోగుచేసిన సొమ్ము కాస్తా ఖర్చైపోయింది. ఓ ఏడాది గడిచిపోయింది. కానీ వ్యవహారం మాత్రం అంగుళం కూడా కదల్లేదు.

కోర్టుకి వెళ్దామా అనుకున్నారు. కోర్టుకెళ్ళడానికేం మహారాజులా వెళ్ళొచ్చు. కాకపోతే పట్టపగలు ప్రధానమంత్రిని కాల్చి చంపిన కేసులో నేరస్థులకు శిక్ష విధించడానికే పదేళ్ళు పట్టే మనదేశంలో ఇలాటి పులుసులో ముక్క కేసులు ఓ కొలిక్కి రావాలంటే హీనపక్షం అయిదారు దశాబ్దాలు పడుతుంది.

పోనీ, ఈ బిల్డింగుని మరెవరైనా పూనుకుని పూర్తిచేస్తారేమో అని ప్రయత్నం చేసి చూశారు. ఆ బిల్డింగుని అలాగే మరే బిల్డరుకైనా అమ్మేద్దాం అని మరో పథకం వేశారు. ఏదీ కలిసిరాలేదు. మరో ఏడాది గడిచిపోయింది.

క్రమంగా బిల్డింగు కళ తగ్గిపోసాగింది. రకరకాల జనం చేరి పేకాటలూ, తాగుళ్ళూ మొదలుపెట్టారు. ఇల్లూ వాకిలీ లేని ముష్టివాళ్ళు ఆ ఇంట్లో నివాసం ఏర్పాటు చేసుకుని, వంటావార్పూ మొదలు పెట్టారు.

ఇదిలా ఉండగా, ఇల్లు తయారవకపోయినా కాలం గడిచిపోయింది. కాబట్టి నిర్ణీత సమయానికి అప్పులిచ్చినవాళ్ళంతా ఠంచనుగా వాయిదాల కోతలు మొదలు పెట్టడంతో ఆనంద నందనం సభ్యులంతా నీటినుండి బయటపడ్డ చేపల్లా విలవిల్లాడ సాగారు.

ఇలా లాభం లేదు. ఇందులోంచి బయటపడే మార్గం అన్వేషించాలి అనుకున్నారు. ఎలాగూ మూడొంతుల డబ్బు ఈ ఇంటిమీద పోశాం. అదెలాగూ వెనక్కు రాదు. కాబట్టి మంచో చెడో ఇల్లు పూర్తయితే పీకల్దాకా మునిగి పోకుండా కాస్తో కూస్తో నష్టంతో సరిపెట్టుకోవచ్చు. ఇంతదాకా వచ్చినందుకు ఇల్లూ అమరుతుంది.

ఈ నిర్ణయానికి వచ్చాక అనుభవజ్ఞుల సలహా తీసుకున్నారు. "భేషైన ఆలోచన. ఆ పనేదో ఆనాడే చేసుంటే ఎంతో బాగుండేది. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ఇక తక్షణం పని ప్రారంభించండి. రోజురోజుకీ బజార్లో సిమెంటూ, ఇనుమూ, ఇసకా ధరలు పెరుగుతున్నాయి. ఎంత త్వరగా పనైతే అంత తక్కువలో సరిపోతుంది" అన్నాడు ఆయన. దాంతో చురుకు పుట్టి వెంటనే పని ప్రారంభించారు.

భయంకరమైన ఆర్థిక దుఃస్థితి. పది రూపాయలు ఖర్చుపెట్టే దగ్గర ఏ విధంగానైనా తగ్గించి ఏడ్రూపాయల్లో పని జరుగుతుందేమో అని ఆలోచించే లోటు బడ్జెట్టు. ఇటు చూడబోతే కూలీల రేట్లు మండిపోతున్నాయి.

కాబట్టి తామే పనిచేసుకుంటేనో అనే ఆలోచన వచ్చింది. ముందు భయపడినా, తీరిగ్గా ఆలోచిస్తే అదే మేలనిపించింది. "ఏం, ఏ జన్మభూమి కార్యక్రమమో అయితే చచ్చినట్లు వెళ్ళమా? మన కోసం మన పని చేసుకుంటే తప్పేముంది" అన్నాడొకాయన.

"తప్పేం కాదు. అసలా మాటకొస్తే అగ్రరాజ్యాల్లో ఎవరి పనులు వాళ్ళే చేసుకుంటారుట. మనదేశంలో కూడా పెద్ద పెద్దవాళ్ళంతా ఏ పర్వదినం నాడో పనిగట్టుకొని శ్రమదానంచేసి పుణ్యం సంపాదించుకుంటారుట" సమర్థించాడు మరొకాయన.

చివరికెలాగైతేనేం తామే స్వయంగా శ్రమపడి ఇల్లు పూర్తి చేసుకోవాలని శపథం చేశారు. వీరితో పనిచేయించి, బిల్డింగ్ పూర్తి చేయించే మేస్త్రీలు ఓ పట్టాన దొరకలేదు. చివరికెలాగైతేనేం బతిమాలి, బామాలి యాదగిరిని ఒప్పించారు.



మంచి ముహూర్తాన పని ప్రారంభం అయింది. వంతుల వారీగా సెలవులు పెట్టి, భార్యా సమేతంగా వచ్చి పని చెయ్యాలి. పెందలాడే పన్లు ముగించుకుని ఎనిమిదింటికల్లా సైటుకి రావాలి. సాయంత్రం అయిదింటి దాకా పని చెయ్యాలి. మధ్యలో గంట లంచ్ బ్రేక్. అరగంట టీ బ్రేక్.

వంతులవారీగా ఒకరే అందరికీ సరిపడా వండుకు రావాలని ప్లాన్ చేశారు. పోటీలు పడి ఆడవాళ్ళు వండి తేవడం, పోటీలు పడి మగవాళ్ళు భోజనం చేసి భుక్తాయాసంతో పని చెయ్యలేక అవస్థలూ. ఇతంతా చూసి ఎందుకొచ్చిన గోల. అయినా, ఏదో గతిలేక ఇలా కలుసుకుంటున్నాం. విందులూ వినోదాలకి ఇది సమయం కాదు. అనుకుని ఏదో ఇంత ఎవరికి వారు క్యారేజీలో తెచ్చుకోవడం మొదలు పెట్టారు.

నలుగురు మనుషులు ఒకచోట చేరితే అభిప్రాయ భేదాలూ, వాదోపవాదాలూ సర్వసాధారణం. ముందు అంతా చేరి కలిసికట్టుగా పనిచేద్దాం అనుకున్నా మర్నాటి నుండి ఏవో గొడవలు.

మా ఫ్లాట్‌ని సరిగా తడవ లేదంటే, మా ఫ్లాట్‌లో మీరు సరిగ్గా దిమ్మిస కొట్టలేదు అని మాటా మాటా అనుకోవడం, శ్రుతి మించి రాగాన పడి సమ్మెలూ, నిరాహార దీక్షలూ, పరిచయస్థుల ఎగతాళీ, ఎద్దేవాలూ.

బొత్తిగా చేతా వాతాగాని సరుకు దొరికారని మేస్త్రీ విసుగులూ విదిలింపులూ. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కురుసభలో పాండవ వీరుల్లా అన్నీ సహించి పని జరుపుకోవడం అలవాటు చేసుకున్నారు.

దాదాపు మూడేళ్ళపాటు నిర్జీవంగా పడున్న ఆ బిల్డింగులో మళ్ళీ జీవం వచ్చింది. చీమలు నడిస్తే బండలు అరుగుతాయి అన్నట్లు పని నత్త నడకే నడుస్తున్నా ఏదోనాటికి పూర్తవుతుందనే ఆశాభావంతో పనిచేస్తున్నారు. సొంత ఇంటి కోసం ఆరాటపడి, ఉన్నదంతా ఊడ్చిపెట్టి, ఘోరంగా మోసపోయి, తమగోడు పట్టించుకునే నాథుడు లేక నిలువున అన్యాయం అయిపోయినా అధైర్యపడకుండా, ఏదో నాటికి ఒడ్డు కనిపిస్తుంది అనే మొండి ధైర్యంతో వ్యయప్రయాసలకు ఓర్చి ఏటికి ఎదురీదుతున్న ఆ ఆనంద నందనం వాసుల శ్రమ ఫలించి వాళ్ళూ ఒకింటి వారయే తరుణం ఎంతో దగ్గర్లోనే ఉంది.

కృషితో నాస్తి దుర్భిక్షం. శ్రమయేవ జయతే.

*ఇండియా టుడే వారపత్రిక, 25 ఏప్రిల్ 2000*

# భాస్కరం - రూపాయి

ఇంట్లోకి రాగానే అలవాటు ప్రకారం ఫోన్లేమైనా వచ్చాయా? అని అడిగాను. "రూపాయి బామ్మగారు ఫోన్ చేశారు. వాళ్ళ మనవరాలికి డెలివరీ అయిందిట. అమ్మాయి పుట్టిందిట" అని చెప్పింది నా కోడలు.

"అలాగా! ఇంకేం చెప్పింది అత్తయ్య?" అని అడిగాను.

"ఇంకేం చెప్పలా! రాగానే మిమ్మల్ని ఫోన్ చెయ్యమన్నారు. మీ అత్తగారు తలతిక్కమనిషి. సెల్‌ఫోన్ కొనుక్కోవే అంటే వినదు. ఊరందరిదీ ఓ దారీ ఉలిపి కట్టెది ఓ దారీ అన్నట్లుంటుంది. దీని వ్యవహారం అన్నారు" అని చెప్పింది కోడలు.

నీకేం లేదా పోదా? ఓ సెల్‌ఫోన్ కొనుక్కోరాదా! అని శ్రేయోభిలాషులు అందరూ చెప్తారు. కానీ నాకా సెల్‌ఫోనంటే తలనొప్పి. అదుంటే ఎక్కడో వున్న వాళ్ళతో తప్ప ఎదురుగా వున్న వాళ్ళతో మాట్లాడే అవకాశం వుండదు. మా వాళ్ళంతా వస్తారు. వచ్చిందగ్గిర్నించీ ఆ సెల్‌ఫోన్లో మాట్లాడుతూ సైగలతోనే యోగక్షేమాలు అడిగి, కాఫీ గట్రా సేవించి సెల్‌లో మాట్లాడుతూనే వెళ్ళిపోతారు. అందుకే సెల్‌ఫోన్ జోలికి పోను.

మామూలు ఫోన్‌లోనే మా రూపాయి అత్తయ్యతో మాట్లాడాను. అన్నీ వివరంగా చెప్పింది. "వీలు చూసుకుని రా ఓసారి" అని ఫోన్ పెట్టేసింది.

మా రూపాయి అత్తయ్య చాలా ప్రత్యేకమైన మనిషి.

నేను ఫస్టుఫారమ్‌లో వుండగా మా అత్తయ్య పెళ్ళి అయింది. మా ఇంట్లో జరిగే మామూలు పెళ్ళిళ్ళకు భిన్నంగా జరిగిందా పెళ్ళి. పెద్దగాలి దుమారం లేపింది.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పై చదువులకు వెళ్ళిన మా భాస్కరం మావయ్య అక్కడే తనతో చదువుకుంటున్న ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి వాళ్ళు, మన తెలుగు వాళ్ళు కాదు. ఉత్తరప్రదేశ్ వాళ్ళట.

పెళ్ళయ్యాక ఎవరో ఆకాశరామన్న ఉత్తరం రాస్తే తెలిసింది మా తాతగారూ వాళ్ళకి. భాస్కరం మామయ్య వాళ్ళ నాన్నగారు, మా తాతగారికి బావమరిది వరస. ఎదురుబొదురు ఇళ్ళు. అంతా ఒకే కుటుంబంలా వుండే వాళ్ళు అందరూ.



ఆ విషయం తెలియగానే మొహం తిరిగి పడిపోయారుట వాళ్ళింట్లో ఆడవాళ్ళు. శివతాండవం చేశారుట మామయ్య వాళ్ళ నాన్నగారు. ఇక వాడు మాకు వున్నా లేనట్లే. ఈ జన్మలో వాడినీ గడపతొక్కనివ్వను. వాడి మొహం చూడను అని ప్రతిజ్ఞ చేశారుట.

'వంశానికంతటికీ ఒక్క మగనలుసు. పోయి పోయి ఆ హిందీ పిల్లని పెళ్ళి చేసుకున్నాడు. అంత మాత్రం అమ్మాయి మనూళ్ళో దొరకదా వీడికి? అసలు వీళ్ళని అనాలి. లక్షణంగా మన గుంటూరులో చదివించక ఎక్కడో కాశీకీ పంపించారు గొప్పగా పై చదువులకి. అక్కడ అడ్డుకునేవాళ్ళు మందలించేవాళ్ళూ లేకపోయే సరికి తప్పుదారి పట్టాడు" అనుకున్నారు బంధువులందరూ.

తన చదువు పూర్తికాగానే ఇంటికి వస్తానని ఉత్తరం రాశాడు మామయ్య.

ససేమిరా వీల్లేదు. అక్కడే గంగలో దూకు అన్నారుట తండ్రిగారు. గంగలో దూకలేదు గానీ అక్కడే ఉద్యోగం చూసుకుని కాపురం పెట్టాడు మామయ్య. ఉత్తరాలు రాస్తూనే వుండేవాడు.

అలా కొంతకాలం గడిచింది. ఇక్కడ మామయ్య వాళ్ళ బామ్మ మనవడి మీద దిగులు పెట్టుకుంది. తెలిసిన వాళ్ళు ఎవరో తెనాలి నుంచి కాశీయాత్రకి వెళ్తుంటే "నాయన్నాయనా కాస్త మా మనవడి భోగట్టా ఏమైనా తెలుస్తుందేమో చూడండి" అని అడ్రస్ ఇచ్చి పంపించిందిట ఇంట్లో వాళ్ళకి తెలియకుండా.

వాళ్ళు వచ్చీరాగానే సమారాధన చేసుకుంటూ వీళ్ళని పిలిచారుట. వీళ్ళంతా వెళ్ళారు. అక్కడ భాస్కరం మామయ్యని కలిశారుట. మామయ్య ఎంతో సంతోషించాడుట. దగ్గరుండి అన్నీ చూపించాడుట. మా వాళ్ళంతా బావున్నారా అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడట. భార్య కడుపుతో వుందిట. పుట్టింటికి వెళ్ళిందిట.

ఆ వివరాలన్నీ విని వీళ్ళ ప్రాణం కొట్టుకులాడింది.

ఇంకా ఎంతకాలం ఈ పట్టింపులు? అయిందేదో అయిపోయింది. వంశోద్ధారకుడు పుట్టబోతున్నాడు. ఇకనైనా వాడిని క్షమించి ఇంటికి పిలవండి అని సలహా ఇచ్చారుట ఆ తెనాలి వాళ్ళు.

తల్లీ బామ్మా భాస్కరం మామయ్యని పిలుద్దాం అంటే తండ్రి మాత్రం నేను పిలవను. వాడొస్తే వద్దనను అన్నాడుట బింకంగా.

అలా కొంతకాలం గడిచింది. భాస్కరం మాయ్యకి కొడుకు పుట్టాడనే శుభవార్త వచ్చింది. వీళ్ళ సంబరం అంతా ఇంతా కాదు.

తండ్రికి ఈ శుభవార్త తెలియజేస్తూ మీరు సరేనంటే మీ మనవడిని తీసుకుని మనింటికి వస్తాను అని రాశాడుట మామయ్య.

వెంటనే సిద్ధాంతిగారి దగ్గరకు వెళ్ళి మంచిరోజు చూసి ఫలానా రోజు బావుంది. కోడల్ని మనవడినీ తీసుకు రావలసింది అని సమాధానం రాశాడుట పెద్దాయన.

ఇక చెప్పేదేముంది? ఇల్లంతా ఒకటే సందడి. అనుకున్న వేళకి వచ్చాడు మామయ్య భార్యాబిడ్డలతో.

ఊళ్ళో మా వాళ్ళందరూ వచ్చారు. అందరం అక్కడే వున్నాం. ఇరవై నాలుగ్గంటలూ వాళ్ళ కబుర్లే.

పిల్ల చూశావా ఎంత బావుందో దంతం బొమ్మలా వుంది. ఆ చక్కదనం చూసే మనవాడు సరదా పడ్డాడు. పసివాడు పనసపండులా వున్నాడు అని మురిసి పోయారు.

ఉత్తరప్రదేశం వాళ్ళేగానీ వాళ్ళు మన బ్రాహ్మలేనట. వాళ్ళింట్లో ఉల్లిపాయకూడా ముట్టరట.

పిల్లతో ఎంత సామానూ సరంజామా పంపేరో చూశారా? పెళ్ళి తర్వాత మొదటిసారి అత్తవారింటికి వెళ్తోందని ఇంటిల్లిపాదికీ బట్టలు పంపేరుట. అత్తగారికీ, ఇద్దరు ఆడబడుచులకీ జరీపూల బెనారసు చీరెలు పంపారు. చూస్తేనే కళ్ళు చెదిరిపోతున్నాయి.

ఏంటేంటో వింతవింత మిఠాయిలు పంపేరుట. అవిగాక పటిక బెల్లం, సీమ బాదంపప్పు, జీడిపప్పు, ఖర్జూరం పళ్ళు ఇన్నేసి పంపించారుట.

వాళ్ళల్లో ఆడపిల్ల ఇంటికి రావడం ఆచారం కాదుట. అందుకే ఎవరూ వెంట రాలేదుట. మీరు మీ వీలు చూసుకుని అందరితో వచ్చి మా ఇంటిని పావనం చెయ్యండి అని వియ్యంకుడు వినయంగా ఇంగ్లీషులో ఉత్తరం రాసి కూతురికిచ్చి వియ్యంకుడికి పంపించారుట.

మన ప్రాంతం వాళ్ళు కాదుగానీ పాపం మంచివాళ్ళే. మర్యాదస్తులు. మొత్తానికి మన నరసింహం, కామాక్షీ అదృష్టవంతులే. మంచి కోడలు దొరికింది అనుకున్నారు.

అమ్మాయి పేరు రూపాయిట.

"మనం మనవైపు ధనలక్ష్మీ, పవిడమ్మా, భాగ్యలక్ష్మీ అని పేర్లు పెట్టడం లేదూ. అటు వైపు ఉత్తరప్రదేశం కాబట్టి రూపాయీ, అర్ధరూపాయీ, పావలా అని పేర్లు పెట్టుకుంటారు కామోసు అనుకున్నారు. అమ్మాయీ రూపాయీ అని పలకరించారు.

ఎటొచ్చీ భాషే రాకపోయే. చిలకలా నవ్వడమే తప్ప ఒక్క ముక్క మట్లాడే అవకాశం లేదు రూపాయికి.

మా పిల్లగుంపుని పిల్చి మీరు హిందీలు వెలగబెడుతున్నారుగా ఆ రూపాయితో ఓ మాట మాట్లాడ లేరూ అని మమ్మల్ని అడిగేరు.



ఏదో హిందీ టీచరు భయానికీ, హిందీలో పాసు మార్కులు రాకపోతే పరీక్షలు తప్పిస్తారని బెదురుతూను హిందీ నేర్చుకుంటున్నాం గానీ మాకేం వచ్చు? పానీ, అచ్చా అని రెండు మాటలే వచ్చు.

అవే ఎంత సేపు మాట్లాడతాం. మామయ్య మాత్రం హిందీ సినిమాలో దేవానంద్‌లాగా గలగల మాట్లాడేస్తున్నాడు హిందీ.

మామయ్య దగ్గరికి వెళ్ళి "మామయ్యా నువ్వు ఇంత బాగా హిందీ నేర్చేసుకున్నావు కదా. మరి రూపాయి అత్తయ్యకి తెలుగు నేర్పలేదేం!" అని నిలదీసి అడిగేం.

"శ్రీరామచంద్ర ప్రభూ" దాని పేరు రూపాయి కాదు రూపాలి. బామ్మకి నోరు తిరక్క రూపాయి రూపాయి అని మొదలు పెట్టింది" అంటూ నవ్వేశాడు మామయ్య. అంతేగాదు అడ్డగాడిదల్లాగా ఇంతమంది వున్నారు కదా! కాస్త మీ అత్తయ్యకి తెలుగు నేర్పండి అని ఆ బాధ్యత మా మీదే పెట్టాడు.

అత్తయ్య పేరు రూపాయి కాదు రూపాలిట అని పెద్ద వాళ్ళకి చెప్పాం. కానీ వాళ్ళు రూపాలు ఏవిటి పాపాలు రూపాయే బావుంది అన్నారు. ఆ పేరే స్థిరపడిపోయింది.

మా మామయ్య మళ్ళీ కాశీ వెళ్ళలేదు. గుంటూర్లోనే ఉద్యోగం వచ్చింది. మా అత్తయ్యకు తెలుగు నేర్పడం ప్రారంభించాం.

మొదట్లో మీ తాతయ్య అన్నం తింటున్నాడు. కుక్కగారు లోపలికి వచ్చేస్తున్నారు అని అస్తవ్యస్తంగా మాట్లాడినా త్వరగానే నేర్చేసుకుంది.

ఏడాది తిరిగేసరికి "ఇట్లా నాగాలు పెడితే మాన్పించేస్తాను జాగ్రత్త" అని పని మనిషిని మందలించే స్థితికి చేరుకుంది. రోజూ శేష్‌మహల్లో రెండో ఆట సినిమాలు చూసేస్తూ భాషాజ్ఞానం వృద్ధి చేసుకుంది.

మామగారు దేవతార్చనలో వుంటే 'మావయ్యగారు! మీ కోసం జొన్నాభట్ల విఘ్నేశ్వర్రావు గారుట వచ్చారు. వుండమంటారా, మళ్ళీ రమ్మంటారా' అంటూ మాట్లాడేస్తుంటే ఆ మావగారి మురిపెం చూడాల్సిందే.

శుక్రవారం నాడు 'మంగళహారాతీ గైకొనూ పార్వతీ" అని పూజ దగ్గర మంగళహారతి పాడుతుంటే అత్తగారికి ఆనంద బాష్పాలు వచ్చేవి.

చుట్టాలందరికీ సుస్పష్టంగా తెలుగులో మాట్లాడుతూ తల్లోనాలికలా మారిపోయింది.

అందుకే ఎంతమంది వున్నా అప్పటికీ ఇప్పటికీ మా ఇంట్లో మా రూపాయి అత్తయ్యది ప్రత్యేక స్థానం.

*పత్రిక మాసపత్రిక, దీపావళి జన్మదిన ప్రత్యేక సంచిక - అక్టోబరు 2006*

# తీరని కోరిక

రాధ చాలా అందంగా ఉంటుంది. అందం అంటే అంతా ఇంతా కాదు, 'మా హీరోయిన్ ఇంత అందంగా ఉంటుంది, ఆవిడ కళ్లు కలవలు! పెదవులు దొండపళ్లు, పళ్లు ముత్యాలు...' అంటూ వర్ణించే వారంతా అంత శ్రమ పడకుండా రాధ ఫోటో ఒకటి వేయించి 'మా హీరోయిన్ ఇలా ఉంటుంది' అంటే తేలికగా తేలిపోతుంది.

అయితే అందులో ఒక చిక్కు ఉంది. అలా చేసిన వాళ్లని అంత తేలిగ్గా వదలడు ఆవిడ తండ్రి లాయరు రంగారావు. వాళ్ల మీద కేసు పెట్టి కోర్టుకీడ్చి వీలైతే ఉరిశిక్ష, కాని పక్షంలో కనీసం కఠిన కారాగార శిక్ష అయినా పడేలా చూస్తాడు. అంతంతమాత్రంగా సాగుతున్న ఆయన ప్రాక్టీసు కూతురు పుట్టాక దినదిన ప్రవర్ధమానంగా పెరిగింది. అందుకే ఆయనకు కూతురంటే పంచప్రాణాలు.

చిన్నతనంలో ఒకసారి రాధ లడ్డూ చేసిపెట్టమని తల్లిని అడిగింది.

"ఇప్పుడు నాకు ఒంట్లో బాగాలేదు. అయినా ఇప్పుడేం లడ్డూలూ? గొంతెమ్మ కోరికలూ నువ్వూనూ!" అని విసుక్కుంది తల్లి. వెంటనే రాధ తండ్రితో చెప్పుకుని ఏడ్చింది. వెంటనే కూతుర్ని ఎత్తుకుని ఇంట్లోకి వెళ్లాడాయన.

"ఏమిటీ, నా కూతురు లడ్డూలు చేయమంటే, కాదనడమే కాకుండా గొంతెమ్మ కోరికలూ... అనీ... అంటూ అమర్యాదగా మాట్లాడావుట?" అని ప్రశ్నించాడు కఠినంగా.

ఆవిడ ఏదో చెప్పబోతుంటే వారించాడు. "నీ మీద కేసు వేస్తున్నాను. ఏం చెప్పుకోవాలన్నా కోర్టులో చెప్పుకో!" అని హెచ్చరించి వెళ్లిపోయాడుట.

ఆవిడ తల బాదుకుని, వెంటనే కూతురి కోరిక తీర్చి వ్యవహారం కోర్టు దాకా వెళ్లకుండా అడ్డుకుంది.

అటువంటి రాధకు ఒక కోరిక ఉంది. సినిమాల్లో చేరి పెద్ద హీరోయిన్ అయిపోయి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని గట్టి పట్టుదలగా ఉండేది. డిగ్రీ



పూర్తయ్యాక ప్రయత్నాలు మొదలు పెట్టాలని ప్లాన్ వేసుకుంది. పరీక్షలవగానే తాతగారింటికి హైదరాబాదు ప్రయాణం కట్టింది.

రాధ తాతగారికి హైదరాబాదులో ఇల్లు ఉంది. వాళ్లది సొంత బిజినెస్. రాక రాక వచ్చిన మనవరాలికి ఘనస్వాగతం పలికారు ఇంట్లో వాళ్లంతా. వచ్చిన మర్నాడే తన మనసులోని మాట మేనమామ ప్రసాద్ చెవిన వేసింది.

ప్రసాద్ గుండెల్లో రాయి పడినట్టయింది. అతనికి రంగారావుగారంటే చచ్చేంత భయం. తిక్కమనిషి.

ఇప్పుడు రాధ కోరిక ప్రకారం ఎవర్నయినా కలుసుకుని వారికి రాధను పరిచయం చేసి, ప్రయత్నాలు చేయవచ్చు. కానీ ఆయనకి ఆగ్రహం వచ్చి 'హన్నా! నా కూతురు నాల్రోజులు సెలవుల్లో వస్తే, దాన్ని తీసుకెళ్లి సినిమాల్లో చేర్పిస్తావా? ఉండు. నిన్నేం చేస్తానో!' అని పగబూని తన లైసెన్స్ పీకించేస్తాడేమో అని భయం.

కాదంటే, "ఎంత ధైర్యం నీకు? నా కూతురు నోరు విడిచి అడిగితే కాదంటావా? చూపిస్తా నా తడాఖా!" అని గుడ్లురిమి ఏదైనా కేసులో ఇరికించి జైల్లో పెడతాడేమో అని భయం.

ఎటూ తోచక బుర్ర గోక్కుని, "సర్లే! నాకు తెలిసినవాళ్లు సినీఫీల్డులో ఉన్నారు. వీలు చూసుకుని తీసుకువెళ్తాను!" అన్నాడు.

కొండెక్కినంత సంబరపడింది రాధ. మామయ్య వాళ్ల దగ్గరికి తీసుకెళ్తాడు. ఎలాంటి బట్టలేసుకు వెళ్లాలి? వాళ్లతో ఎలా మాట్లాడాలి? వాళ్లు హీరోయిన్ రోల్ కాకుండా ఏ హీరో చెల్లెలి వేషమో ఇస్తానంటే ఎలా మర్యాదగా తిరస్కరించాలి? వగైరాలన్నీ ఆలోచిస్తూ రాత్రంతా నిద్రకు దూరం అయింది.

అసలే ఏడు మల్లెపూల ఎత్తు సుకుమారి... కొత్తచోటు. నిద్ర లేక తెల్లారేసరికి తలనొప్పి, జలుబు పట్టుకున్నాయి. రాధ తాతగారికి షుగరు, బ్లడ్‌ప్రెషరూ వగైరా ధనవంతులకి ఉండే జబ్బులన్నీ ఉన్నాయి. ఆయనను చూసేందుకు డాక్టరుగారు తరచూ వస్తూంటారు. ఆయన ఇవాళ ఎలాగూ వస్తారు. పనిలో పని రాధనూ చూడమందాం అనుకున్నారు ఇంట్లో వాళ్లు.

పదిగంటలకి తాతగారి ఫామిలీ డాక్టర్ గోపాలకృష్ణగారి బదులు వారి పుత్రుడు ఇటీవలే ప్రాక్టీసు ప్రారంభించిన వంశీకృష్ణ కారులోంచి దిగాడు.

అందరినీ ఆదరంగా పలకరించి తాతగారి దగ్గరకు వెళ్లి రొటీన్‌గా పరీక్ష చేశాడు. "అంతా బాగుందండీ!" అన్నాడు.

"మా మనవరాలు ఊరి నుంచి వచ్చింది. బాబూ! దానికి ఒంట్లో బాగాలేదు. ఆ చేత్తోనే దాన్నీ చూసి వెళ్లు, నాయనా!" అన్నారు తాతగారు.

"ఓఁ... దానికేం భాగ్యం, అలాగే!" అంటూ లేచాడు వంశీ, ప్రసాద్ వెంటనే మేడమీదికి వెళ్లి గదిలో అడుగుపెట్టి రాధ వంక చూశాడు.

అంతే! ఒక్కసారి రంగుల రాట్నం ఎక్కినట్లు తల గిర్రున తిరిగిపోయింది. భూమి తల మీద ఆకాశం కాళ్ల కింద ఉన్న అనుభూతి కలిగింది.

"రండి, ఈ అమ్మాయే మా మేనకోడలు రాధ!" ప్రసాద్ చెప్తూ తీసుకెళ్తూ ఉంటే ఆ అయోమయావస్థలోనే వెళ్లి పేషెంటు మంచం పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. తడబడుతూ పల్స్ చూసి, అయోమయంగానే స్టెతస్కోప్ తీసి రాధ గుండెమీద పెట్టాడు. అతని గుండె ఝారుమంది. 'ఈవిడ గుండె ఆగిపోయింది' అనుకుని దుఃఖంతో తన గుండెమీద పెట్టుకున్నాడు స్టెత్. 'హమ్మయ్య. నా గుండె కూడా ఆగిపోయింది' అనుకుని తృప్తిపడ్డాడు.

"డాక్టరుగారూ! మీరు స్టెతస్కోప్ చెవికి పెట్టుకోలేదండీ!" అంది రాధ.

ఇహలోకంలోకి వచ్చి, ఈసారి జాగర్తగా పరీక్ష చేసి మందులు రాశాడు. "నేను మధ్యాహ్నం వచ్చి చూస్తాను!" అని చెప్పి వెళ్లిపోయాడు.

సినిమావాళ్లను కలుసుకునేందుకు వెళ్లకుండా జలుబు అడ్డురావడంతో రాధిక ఏడుపొచ్చి ఏడ్చింది. దాంతో తలనొప్పి ఎక్కువై కాస్త జ్వరం కూడా వచ్చింది.

మధ్యాహ్నం వచ్చి రాధను చూసిన వంశీ, పాపం చాలా బాధపడ్డాడు. "మీరేం బాధపడకండి, నేనున్నాను కదా!" అని ఓదార్చి, మరో మందు అదనంగా ఇచ్చాడు. "మళ్లీ సాయంత్రం వచ్చి చూస్తాను!" అన్నాడు.

అన్నట్లే సాయంత్రం వచ్చి చూసి, కాసేపు కబుర్లు చెప్పి వెళ్లాడు. మర్నాటికి రాధ జ్వరం, తలనొప్పి అన్నీ తగ్గిపోయాయి.

"పూర్తిగా తగ్గిపోయింది, డాక్టరుగారూ!" అంది రాధ ఆహ్లాదంగా.

రాధని పరీక్ష చేసి ప్రసాదుని బయటకు తీసుకువెళ్లాడు డాక్టరు. "చూడండీ, ఇప్పుడు తగ్గింది కదా అని సంతోషపడటానికి వీల్లేదు. తగ్గినట్లే తగ్గి, మళ్లీ తిరగబెట్టి ఏ టైఫాయిడ్‌లోకో, న్యుమోనియాలోకో దింపే ప్రమాదం ఉంది. ఓ పది రోజులపాటు అబ్జర్వేషన్‌లో ఉండాలి!" అన్నాడు గంభీరంగా.

ప్రసాద్ కంగారుపడిపోయాడు. "హాస్పిటల్లో చేరుద్దామా? మా అక్కయ్యని పిలిపించనా?" అన్నాడు గాబరాగా.



"అబ్బే... ఏమీ కంగారు లేదు. కాకపోతే కాస్త కనిపెట్టి ఉండాలి. నేను రోజూ వచ్చి చూసిపోతూ ఉంటాను!" ధైర్యం చెప్పాడు డాక్టరు.

"చాలా థాంక్స్! మీకు శ్రమ అయినా ప్రతి రోజూ రండి!" అన్నాడు ప్రసాద్ డాక్టర్ చేతులు పట్టుకుని.

"అయ్యో... ఎంతమాట! రెండుపూటలా వచ్చి చూస్తాను!" అన్నాడు డాక్టరు.

మాట ఇచ్చినట్లే రోజూ ఉదయం, సాయంత్రం వచ్చి పేషెంట్‌ని చూసి వెళ్ళటం మొదలు పెట్టాడు డాక్టరు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడేవరకూ బయటకు వెళ్లకూడదని డాక్టరు చెప్పడంతో సినిమా వ్యవహారం వాయిదా వేశాడు ప్రసాద్. ఓ వారం రోజులు గడిచిపోయాయి.

ఒకరోజు ఉదయం తాతగారింటికి వచ్చాడు డాక్టర్ గోపాలకృష్ణ. ఆయన్ని చూడగానే తాతగారి ప్రాణం లేచివచ్చింది. ఆయన వైద్యం అలవాటైన తాతగారికి కుర్రడాక్టరు వైద్యం అంతగా నచ్చడం లేదు.

"బొత్తిగా శీతకన్ను వేశారు మా మీద!" అని నిష్ఠూరం ఆడారు.

"ఏదో, హడావుడిలో పడి రాలేకపోయానండీ! మా అబ్బాయి వస్తూనే ఉన్నాడుగా?" అన్నాడు గోపాలకృష్ణ బ్లడ్ ప్రెషర్ చూస్తూ.

"పాపం, రోజూ వస్తూనే ఉన్నాడు. ముఖస్తుతి కాదు కానీండి, మీ అబ్బాయి చాకులాంటి కుర్రాడు. మా మనవరాల్ని కూడా ట్రీట్ చేస్తున్నాడు!" అన్నారు తాతగారు.

"మనవరాలికా? ఏమైంది?" అడిగాడు గోపాలకృష్ణ.

వివరాలన్నీ చెప్పారు తాతగారు. గంభీరంగా చూశాడు గోపాలకృష్ణ.

"అమ్మాయిని నేనోసారి చూస్తాను!" అన్నాడు.

"అంతకన్నానా! ఇక్కడికే పిలిపిస్తానుండండి!" అన్నారు తాతగారు.

రాధను పిలిపించారు, కన్నార్పకుండా రాధ వంక చూశాడు గోపాలకృష్ణ. "ఏం పేరు? ఏం చదువుకుంటున్నావు?" అని అడిగాడు. వినయంగా సమాధానం చెప్పింది రాధ. "లోపలికి వెళ్లమ్మా!" అన్నాడు.

"ఏం డాక్టరుగారూ? వ్యాధి ఏమిటంటారూ? ఏమీ ప్రమాదం లేదు కదా!" అడిగారు తాతగారు.

గంభీరంగా తల పంకించాడు గోపాలకృష్ణ. "ఇప్పుడే ఏమీ చెప్పలేను!" అంటూ లేచి వెళ్లిపోయాడు.

మధ్యాహ్నంలో భోజనాల దగ్గర కలుసుకున్నారు పెద్ద డాక్టరూ, కుర్ర డాక్టరూ. "వంశీ! నాకో సందేహం వచ్చిందిరా! నిన్నడిగి తెలుసుకోవాలి!" అన్నాడు పెద్ద డాక్టరు.

నవ్వేశాడు కుర్ర డాక్టరు. "పొండి, నాన్నగారూ! మీదంతా వేళాకోళం! మీకు సందేహం రావడం ఏమిటి, అది నేను తీర్చడం ఏమిటి?" అన్నాడు.

"కాదులేరా, ఈ సందేహం నువ్వే తీర్చాలి. కొద్దిపాటి జలుబు, తలనొప్పి, జ్వరంతో మొదలై తిరగబెట్టి టైఫాయిడ్‌లోకో న్యుమోనియాలోకో దింపే వ్యాధి ఏదో ఉందిట. దాని పేరేమిట్రా?" సూటిగా అడిగారు.

చేతిలో ముద్ద వదిలేసి బుర్ర వంచేసుకున్నాడు వంశీ.

"తలొంచుకుంటావేం? సమాధానం చెప్పు! ఆ వ్యాధికి మందేమీ అక్కర్లేదుట. డాక్టరు రెండు పూటలా వెళ్లి పేషెంటుని చూసి వస్తే చాలుట! ఏమిటా వ్యాధి?" రెట్టించాడు.

మెల్లగా తలెత్తాడు వంశీ. తండ్రి మొహంలోని ప్రసన్నతను కనిపెట్టి, సిగ్గుగా నవ్వాడు. "పొండి, నాన్నగారూ, మీరు మరీనూ!" అన్నాడు.

ఆయనా నవ్వేశాడు. "ఏమిటి మరి? వాళ్లతో మాట్లాడమంటావా?"

"ఏమో, అదంతా మీ ఇష్టం!" అంటూ కంచం ముందునుంచి లేచి పారిపోయాడు వంశీ.

చిన్నగా నవ్వుకుని భోజనం ముగించి ఫోను అందుకున్నాడు గోపాలకృష్ణ. తాతగారికి ఫోన్ చేశాడు. "అయ్యా, ఇదీ విషయం! వ్యాధి మీ మనవరాలికి కాదు, నా వంశోద్ధారకుడికి! దీనికి మందు పెళ్లి. ఇక మీ ఇష్టం!" అన్నాడు.

తాతగారు ఎంతో ఆనందపడిపోయారు. "మీ అంతటివారు ఇలా అడగటం మా అదృష్టం! మా రాధ అదృష్టవంతురాలు. ఇవాళే మా అమ్మాయితో ఈ విషయం చెప్తాను!" అన్నారు.

ఆ రాత్రి ఏదో పని మీద వెళ్లి బాగా పొద్దుబోయి ఇంటికి చేరాడు రంగారావు. వాకిట్లోనే ఎదురైంది రాజ్యలక్ష్మి.

"మీకో శుభవార్త, రాధకు మంచి సంబంధం కుదిర్చారు మా నాన్నగారు!" అంది మొహం చాటంత చేసుకుని.

ఆయన సంతోషించలేదు. పైగా, చిరచిరలాడాడు. "ఏమనుకుంటున్నారు మీ నాన్నగారు? ఏమిటాయన ఉద్దేశం? ఏదో సెలవులకి నాల్రోజులు నా కూతుర్ని



పంపిస్తే, దానికి పెళ్లిసంబంధం చూస్తారా? అంతా వాళ్లిష్టమేనా! ఆయన కూతురి పెళ్లీ ఆయన చేసి, నా కూతురు పెళ్లీ ఆయనే చేసి... ఏమిటిదంతా? పద, వెళ్లి తేల్చుకొచ్చేద్దాం!" అంటూ హుటాహుటిన ప్రయాణం కట్టాడు.

కారులో ఆయనకి నచ్చచెప్పింది రాజ్యలక్ష్మి. "గోపాలకృష్ణగారు చాలా మంచివారు. ఆవిడ కూడా చాలా మంచిది. వాళ్లకి బోలెడంత ఆస్తి ఉంది. అబ్బాయి బాగుంటాడు డాక్టరు. అయినా నాన్నగారేం ఖాయం చెయ్యలేదు కదా!" అంది.

"చూడు, ఊరికే పుట్టింటివాళ్లని వెనకేసుకురాకు! పెళ్లంటే మాటలా! ఎన్ని చూడాలి? ఆస్తి ఉంది సరే, మనకూ ఉంది బోలెడంత ఆస్తి. అందంగా ఉన్నాడు అబ్బాయి అంటావా... అందం కొరుక్కుతింటావా? అతను ఎటువంటివాడు? ప్రవర్తన ఎలా ఉంటుంది? ఇవన్నీ ఆలోచించాలా వద్దా! అవన్నీ చూసి అప్పుడు పెళ్లిదాకా రావాలి గానీ, ఊరికే కంగారు పడిపోతే ఎలా?" అని విసుక్కున్నాడు.

తెల్లవారి ఎనిమిదింటికి హైదరాబాదు చేరారు. ఇంటిముందు కారు ఆగగానే పరుగెత్తుకొచ్చాడు ప్రసాద్. "రండి, బావగారూ! రా, అక్కయ్యా! ప్రయాణం బాగా జరిగిందా?" అంటూ పలకరించాడు.

"ఏరా తమ్ముడూ! అందరూ బాగున్నారా?" అంటూ దిగింది రాజ్యలక్ష్మి.

రంగారావు మాత్రం కారు దిగలేదు.

"ప్రసాద్, ఇటు రా!" అంటూ బావమరిదినే కారులోకి ఆహ్వానించాడు.

"ఎక్కడికి బావగారూ?"

"అబ్బాయిని చూసొద్దాం!" చెప్పాడాయన.

ప్రసాద్ నవ్వేశాడు. "అలాగే వెళ్దాం. స్నానాలవీ చేసి, తీరిగ్గా వెళ్దాం. ఈలోగా వాళ్లకి ఫోన్ చేద్దాం. ముందు మీరు కారు దిగండి, చెప్తాను!" అన్నాడు.

"చాల్లే, మహా చెప్పొచ్చావ్! నా అనుభవం అంత లేదు నీ వయసు. ముందు కారెక్కు!" అని హూంకరించాడు రంగారావు. గత్యంతరం లేక కట్టుకున్న లుంగీతోనే కారెక్కాడు ప్రసాద్.

"మనం ముందుగా చెప్పి వెళ్తే వాళ్లు సిద్ధంగా ఉంటారు. అబ్బాయి గురించి తెలుసుకోవాలంటే ఇలా హఠాత్తుగానే వెళ్లాలి. అర్థం అయిందా?" మళ్ళీ హూంకరించాడాయన. తిన్నగా క్లినిక్‌కి వెళ్లారు. బయట అడిగితే వంశీ ఉన్నాడని తెలిసింది. లోపలకు వెళ్లారు.

అతని రూమ్‌లోకివెళ్లబోతున్న ప్రసాద్‌ని వారించి, కిటికీలోంచి తొంగి చూశాడు రంగారావు. అబ్బాయి అందంగానే ఉన్నాడనుకున్నాడు. అనంతరం అతనేం మాట్లాడుతున్నాడో వినసాగాడు.

వంశీ దగ్గరకు ఓ కేసు తీసుకొచ్చారు. అది విషప్రయోగం కేసు. "మీ కెంత ఫీజు కావాలన్నా ఇస్తాం!" అంటున్నారు వాళ్లు.

"ఎంతమాత్రం వీల్లేదు! నేనలాంటి చట్టవిరుద్ధమైన పని చచ్చినా చెయ్యను! అటువంటి అడ్డదిడ్డం పనులు చేయడం మా వంశంలోనే లేదు!" అన్నాడు వంశీ.

రంగారావుకి బోలెడంత సంతోషం వేసింది. "శభాష్. అల్లుడూ! వజ్రంలాంటి మాట చెప్పావు!" అన్నాడు కిటికీలోంచి.

అదిరిపడిపోయి చూశాడు వంశీ. కిటికీలోంచి కనిపించిందో కళ్లజోడు మొహం. 'ఖర్మ! లేచి ఎవరి మొహం చూశానో! ఇవాళ అన్నీ దిక్కుమాలిన కేసులే, ఈ కేసుని మెంటల్ హాస్పిటల్‌కి పంపించాలి' అనుకుంటూ లేచి వరండాలోకి వచ్చాడు.

ఎదురుగా కనిపించిన ప్రసాద్‌ని చూసి ఆగిపోయాడు. ప్రసాద్ వంశీ దగ్గరకు వచ్చాడు. "వంశీ! ఈయన మా బావగారు రంగారావుగారు. అంటే, మా రాధ తండ్రిగారు!" అంటూ పరిచయం చేశాడు.

రాధ తండ్రిగారు తనని అల్లుడూ అన్నారు. ఎగిరి గంతేసి అమాంతం ఆయన కాళ్లమీద పడిపోబోయాడు వంశీ. మధ్యలోనే ఆపేసి, "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు!" అని దీవించాడాయన. అనంతరం కాబోయే మామా అల్లుళ్లు కాసేపు లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుకున్నారు. కాఫీలు తాగి బయలుదేరారు బావామరుదులు.

"ఈ వేషాలతో ఏం వెళ్తాం, బావగారూ! నా మాట వినండి!" అని ప్రసాద్ వారిస్తున్నా, వినకుండా విజిట్స్‌కు వెళ్లిన గోపాలకృష్ణగారి కోసం వెతికి రెండిళ్లు తిరిగి మూడో ఇంట్లో ఆయన్ని పట్టుకుని, మీ అబ్బాయి నాకెంతో నచ్చాడు ఈ సంబంధం ఖాయం అని చెప్పి అప్పుడు ఇంటిమొహం పట్టాడు రంగారావు.

తండ్రిని చూడగానే పరుగున వచ్చేసింది రాధ. "ఏమ్మా, ఎలా ఉన్నావ్!" అంటూ కూతురిని పలకరించాడు రంగారావు.

"నాకేం నాన్నగారూ! లక్షణంగా ఉన్నాను. ఆ డాక్టరు ఊరికే కంగారు పెట్టేస్తున్నాడు. తిక్కమేళం ఎక్కడో! అయినా ఇంత మహానగరంలో ఈ తిక్కలమారి డాక్టరు తప్ప ఇంకెవరూ దొరకలేదా మామయ్యకి!" అంది రాధ.



"తప్పు, ఏమిటా మాటలు? కాబోయే మొగుడిని పట్టుకుని తిక్కమేళం, వెర్రిమేళం అనొచ్చా?" మందలించాడు మామయ్య ప్రసాద్.

తెల్లబోయింది రాధ. "కాబోయే మొగుడా? ఎవరు?" అయోమయంగా అడిగింది.

వెంటనే అందరూ వంతులేసుకుని విషయం చెప్పేశారు.

తాడెత్తున లేచింది రాధ. "నేను చచ్చినా పెళ్లి చేసుకోను!" అంది.

"ఏం అతనికేం తక్కువ? అందానికి అందం, చదువుకు చదువు! ఆస్తికి ఆస్తీ అన్నీ ఉన్నాయి!" అన్నాడు ప్రసాద్.

"అవన్నీ అలా ఉంచి, చట్టం అంటే బోలెడంత గౌరవం! చట్టాన్ని గౌరవించే వ్యక్తిని కట్టుకుంటే సుఖపడతావమ్మా!" అన్నాడు రంగారావు.

"అతను గొప్పవాడే కావచ్చు. కానీ నేను పెళ్లి చేసుకోను. అతన్నే కాదు, ఎవర్నీ చేసుకోను. నేను సినిమాల్లో చేరతాను!" అంది రాధ.

"సినిమాలూ లేవూ, చింతకాయలూ లేవూ! లక్షణంగా పెళ్లి చేసుకో! అసలైనా, ఈ మధ్య నీకు గారాబం ఎక్కువై మొండితనం ఎక్కువైంది!" అంటూ జీవితంలో తొలిసారి కూతుర్ని కోప్పడ్డాడు రంగారావు.

ఏడుస్తూ వెళ్లిపోయింది రాధ. ఇలా ఏడ్చి లాభంలేదు అనుకుని సీరియస్‌గా ఆలోచించింది. ఓ పని చేస్తే సరి. వంశీకృష్ణతో మాట్లాడి అతనితో చెప్పేస్తే సరి! పెళ్లి ఇష్టం లేని అమ్మాయిని తెలివితేటలున్న వాడెవడూ పెళ్లి చేసుకోడు. వెంటనే వంశీకి ఫోన్ చేసి "మీతో కొంచెం మాట్లాడాలి!" అని చెప్పింది. ఎగిరి గంతేసి అంగీకరించాడు వంశీ.

నిర్ణీత సమయానికి ఒక పార్కులో కలుసుకున్నారిద్దరూ. పలకరించు కోడాలూ అవీ అయ్యాక సూటిగా విషయంలోకి దిగిపోయింది రాధ.

"మనిద్దరికీ పెళ్లి అనుకుంటున్నారుట పెద్దవాళ్లు!"

"అవును. నా కెంత ఆనందంగా ఉందో మాటల్లో చెప్పలేను. ఆ వేళ మిమ్మల్ని చూడగానే, పెళ్లంటూ చేసుకుంటే మిమ్మల్నే చేసుకోవాలని అనుకున్నాను!" ఆనందంగా చెప్పుకుపోతున్న వంశీని వారించింది రాధ.

"నాకు ఈ పెళ్లి ఇష్టం లేదు!" ఖచ్చితంగా చెప్పేసింది.

వంశీ మొహం వాడిపోయింది. "ఎందుకు? నాకేం తక్కువ?" దీనంగా ప్రశ్నించాడు.

"మీకేమీ తక్కువ కాదు. నాకీ పెళ్లి ఇష్టం లేదు!"

"వేరే ఎవరినైనా ప్రేమించారా? పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారా? " అడిగాడు.

"అటువంటిది ఏమీ లేదు. నేనసలు పెళ్లి చేసుకోను!"

"ఎందుకని? కారణం ఏమిటి?"

"నేను సినిమాల్లో చేరి హీరోయిన్‌గా పేరు ప్రఖ్యాతులు గడించాలనుకుంటున్నాను!" గర్వంగా చెప్పింది.

నవ్వాపుకుని గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు వంశీ.

"కాబట్టి ఈ పెళ్లీ... జంఝాటం నాకిష్టంలేదు. ఇది చెప్పాలనే ఇక్కడికి రమ్మన్నాను. మీరు ఈ పెళ్లి మీకిష్టం లేదని మా నాన్నగారికి చెప్పండి!" ఆర్డరు వేసింది.

"ఇది మరీ బాగుంది. నాకీ పెళ్లి జరగాలని ఎంత ఉబలాటంగానో వుంటే వద్దని నేనెందుకు చెప్తాను? ఇష్టం లేకపోతే మీ నాన్నగారికి మీరే చెప్పుకోండి!" చిలిపిగా సమాధానం చెప్పాడు.

"నేను చెప్తే మా నాన్నగారు వినడంలేదు కాబట్టి మీరే చెప్పండి!"

"నేనలా చెప్పను. అయినా అబద్ధాలు ఆడటం నాకిష్టంలేదు!"

రాధకి చిర్రెత్తుకొచ్చింది. "ఇదెక్కడి గొడవండీ! నాకు పెళ్లి ఇష్టం లేదు మొర్రో అంటే వినిపించుకోరేం?"

"ఇది మరీ బాగుంది. నాకు ఈ పెళ్లి అంటే చచ్చేంత ఇష్టం మొర్రో అంటే వినిపించుకుంటున్నారా మీరు?"

తల పట్టుకుని కూర్చుంది రాధ. "నా మాట వినండి. పెళ్లంటే ఇష్టం లేని అమ్మాయిని కట్టుకుని మీరేం సుఖపడతారు? మీరు కావాలంటే నా లాంటి అమ్మాయిలు చాలామంది దొరుకుతారు. మంచి అమ్మాయిని ఎంచుకుని పెళ్లి చేసుకుని సుఖంగా ఉండండి!" బతిమాలింది.

"మా మంచి సలహానే చెప్పారు. పాతికేళ్లు దాటాయి. ఇంకెప్పుడు పెళ్లి చేసుకుంటావురా వెర్రి సన్నాసీ అని మా అమ్మ ఏడాదిగా పోరుతున్నా, నా కెవరూ నచ్చక కాలయాపన చేశాను. ఇప్పుడు మీరు నాకు నచ్చారు. అంతేకాదు, మా నాన్నగారికీ నచ్చారు. మీ నాన్నగారికి నేను నచ్చాను. ఇంతా జరిగి పెళ్లి సెటిల్ అయ్యాక, ఇది కాదని మరో అమ్మాయిని వెతుక్కోవడం అంటే రెడ్డొచ్చె మొదలాడె



అన్నట్లు అవుతుంది నా పెళ్లి వ్యవహారం! ఇదంతా నా వల్ల కాదు. నేను మిమ్మల్నే పెళ్లి చేసుకుంటాను!"

ఉక్రోషంతో మొహం ఎర్రబడిపోయి చురచుర చూసింది రాధ.

"ఒక పని చేద్దాం! మీ ఆశయం సినిమాల్లో నటించాలని. నా ఆశయం మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలని, ఉభయతారకంగా ఉపాయం ఆలోచిద్దాం. మనిద్దరం పెళ్లి చేసుకుందాం. నా దగ్గర బోలెడంత డబ్బుంది. మనమే సినిమాలు తీద్దాం. మీతో చెప్పుకోలేదు కానీ, చిన్నతనంలో సినిమా హీరో అయిపోవాలని మా చెడ్డకోరిగా ఉండేది నాకు. ఈ చదువూ, ప్రాక్టీసూ జంఝాటంలో పడిపోయి ఆ విషయం అశ్రద్ధ చేశాను. ఇప్పుడు అవకాశం కలిసొచ్చింది. మనిద్దరం కలిసి హీరో హీరోయిన్లుగా నటిద్దాం. ఆ పిక్చర్ హిట్ అయిందో, ఇక నక్కని తొక్కినట్లే! ఈ ప్రాక్టీసూ గట్రా మానేసి ఆ ఫీల్డులో సెటిల్ అయిపోదాం. అలా అయితే ఇద్దరి ఆశయాలూ నెరవేరుతాయి. ఏమంటారు?" అన్నాడు.

ఆలోచించింది రాధ. ఇదేదో బాగానే ఉందనిపించింది. "సరే, ఆ షరతు మీద పెళ్లికి ఒప్పుకుంటున్నాను!" అంది.

"తప్పకుండా! ఇదిగో, ప్రామిస్!" మాట ఇచ్చాడు వంశీ.

అతి వైభవంగా వాళ్ల పెళ్లి జరిగిపోయింది. హనీమూన్ నుండి రాగానే సినిమా సంగతి గుర్తుచేసింది రాధ.

"ఓం, నేను రెడీ! మంచి కథ తీసుకురా!" అన్నాడు వంశీ.

అమితోత్సాహంతో నవలలూ అవీ చదివి వారం తిరిగేసరికి మంచి కథొకటి తీసుకొచ్చింది. వెంటనే చదివేశాడు వంశీ.

"ఇదేం కథ? చెత్త కథ! ఇందులో మొదట్నుంచి చివరిదాకా హీరో, హీరోయినూ కష్టాలలో మునిగి తేలుతున్నారు. ఒకటే ఏడుపులూ, మొత్తుకోళ్లూ! శుభమా అని నటించే మొదటి సినిమాలో ఇలా ఏడ్చి అఘోరించమంటే నా వల్ల కాదు! మరో మంచి కథ తీసుకురా!" అన్నాడు.

అలాగే అని మళ్లీ వెతికి మరొక కథ తీసుకొచ్చింది. చదివాడు వంశీ.

"కథ బాగానే ఉంది, కానీ మొదలెట్టిన కాసేపటికి హీరో పరిస్థితుల వల్ల ఇంకో అమ్మాయిని పెళ్లిచేసుకుని రింగురంగా అని రొమాన్స్ చేస్తున్నాడు. అవునా! నువ్వు ఒక హీరోయిన్‌వి సరే! రెండో హీరోయిన్‌గా ఎవరినో పెట్టాలి కదా!

పిటపిటలాడిపోతున్న పిల్లతో డ్యూయెట్లూ అవీ పాడాలి. నేనసలే రొమాంటిక్ ఫెలోని. తీరా ఆ రెండో హీరోయిన్ పిల్లతో నేనుగానీ అదైపోతే ఆ తర్వాత నువ్వూరికే ఇదైపోకూడదు మరి! అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు!" అన్నాడు సిన్సియర్‌గా.

ఆ పుస్తకం తీసేసి అవతల పారేసింది రాధ. ఏ విధమైన కష్టాలూ, కలహాలూ లేకుండా సినిమా ఆద్యంతమూ నాయకీ నాయకులు కలిసి ఉండే కథ కోసం వెతకసాగింది రాధ. కథ దొరకలేదు కానీ, రాధకి తలనొప్పులూ, వాంతులూ మొదలయ్యాయి. దాంతో సినిమా వ్యవహారం మూలపడింది.

ఓ ఏడాది గిర్రున తిరిగొచ్చింది. మళ్లీ సినిమా టాపిక్ తీసుకొచ్చింది రాధ.

"నేనూ ఆ విషయమే ఆలోచిస్తున్నాను. కానీ, వీడు మరీ పసివాడు, పసివెధవని వదిలేసి మనిద్దరం ఝామ్మని ఔట్‌డోర్ షూటింగులకి పోవడం న్యాయమేనా? వెంట తీసుకెళ్లాలంటే వీడినీ, వీడితోపాటు పాల సీసాలు, పక్కబట్టలూ తీసుకెళ్లి అక్కడ మనమేం యాక్ట్ చేస్తాం? కాస్త ఓ సంవత్సరం ఓపిక పట్టావంటే వీడు కొంచెం పెద్దవాడవుతాడు. అప్పుడే ఇబ్బంది ఉండదు!"

పిల్లాడికి రెండో ఏడు వచ్చింది. "మనిద్దరం ఎలాగూ నటిస్తాం. పనిలో పని. వీడికీ ఒక పాత్ర ఇస్తే బాలనటుడిగా పేరు తెచ్చుకుంటాడు! అలాంటి కథ వెతుకు!" అన్నాడు.

వెతికి పట్టుకొచ్చింది రాధ. ఆ కథలో పిల్లాడిని కిడ్నాప్ చేస్తారు. డబ్బివ్వమని దుండగులూ, ఇవ్వనని తండ్రి పట్టుపడతారు. మధ్యలో పిల్లాడు నానా కష్టాలు పడతాడు. ఆ కథ చదివి తయ్‌మని లేచాడు వంశీ.

"ఏమిటీ కథ? మండినట్లే ఉంది! అభం శుభం ఎరుగని పసివాడినలా హింసలు పెట్టడానికి మనసెలా వస్తుంది? పసివాళ్లు పువ్వుల్లా ఆడుకుంటూ హాయిగా నవ్వుతుంటే ఆనందం గానీ, అమ్మా, నాన్నా అని శోకాలు పెట్టి ఏడుస్తుంటే కడుపు తరుక్కుపోదూ! ముందే చెప్తున్నాను, సినిమాలో అయినా సరే, నేను కష్టాలు పడను! నా భార్యా బిడ్డల్ని కష్టపడనివ్వను. అలాంటి కథ వెతికి పట్రా!" అన్నాడు.

పట్టు వదలని విక్రమార్కుడిలా భార్యా, భర్తా, పిల్లాడు కలిసి ఆనందంగా ఉండే కథ కోసం గాలించసాగింది రాధ. కథ దొరకలేదు కానీ, రాధకీ మళ్లీ తలతిప్పుడూ, వాంతులూ... ఆ తర్వాత రాధకీ ఉత్సాహం చచ్చిపోయింది.



ఎప్పుడైనా గుర్తు వస్తే మాత్రం "నన్ను నిలువునా ముంచేశావు! నమ్మించి మోసం చేశావ్!" అని మొగుడిమీద విరుచుకుపడుతుంది.

"ఇది మరీ బాగుంది! ఎప్పటికప్పుడు ఏదో ఆటంకం వచ్చి ఆగిపోయింది కానీ, కాదని నేనేనాడైనా అన్నానా! ఇప్పుడు మాత్రం మించిపోయిందేముందీ, ఈ పుత్రులిద్దరూ పెద్దవాళ్లయి బాధ్యతలు తీరగానే సినిమా తీద్దాం. బడిపంతులు సినిమాలో అంజలీదేవీ, ఎన్.టి.ఆర్.లాగా సీతారామయ్యగారి మనవరాలు సినిమాలో రోహిణి హత్తంగడీ, ఏ.ఎన్.ఆర్.లాగా నటిద్దాం!" అంటాడు వంశీ.

ఉక్రోషంతో తల బాదుకుంటుంది రాధ.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 30 ఆగస్టు 1999*

# పెళ్లిచూపులు

ఉదయం పదకొండు గంటలు అయింది. బ్యాంక్ అంతా సందడిగా ఉంది. స్టాఫ్ అంతా పనిచేసుకుంటున్నారు. ఫోను మోగింది. అటుగా వెళ్తున్న అటెండరు ఫోన్ తీశాడు. "హల్లో ఇది ఫలానా బ్యాంక్ బ్రాంచేనా?" అని అడిగింది ఓ పురుష కంఠం.

"అవునండీ" అన్నాడు అటెండరు.

"అక్కడ పప్పు పద్మావతిగారు పనిచేస్తున్నారా?"

"పద్మావతిగారు ఉన్నారు మరి ఆవిడ ఇంటి పేరు ఏమిటో తెలియదు" చెప్పాడు అటెండరు.

"ఒక్కసారి కనుక్కువస్తారా ప్లీజ్!" బతిమాలాడు అవతలివ్యక్తి.

"లైన్లో ఉండండి" అంటూ వెళ్ళాడు అటెండరు.

కంప్యూటర్ ముందు కూర్చుని ఏదో ఎఫ్.డి. వివరాల కోసం కుస్తీ పడుతోంది పద్మావతి. కంప్యూటర్‌లో కాస్త ప్రాబ్లం వచ్చింది. పక్క సీటు శంకర్ వచ్చి సహాయం చేస్తున్నాడు. అటెండరు వచ్చాడు.

"అమ్మా మీ ఇంటి పేరు పప్పు వారేనా?" అని అడిగాడు.

చిర్రెత్తుకొచ్చింది పద్మావతికి. పొద్దుటినించీ కంప్యూటర్ ఏడిపిస్తోంది. విసిగిపోయింది పద్మావతి. "ఇప్పుడు అర్జెంటుగా నా ఇంటి పేరెందుకు నీకు? పెళ్ళి సంబంధం వెదుకుతావా?" విసుక్కుంది.

"కాదమ్మా మీకోసం ఫోన్ వచ్చింది. పప్పు పద్మావతి గారున్నారా? అని అడుగుతున్నారు. మీ ఇంటి పేరు నాకు తెలియదు కదా! అందుకే అడిగాను" అన్నాడు అటెండరు.

"ఫోన్ చేశారా? ఎవరు?" అడిగింది పద్మావతి.

"ఏమో? లైన్లో ఉన్నారు" చెప్పాడు.

"వెళ్లి చూసి రండి" అన్నాడు శంకర్.



ఫోన్ దగ్గరికి వెళ్ళింది పద్మ.

"హలో" అంది.

"మీరు పప్పు పద్మావతిగారేనా అండీ" అడిగిందా కంఠం.

"అవునండీ! మీరెవరూ?" అడిగింది.

"మీరు విజయనగరంలో ఉండే పప్పు సుబ్బారావుగారి అమ్మాయేనా అండీ!" మరో ప్రశ్న.

"అవునండీ! ఇంతకీ మీరెవరో చెప్పండి. అవతల బోలెడు పనుంది!" అంది విసుగ్గా.

"ఓసారీ అండీ మీరు బిజీగా ఉన్నానని అంటున్నారు కదా! లంచ్ తరవాత ఫోన్ చేస్తాను. బైదిబై నా పేరు కల్యాణ చక్రవర్తి. మా నాన్నగారి పేరు గోపాల్రావుగారు. నేను గోపాల్రావుగారి అబ్బాయిని. సర్లెండి. మళ్లీ ఫోన్ చేస్తాను" అయోమయంగా చూసి వెళ్ళిపోయింది పద్మ. ఆ తరవాత ఆ ఫోన్ సంగతే మర్చిపోయింది.

రెండు గంటలకి లంచ్ బాక్స్ ఓపెన్ చేసింది. అందరూ కబుర్లు చెప్పుకుంటూ లంచ్ తింటున్నారు. అటెండరు వచ్చి "అమ్మా మీకు ఫోన్" అని చెప్పాడు. ఆ బాక్స్ అలా పట్టుకుని ఫోన్ దగ్గరికి వెళ్ళింది.

"హలో" అంది.

"హల్లో పప్పు పద్మావతిగారేనా?"

"అవునండీ! మీరు కల్యాణచక్రవర్తిగారా?"

"అవునండీ మరో విషయం. మీకింకా పెళ్ళి కాలేదు కదండీ!" అడిగాడు.

"ఎవరండీ మీరు? ఈ వివరాలన్నీ మీకెందుకు? అసలు మీకేం కావాలి?" విసుక్కుంది.

"మీరలా విసుగ్గా మాట్లాడారంటే మీ తప్పేం లేదులెండి. మీ పొజిషన్‌లో ఎవరున్నా అలాగే మాట్లాడతారు. ఇలా ఎందుకడిగానంటే పొద్దున్న ఒకావిడకి ఫోన్ చేశాను. ఆవిడ పేరు కూడా పి. పద్మావతిగారే. కాసేపు మాట్లాడాక తెలిసింది ఆవిడకి పెళ్ళి అయిందని. ఆవిడ కూడా ఇప్పుడు మీలాగే విసుక్కున్నారు. అందుకే ముందు జాగ్రత్తగా అడిగాను. ఏమనుకోకండి!" బతిమాలాడు.

కాస్త శాంతించింది పద్మ. "సర్లేండి. ఇంతకీ మీరిలా పి. పద్మావతిని వెతికి పట్టుకోవాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారు?"

"చెప్తాను. మరో ప్రశ్నకి సమాధానం చెప్పండి. మీరు సుబ్బారావుగారి అమ్మాయే కదూ. మీది విజయనగరమే కదండీ?"

"అవునండీ! ఏమిటో మీ ప్రశ్నల వర్షం? మీరు పోలీసు డిపార్టుమెంటులో పనిచేస్తున్నారా?" మళ్ళీ విసుక్కుంది.

"కాదండీ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తిని. మా నాన్నగారి పేరు వేణుగోపాలరావు గారు. మాది శ్రీకాకుళం. మా నాన్నగారు నా పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. నాకింకా పెళ్లికాలేదు. మీ సంబంధం కూడా వచ్చిందిట మావాళ్ళ దగ్గరికి. మా వాళ్ళకి నచ్చింది. నీకూ నచ్చితే పెళ్లిచూపులు ఏర్పాటు చేస్తాం" అన్నారు.

వింటున్న పద్మావతి కాస్త తడబడింది. పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని తెలుసు. అందులో ఒక సంబంధం అన్నింటిలోకీ బాగుందనీ అబ్బాయి డాక్టరనీ అమ్మ చెప్పింది. అతనే ఇతనా? అయినా నాన్నగారు ఫోన్ చెయ్యాలి కానీ అతను డైరెక్టుగా కాంటాక్ట్ చెయ్యడం ఏమిటి?

"హల్లో హల్లో పద్మావతిగారూ! పప్పు పద్మావతిగారూ!" అవతలినించి వినిపించడంతో ఇహలోకంలోకి వచ్చింది పద్మావతి.

"ఆ! ఏమిటి చెప్పండి!" అంది.

"హమ్మయ్యా! ఉన్నారా? ఉలుకూ పలుకూ లేకపోతే లైన్ కట్ అయిందేమో అనుకున్నాను"

"లేదు లెండి చెప్పండి"

"విషయం ఏమిటంటేనండీ! మా నాన్నగారు ఫోన్ చేశారు. ఈ వారంలో పెళ్ళిచూపులకి రమ్మన్నారు. నాకేమో చాలా పనుంది. తరువాత వస్తానన్నాను. వారం రోజుల తరువాత శూన్యమాసం వస్తుందిట పనికిరాదుట. వెంటనే రమ్మని కంగారు పెడుతున్నారు. అప్పుడు నాకు మంచి ఐడియా వచ్చింది. పెళ్ళికూతురు ఇక్కడే ఉంది. నేనూ శ్రీకాకుళం వచ్చి... ఆవిడ విజయనగరం వచ్చి... నేను శ్రీకాకుళంనించి విజయనగరం వచ్చి... ఎందుకిదంతా? మేమిద్దరం ఇక్కడే ఓసారి కలుసుకుని మాట్లాడుకుంటే ఉభయతారకంగా ఉంటుందనిపించింది. మా నాన్నగారితో, ఆ మాట చెప్తే సర్లే, నేనూ వాళ్ల నాన్నగారితో మాట్లాడతాను' అన్నారు. మళ్లీ ఫోన్ చేసి మీ నెంబరు ఇచ్చారు. అందుకే ఫోన్ చేశాను" అన్నాడు.

అయోమయంగా అనిపించింది పద్మావతికి. "మనిద్దరం ఇక్కడ మీటై మాట్లాడుకుందామా?"



"అవునండీ మిమ్మల్ని మా వాళ్ళు ఎక్కడో చూశారుట. నన్ను మీ బావగారు చూశారట. పెళ్లిచూపులు ఏర్పాటు చేసినా ఎలాగూ మనిద్దరం విడిగానే కూర్చుని మాట్లాడుకుంటాం కదా! ఈ భాగ్యానికి ఎందుకింత హడావిడి? మీరూ ఓసారి ఆలోచించి చూడండి. నేను మళ్ళీ ఫోన్ చేస్తాను. లేదంటే మీరే చెయ్యండి. నా ఫోన్ నంబరు నోట్ చేసుకోండి" అంటూ ఫోన్ నంబరు చెప్పాడు.

ఫోన్ పెట్టేసి వచ్చి కూర్చుంది పద్మ.

"ఎవరూ" అడిగింది కొలీగ్ విశాల. "ఎవరో ఫ్రెండ్ ఫోన్" చెప్పింది పద్మావతి. ఫోన్ సంభాషణ అంతా నెమరు వేసుకుంది. ఆ తరువాత అతని రీజనింగ్ బాగానే ఉన్నట్లు అనిపించింది. 'సరేలే చూద్దాం' అనుకుంది. ఆ రాత్రి తండ్రి ఫోన్ చేశాడు.

"మంచి కుటుంబం. ఇద్దరు కొడుకులు. ఇతను రెండోవాడు. పెద్దతను ఇంజనీరు. పెద్ద కోడలు కూడా డాక్టరే. అంతా బావుంది. ఈ సంబంధం కుదిరితే బాగుంటుందని మేము అందరం అనుకుంటున్నాం. అబ్బాయి ఫోన్ చేశాడన్నావుగా మరి నీ ఇష్టం. అక్కడ మీరిద్దరూ కలుసుకుని మాట్లాడుకున్నా మాకేమీ అభ్యంతరం లేదు. లేదూ ఈ శూన్యమాసం వెళ్ళేదాకా ఆగమన్నా ఫర్వాలేదు. నువ్వు ఆలోచించుకో. ఏ విషయం నాకు ఫోన్ చేసి చెప్పు" అన్నారు.

కాసేపు సీరియస్‌గా ఆలోచించింది. పద్మ ఇక్కడే మాట్లాడుకుంటే బాగుంటుందేమో అనిపించింది. మళ్లీ ఊరికి వెళ్ళాలంటే లీవ్ ప్రాబ్లమ్. పెళ్ళి సెటిల్ అయితే చాలా లీవ్ కావాలి. అందుకే అతనికి ఫోన్ చేసి చెప్పాలనుకుంది. బ్యాంక్‌కి వెళ్ళాకా ఆ నెంబర్‌కి ఫోన్ చేసింది. నో రిప్లయ్

లంచ్ టైంలో అతనే ఫోన్ చేశాడు.

"నమస్కారం పద్మావతిగారూ!" అన్నాడు.

"నమస్కారం కల్యాణ చక్రవర్తి గారూ!" సమాధానం చెప్పింది.

చిన్నగా నవ్వాడు. "మీ నాన్నగారితో మాట్లాడారా?" అడిగాడు.

"మాట్లాడానండీ! నిర్ణయం నాకే వదిలేశారు. నేనూ మీరు చెప్పిన పద్ధతే ఉభయతారకంగా ఉంటుందని ఆలోచిస్తున్నాను" చెప్పింది.

"వెరీగుడ్. అయితే మనం ఎక్కడైనా కలుసుకుని మాట్లాడుకుందాం!" అన్నాడు.

"అలాగే"

" ఎక్కడ మీట్ అవుదాం? మీ ఫ్రెండ్స్ ఎవరైనా ఉన్నారా? వాళ్ళింట్లో కలుసుకోవచ్చు" సూచించాడు.

"వద్దండీ అంత క్లోజ్ ఫ్రెండ్స్ నాకెవరూ లేరు".

"నాకూ డిటో. ఓ పనిచేద్దాం. ఇందిరాపార్క్‌లో కలుసుకుందామా?" అన్నాడు.

"అక్కడా?"

"అవునండీ. ఈ లుంబినీ పార్కు, నెక్లెస్ రోడ్డు వచ్చాక ఇందిరాపార్క్ కాస్త ప్రశాంతంగానే ఉంటోంది. ఈ ఆదివారం సాయంత్రం ఆరున్నరకి మీకు ఓకేనా?"

"ఓకే కానీ ఓ సందేహం... మిమ్మల్ని నేనెలా గుర్తుపట్టడం?" అంది పద్మ.

"నిజమే కదూ నేనూ తెల్లగా పొడుగ్గా ఉంటాను. నాది నొక్కులజుట్టు" చెప్పాడు.

"ఏమిటండీ ఈ వివరాలు! ఇలా చెప్తే ఎలా గుర్తుపడతాను?" అంది పద్మ.

"నేను నల్ల ప్యాంటు, లైట్ క్రీమ్ కలరు వివాల్డీ రెడీమేడ్ షర్టు వేసుకొస్తాను సరేనా!"

"శ్రీరామచంద్రా రెడీమెడ్ షర్టుని పోల్చుకోవడం ఎలా? లేబుల్ మెడదగ్గర కదా ఉంటుంది. కనిపెట్టడం కష్టం కదూ!"

"నిజమేనండీ నాకా ఆలోచనే తట్టలేదు. ఇలా లాభం లేదు కానీ ఓ పని చేద్దాం. ఇవ్వాళ నాకు అర్జెంట్ పని ఉంది. బయటికి వెళ్తున్నాను నా ఫోటో మీకు పంపిస్తాను. రేపు సాయంత్రం వస్తాను. ఎల్లుండి మనిద్దరం కలుసుకుందాం! సరేనా" అన్నాడు.

"సరే ఆ పని చెయ్యండి. మరి మీరు నన్నెలా గుర్తుపడతారు? నా ఫోటో పంపించనా?" అంది.

"ఎందుకండీ? మీరు నన్ను గుర్తు పడతారు కదా! నా దగ్గరకొచ్చి పరిచయం చేసుకోండి" అన్నాడు చక్రవర్తి.

"సరే అలాగే!" అంది పద్మ.

తనకి తెలియకుండానే అతని ఫోటో కోసం ఎదురుచూసింది. మధ్యాహ్నానికి మనిషి వచ్చి అతని ఫోటో ఇచ్చాడు. నిజంగా బావున్నాడు.

ఊరినించి రాగానే మళ్ళీ ఫోన్ చేశారు.

"ఆరున్నరకి పది నిముషాలు ముందే వస్తాను. గేటు దగ్గరే వెయిట్ చేస్తాను" అని చెప్పాడు.

"ఆదివారం రానే వచ్చింది! అనుకున్న సమయానికి బయలుదేరింది పద్మ. చక్కగా తయారై ఆటో ఎక్కింది. గమ్యం చేరింది. ఆటో దిగేముందే హ్యాండ్‌బాగ్‌లోని అద్దం తీసి, ఓసారి రేగిన జుట్టు సవరించుకుంది. ఆటోకి డబ్బులిచ్చి పంపించింది.



ఎందుకో నెర్వస్‌గా అనిపించింది అంతలోనే సర్దుకుని లోపలికి వెళ్లింది. చుట్టూరా చూసింది. ఆ శాల్తీ ఎక్కడా కనిపించలేదు. గేటువంక చూస్తూ నిలబడింది. అయిదు నిముషాలు గడిచిపోయాయి. చిరాగ్గా అనిపించింది. 'ఇదేమిటి? చెప్పిన ప్రకారం పది నిముషాలు ముందు రాకపోయినా టైముకైనా రావడం మర్యాద'. చూస్తుండగానే మరో అయిదు నిముషాలు గడిచిపోయాయి.

ఇంకో అయిదు నిముషాలు చూసి వెళ్ళిపోదాం అనుకుంటుండగా దూరంగా కనిపించాడు సదరు శాల్తీ. పార్కులోంచీ ఇంచుమించు పరిగెత్తుకు వస్తున్నాడు. ఇన్‌షర్టు చేసుకున్నాడు. అది చెదిరిపోయి, సగం బయటికి వచ్చేసింది. జుట్టు చెదిరిపోయింది మొహంనిండా చెమటలు. ఓ చేత్తో రెండేళ్ళ పిల్లాడిని ఎత్తుకున్నాడు. రెండో చేతిలో ఓ బ్యాగు ఉంది!

గేటు దగ్గరికి రాగానే ఆత్రంగా అటూ ఇటూ చూశాడు. పద్మమీద నిలిచిపోయాయి అతని చూపులు. చిన్నగా నవ్వింది పద్మ. వెంటనే దగ్గరికి వచ్చాడు.

"మీరు పద్మావతిగారేనా?" అడిగాడు.

"అవునండీ" అంది పద్మ.

"సారీ అండీ వెరీసారీ! రావడం అరగంట ముందే వచ్చాను. ఇదుగో వీడితో సరిపోయింది" అతను చెప్తుండగానే ఆ పిల్లాడు జారిపోయి పరిగెత్తాడు.

"ఒరే గుండూ ఆగరా" అంటూ చేతిలోని బ్యాగ్ పద్మకిచ్చి వాడి వెనక పరిగెట్టాడు.

అయోమయంగా చేతిలోని బ్యాగ్‌లో ఏమున్నాయో చూసింది పద్మ. పాలసీసా, మంచినీళ్ళ సీసా, బిస్కట్లు, చాక్‌లెట్లు, చిన్న టవలు. ఓ జత బట్టలు, కాసిని బొమ్మలు, ఓ చిన్న దుప్పటి ఉన్నాయి.

'ఈ పెళ్లికొడుకు ఏమిటి? ఈ పిల్లాడేమిటో బొత్తిగా అంతుపట్టలేదు. ఛ! ఎరక్కపోయి వచ్చాను' అని విసుక్కుంది పద్మ.

అంతలో పిల్లాడిని ఎత్తుకుని వస్తున్నాడు కల్యాణ్. "సారీ అండీ అలా వెళ్ళి కూర్చుందాం రండి" అంటూ ఆ బ్యాగ్ అందుకున్నాడు.

"మీ వ్యవహారం నాకు నచ్చలేదు. నేను వెళ్తాను" అని చెప్పాలని నోటిదాకా వచ్చింది కానీ ఓ పది నిముషాలు మాట్లాడి వెళదాం అని అతని వెంట వెళ్లింది.

ఓ చెట్టుకింద కూర్చున్నారు.

"ఈ బాబు ఎవరు?" అడిగింది పద్మ.

"నా మొగుడు" విసుగ్గా చెప్పాడు కల్యాణ్.

ఆ బుజ్జిగాడు కల్యాణ్ ఒళ్ళోంచి దిగాడు. 'బూబు' అన్నాడు బాబు.

"ఓ అలాగే" అంటూ బ్యాగ్ తీసి అందులోంచి మంచినీళ్ళ బాటిల్ తీసి వాడికిచ్చాడు. వాడు విసిరికొట్టాడు.

"ఓ బూబూ అంటే పాలు. గాగా అంటే నీళ్ళు కదూ. మీ అమ్మ చెప్పింది నేనే మర్చిపోయాను" అంటూ ఆ సీసా లోపల పెట్టి పాలసీసా తీసి అందించాడు.

వాడు కల్యాణ్ ఒళ్ళో పడుకుని దర్పంగా కాలుమీద కాలువేసుకొని పాలు తాగసాగాడు. "ఎవరండీ ఈ బాబు" ఓర్పు పూర్తిగా నశించింది పద్మకి.

కళ్యాణ్ కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. "ఏం చెప్పనండీ! అంతా నా కర్మ" అంటూ జేబులోంచి రుమాలు తీసి కళ్ళు వత్తుకుని చెమటలు తుడుచుకున్నాడు రేగిపోయిన జుట్టు చేత్తో సర్దుకున్నాడు..

"చెప్పాలంటే అదో పెద్ద గాథ. వీళ్ళ అమ్మ నా క్లాస్‌మేట్, కమ్ ప్రాణ స్నేహితురాలు" ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్ళిపోయాడు కల్యాణ్.

"వీళ్ళ అమ్మ పేరు రాధ. మేమిద్దరం తొందరగానే మంచి స్నేహితులం అయిపోయాం. థర్డ్ ఇయర్ యాన్యువల్‌డే ఫంక్షన్‌కి 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకం వేశాం రాధ శకుంతల, నేను దుష్యంతుడిని"

వింటున్న పద్మకి ఒళ్లు మండుకొస్తోంది. అదేమీ పట్టించుకోనట్లు చెప్పుకు పోసాగాడు కళ్యాణ్.

"అనుకోకుండా ఆ ఫంక్షన్ టైమ్‌కి వచ్చాడు మా అన్నయ్య శ్రీకాంత్. వాడు కొత్తగూడెంలో ఉద్యోగంలో చేరాడు కొత్తగా. ఫంక్షన్ చూశాడు. వెళ్లాడు. మరుసటివారం వచ్చాడు. నిన్ను చూడకుండా వుండలేకపోతున్నానురా" అన్నాడు.

"ఆహా! మా అన్నయ్యకి నేనంటే ఎంత ప్రేమ" అని ఆనందపడ్డాను.

అది మొదలు ఉగ్రాళ్ళ తద్దెకీ, రథసప్తమికీ, హయగ్రీవ జయంతికీ. భావన్నారాయణస్వామి రథోత్సవం అనీ వంకపెట్టి తెలుగు క్యాలెండరులో ప్రతి పర్వదినానికీ నా దగ్గరికి రావడం మొదలు పెట్టాడు.

"పోనీ, నాకు పంపకపోతే పోయే, వాడి సంపాదనలో సరిపుచ్చుకోవాలా? డబ్బులు కావాలి నాన్నగారూ అని నాకు రాస్తాడు? చదువుకునే నీకూ పంపి, సంపాదించుకునే వాడికీ పంపి నేనెక్కడ తంటాలు పడనురా. అసలాయన జీతం అంతా ఏం చేస్తున్నాడో నిలదీసి అడుగు" అని నాన్నగారు గోల పెట్టారు.



వాడి వ్యవహారం నాకు అయోమయంగా అనిపించింది. "ఏమిట్రా నీ గొడవ. నీ రెక్కల కష్టంతో ఆర్టీసీ వాళ్ళని ఎందుకిలా ఉద్ధరిస్తున్నావు" అని అడిగాను.

"నీ మీద బెంగగా ఉంది. చూసిపోవాలని వస్తున్నాను" అన్నాడు.

"ఇంత తరచుగా వచ్చి చూసి పోవడానికి నేనేం చావుబతుకుల్లో లేను కదా! నిజం చెప్పు" అని నిలదీస్తే కాసేపు నీళ్ళు నమిలి నిజం చెప్పాడు. రాధను ప్రేమిస్తున్నాడుట. నేను రాయబారం జరపాలిట.

ఆ మాట చెప్తే హైహీల్ చెప్పు తీసుకుని అరకిలోమీటరు తరిమింది రాధ. "ఇప్పుడసలు నాకు పెళ్ళొద్దు. నేను ఇక్కడ చదువు కంప్లీట్ చేసి, ఫారిన్ వెళ్లాలనుకుంటున్నానని తెలిసీ రాయబారం నడుపుతావా" అని తిట్టి పోసింది.

ఆ మాటే వాడితో చెప్పాను.

"అయితే డాక్టరువి కదా! తేలిగ్గా ప్రాణంపోయే మందేమైనా ఇచ్చి నన్ను కాపాడు..." అన్నాడు అన్నయ్య. చూస్తూ చూస్తూ ఒక్క గానొక్క అన్నయ్యని ఎలా చంపుకుంటాను? అందుకే మళ్ళీ రాధనే బతిమాలాను.

కాస్త మెత్తబడింది. "మరి నేను డాక్టరుని పెళ్ళి చేసుకుందాం అనుకున్నాను మీ అన్నయ్య ఇంజనీరు కదా!" అంది.

"ఓస్ అంతేనా! నేను మళ్ళీ ఎమ్‌సెట్ రాసి మెడిసిన్ చదువుతా అన్నాడు అన్నయ్య.

"వద్దులే వయసుమించి పోతుంది" అంది రాధ.

"మేము ఫైనల్ ఇయర్లో ఉండగా వాళ్ళ పెళ్ళి అయింది. ఆ తరువాత ఆవిడికీ కొత్తగూడెంలోనే ఉద్యోగం దొరికింది. వాళ్ళు అన్యోన్యంగానే ఉన్నారు కానీండీ. రాధకి మాత్రం ఇప్పటికీ నా మీద కోపం తగ్గలేదు. 'లక్షణంగా చదువుకుని ఏ ఫారిన్‌లోనో ఉద్యోగం చేసుకుంటూ ఉండాల్సినదాన్ని నీ వల్ల ఇలా అయిపోయాను' అంటుంది. నా మీద పెత్తనం చెలాయిస్తుంది. చస్తే నా మాట వినదు. ఇప్పుడూ అంతే అయింది. వాళ్ళకు ఏదో ప్రోగ్రాం ఉందిట. అనుకోకుండా మధ్యాహ్నం దిగబడిపోయింది. అక్కడికి పిల్లలు వెళ్ళేది కాదుట. అందుకని వీడిని నాకు అప్పజెప్పింది.

'నా పెళ్ళిచూపులు తల్లీ' అని బతిమాలినా విన్లేదు. మరేం ఫర్వాలేదులే. రేపు నీకు పుట్టే బిడ్డని రెండేళ్ళదాకా నేనే పెంచుతాను అని చెప్పింది. ఇంకేం చేస్తాను

మన పోగ్రాం పోస్ట్‌పోన్ చేద్దామనుకుంటే మీ ఇంటి ఫోన్ నంబర్ నా దగ్గర లేదు. అందుకే ఇలా వచ్చాను. మనం మరోసారి తీరిగ్గా మాట్లాడుకుందాం" అన్నాడు.

పద్మకి నవ్వు ముంచుకొచ్చింది. బాబు పాలుతాగి బాటిల్ అవతల పడేసి కూర్చుని బొమ్మలతో ఆట ప్రారంభించాడు.

వాడి బుగ్గలు నిమిరింది పద్మ 'నీ పేరేంటి నాన్నా!" అని అడిగింది.

"తిత్త" అన్నాడు వాడు.

"సిద్ధార్థ ఇంకా రెండో ఏడే. మాటలు పూర్తిగా రావు. ఆ మాట్లాడేవి మనకు అర్థం కావు" అన్నాడు కల్యాణ్.

ఆ తరువాత పద్మతో మాట్లాడాలని పాపం మనస్ఫూర్తిగా ప్రయత్నించాడు కల్యాణ్. పద్మ కూడా సహకరించింది. కానీ సిద్ధార్థతోనే సరిపోయింది ఇద్దరికీ.

చూస్తుండగానే ఎనిమిది అయింది. "ఇక వెళ్తానూ" అంది పద్మ.

"పదండి" అంటూ పిల్లాడి సామాన్లన్నీ సర్దుకున్నాడు కల్యాణ్. ఇద్దరూ బయలుదేరారు.

"నా కారు అన్నయ్య తీసికెళ్ళాడు. నేను ఆటోలోనే వచ్చాను ఆలస్యం అయింది కదా! మిమ్మల్ని డ్రాప్ చేసి వెళ్తాను" అన్నాడు కల్యాణ్.

గేటు దాటేసరికి ఎదురుగా వచ్చి ఆగింది మారుతీ కారు. ముందుసీట్లోంచి దిగింది రాధ. "అమ్మయ్య ఇక్కడే ఉన్నావా? అక్కడ మా ఫంక్షన్‌లో మార్పు జరిగింది. ఎవరో పెద్దాయన సడన్‌గా పోయాడుట. డిన్నర్ క్యాన్సిల్‌చేసి, హై టీతో సరిపెట్టారు" అంది.

"మరీ భాగ్యానికి నా ప్రోగ్రాం అంతా తగలెట్టావు" అన్నాడు కల్యాణ్ కోపంగా.

"ఇది మరీ బావుంది. ఇలా అవుతుందని నేను కలగన్నానా?" అంది రాధ.

"ఈ మాత్రం దానికి కలగనాలా? ఫోన్ చేసి కనుక్కుంటే చెప్పరా? అయినా నా వెర్రిగానీ నీకంత తెలివితేటలుంటే ఇకనేం. ఆ బుర్రలో మెదడు లేదు. మట్టి సుద్ద" అన్నాడు కల్యాణ్.

"నీ కంటే నయమేలే" అని దెబ్బలాటకి దిగింది రాధ.

కారు రోడ్‌పక్కన ఆపి దిగివచ్చాడు శ్రీకాంత్. 'ఇష్! మొదలెట్టారా మీ గోల. పోలీసులు చూశారంటే నక్సలైట్ల గొడవ అనుకుని ఎన్‌కౌంటర్ చేసేస్తారు. కొత్త మనిషిని ఎదురుగా పెట్టుకుని ఏమిటీ గొడవ" అని మందలించాడు.



ఇద్దరూ శాంతించారు. పరిచయ కార్యక్రమం పూర్తి చేశాడు కల్యాణ్.

"పదండి ఎక్కడైనా కూర్చుని ఐస్‌క్రీం తిందాం" అన్నాడు శ్రీకాంత్.

నలుగురూ హోటల్‌కి వెళ్లారు. కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్, ఐస్‌క్రీం తిన్నారు. పద్మని వాళ్లరూమ్ దగ్గర దించారు.

"రండి లోపలికి" అంది రాధతో.

రాధ పద్మ వెంటే వెళ్లింది. రూమ్ తాళం తీసింది పద్మ. ఇద్దరూ లోపలికి వెళ్లారు. నేనూ నా కొలీగ్ కలిసి ఉంటున్నాం. తను ఊరికి వెళ్ళింది అంది పద్మ.

సారీ! ఇవాళ మా వల్ల మీ ప్రోగ్రాం పాడైంది" అంది రాధ.

"ఫర్వాలేదులెండి మీతో నాకు పరిచయం అయిందిగా" అంది పద్మ.

"ఇంతకీ మా లక్ష్మణ స్వామి మీకు నచ్చాడా? నవ్వుతూ అడిగింది రాధ. తడబడింది పద్మ.

"మాది మంచి ఫ్యామిలీ. అత్తయ్యగారికి ఇద్దరూ కొడుకులే కాబట్టి కోడళ్ళనే కూతుళ్లలా చూసుకుంటారు. మావయ్యగారు కూడా చాలా మంచివారు. ఎస్టేట్ లేకపోయినా కాస్తోకూస్తో ఆస్తి కూడా ఉంది. అన్నింటినీ మించి మా కల్యాణ్ చాలా మంచివాడు. అతన్ని పెళ్లిచేసుకున్న అమ్మాయి సుఖపడుతుంది" అంది రాధ.

"మరి మీ మరిదికి నేను నచ్చానా, లేదా అడిగారా?" అంది పద్మ

"ఇందాక మీరు చెయ్యి కడుక్కునేందుకు వెళ్లారు గుర్తుందా, అప్పుడు తన అభిప్రాయం నాతో చెప్పాడు. మీరు అతనికి నచ్చారుట" అంది రాధ.

పద్మ ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది.

"తొందరేమీ లేదు. ఆలోచించుకుని చెప్పండి. ఇక నేను వెళ్తాను" అంది రాధ.

"ఉండండి..." అంటూ అల్మరాలోంచి ఓ ఫైవ్‌స్టార్ చాక్లెట్ తీసి ఇచ్చింది. సిద్ధార్థకి ఇవ్వండి. పిన్ని ఇచ్చిందని చెప్పండి" అంది మెల్లిగా.

ఒక్కక్షణం తెల్లపోయింది రాధ. మరుక్షణం పద్మని ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంది.

*ఈనాడు ఆదివారం, 12 ఆగస్టు 2001*

# అమ్మో! ఆదివారం!!

ఆదివారం వస్తోందంటే నాగుండె పీచు పీచుమంటుంది. 'అదేమిటి? అందరూ ఆదివారం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటే నీకెందుకు భయం?" అంటారేమో. ఎవరి సమస్యలు వారివి. ఆదివారం నాడు కూడా మామూలుగానే తెల్లవారుతుంది. అంతా బద్ధకంగా లేస్తారు. కాస్త ఘనంగా చేసిన ఫలహారం కాస్త ఘనంగానే సేవిస్తారు. అంతవరకూ బాగానే ఉంది. ఆ తరువాత రెండు మూడు గంటల సమయం నాకు గడ్డుకాలం.

మళ్ళీ మధ్యాహ్నం ఒంటిగంట దాటితే ఫర్వాలేదు. సజావుగా సమయం గడుస్తుంది. అందుకే ఆదివారం వస్తోందంటే, బుర్రపాడై అవకతవక పన్లు చేస్తూ అందరిచేత అక్షింతలు వేయించుకుంటూ ఉంటాను.

నేను సతీ సుమతిని కాదుగా! అందుకే తెల్లారింది. స్నానాలూ టిఫిన్లూ అయ్యాయి. పిల్లాడు వాడి దోవన వాడు పోయాడు. మా ఆయన తీరిగ్గా డ్రాయింగ్‌రూంలో కూర్చున్నారు, పేపర్లు ముందేసుకుని. హమ్మయ్య' అనుకున్నాను. కానీ నాకంత అదృష్టమా? "ఇదుగో ఏం చేస్తున్నావ్? ఇట్రా ఆ కాయితాలేవో చూడమని ఒకటే గొడవ చేస్తున్నావు కదా! పదచూద్దాం!" అంటూ శ్రీముఖం రానే వచ్చింది.

కడుపునుంచి దుఃఖం తన్నుకొచ్చింది. కానీ తప్పుతుందా! అందుకే గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేసి పనిమనిషిని పిల్చి పనులప్పగించి, తోటమాలికి కూడా అప్పగింతలు పెట్టి ఆయన వెనకే వెళ్ళాను.

మావారు చూస్తానన్న కాయితాలకు బోలెడంత ఫ్లాష్‌బ్యాక్ ఉంది. మా ఇంట్లో ఫర్నీచరు, పాత సామానూ కలిపి ఒక లారీడు ఉంటే కాయితాలు, పాత పుస్తకాలు మరో లారీడు ఉంటాయి.

నేను కాపురానికి వెళ్లిన ఏడాదికి మా వారికి మొదటిసారి ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ ఆఫీసార్డరు జేబులో పెట్టుకుని రెండు జతల బట్టలు సర్దుకుని వెళ్ళి డ్యూటీలో చేరిపోయారు. ఓ వారం రోజుల తరువాత ఫలానా రోజు వచ్చి నన్ను, నా సంసారాన్నీ తీసుకువెళతాననీ సామానంతా సర్ది ఉంచమని కబురు చేశారు.



పనికిరాని చెత్త అంతా పారేసి సామానంతా సర్దేశాను. మావారికి సంబంధించిన కాయితాలు, ఉత్తరాలు, పుస్తకాలు దగ్గరకొచ్చేసరికి నా పనికి బ్రేకు పడింది. ఏ కాయితం పారేస్తే ఏం గొడవ వస్తుందో ఆయనే చూసుకుంటార్లే అని వదిలేశాను. ఆయన వచ్చాక ఈ కాయితాల విషయం చెప్పాను.

"ఇప్పుడీ హడావిడిలో ఏం చూస్తాను? ఓ పనిచెయ్! ఆ కాయితాలన్నీ అలాగే ఓ అట్టపెట్టెలో వేసి కట్టెయ్ అక్కడికి వెళ్ళాక తీరిగ్గా చూస్తాను" అన్నారు. అలాగే అని ఆ కాయితాలన్నీ ఓ అట్టపెట్టెలో కట్టి మిగిలిన సామాన్లతో బాటు వేగెన్ ఎక్కించాం.

ఆ అట్టపెట్టెడు కాయితాలు అలా వృద్ధిచెంది అరవై అట్టపెట్టెలూ, యాభై గోతాలూ నిండిపోయాయి కానీ ఇంకా వాటికి ముక్తీ మోక్షం కలగలేదు. ఏదో రైల్వే ఉద్యోగం... వెళ్ళడానికి వేగెను ఇస్తారు. వెళ్ళిన చోటల్లా లంకంత కొంప ఇస్తారు. కాబట్టి గోతాలూ పెట్టెలూ వేసుకుని ఊరూరూ తిరుగుతూ రేపు రిటైరు అయ్యాక సొంత ఇంటికి ఈ సామానంతా వేసుకుపోతే ఇంట్లో గోతాలూ పెట్టెలూ సర్దుకుని చెట్టుకింద కాపురం ఉండాల్సిందే.

మరి ఇటువంటి పరిస్థితుల్లో ఆదివారం ఆయన కాయితాలు చూస్తానంటే ఆనందించక ఏడుస్తుందేం ఈవిడ అనే సందేహం వస్తుంది ఎవరికైనా ఏమిటి? ఏం చెప్పను?

"ఎక్కడున్నావ్? ఎంత పిల్చినా రావేం? అయినా సంపూర్ణ భారతదేశ తీర్థయాత్రలకు వెళ్తున్నట్లు ఏమిటా అప్పగింతలు?" అని కేకేశారు. వెంటనే పరిగెట్టాను. అప్పటికే మా కాయితాల గదిలో నడిమధ్యన ఓ నాలుగు గోతాల కాయితాలు విప్పి కుప్పబోసి 'సురభి' కార్యక్రమంలో ఉత్తరాల మధ్య కూర్చున్న సిద్ధార్థకక్‌లా మధ్యన కూర్చుని ఉన్నారు. నేనూ వెళ్ళి రేణుకాసహానీలా కూర్చున్నాను.

"ఏమిటీ చెత్త అంతా! ఎప్పటికప్పుడు ఇవన్నీ చూసి పారేస్తే ఎంత బాగుంటుంది?" అన్నారు మందలింపుగా.

అసలే బండెడు పని ముందు పెట్టుకుని వాదిస్తూ కూర్చుంటే ఎలా? అందుకే నోరుమూసుకుని ఊరుకున్నాను.

ఓ పదినిమిషాల పాటు దుమ్ముదులిపి కాయితాలు చూడ్డం మొదలు పెట్టారు. "ఇవి పనికిరావు" అంటూ ఓ దస్తాడు కాయితాలు నలిపి ఉండలు చేసి విసిరేశారు. "ఇవి కావాలి" అంటూ ఓ రెండు దస్తాలు ఓ పక్కన పెట్టారు.

'ఇదేమిటి' అంటూ ఓ పాత ఉత్తరం తీశారు. 'అరె ఇది మా రామానందం రాసింది" అన్నారు ఇంత మొహం చేసుకుని.

"ఏం రామానందం" అని అడిగాను.

"అదేనోయ్" నా క్లాసుమేటు కమ్ బెస్ట్ ఫ్రెండ్ మొన్న మన పెళ్లికి రాలేదూ! నీకు పరిచయం కూడా చేసేను. అప్పుడే మర్చిపోయావా?" అన్నారు.

ఆయనకి గతం అంతా మొన్న భవిష్యత్తు అంతా రేపు. లేకపోతే మొన్న మన పెళ్ళికి రావడం ఏమిటి నా తలకాయ! ఏనాటి మాట! మా అమ్మాయి పెళ్ళయి అయిదేళ్ళవుతుంటే?

"పాపం ఎంత ఆప్యాయంగా ఉండే వాడు వెర్రిసన్నాసి. పెళ్ళికి వాడొచ్చాడు కానీ వాడి పెళ్ళికి వెళ్ళడానికి కుదరలేదు నాకు. సమయానికి ఏదో అర్జెంటు పని తగలడింది ఆఫీసులో. ప్చ్... ఏం చేస్తాం? ప్రాప్తం ఉండాలి దేనికైనా! పాపం తాడేపల్లిగూడెంలో ఉన్నాడు. ఇందులో అడ్రస్ కూడా ఉంది. ఓ ఉత్తరం ముక్క రాస్తాను. ఎలా ఉన్నాడో ఏమిటో?" అంటూ ఆ కార్డు పుచ్చుకుని లేచారు.

"బాబ్బాబు తరువాత రాద్దురుగాని ఉత్తరం" అని కాళ్ళావేళ్ళా పడినా వినరు. కాబట్టి తెలివి తేటలుపయోగించి "అదికాదండీ! ఇది మరీ పాత ఉత్తరం. ఎప్పుడో డెబ్భైలో రాసిన ఉత్తరం ఇది. ఎనభైలో మరొకటి రాసినట్టు గుర్తు. అందులో చిలకలూరిపేటలో ఉన్నట్లు రాశాడు పాపం. ఆ ఉత్తరం కూడా ఉంది. అది కనబడితే అప్పుడు రాయండి!" అన్నాను.

"ఏమిటో!" అని మళ్ళీ కూర్చున్నారు కాయితాల గుట్ట మధ్య. అమ్మయ్య ఆపద గడిచింది. కానీ ఏం లాభం?

పోలీ పోలీ నీ భోగం ఎన్నాళ్ళు అంటే మా అత్త సంతనించి వచ్చిందాకా అందింట వెనకటికి ఎవర్తో.

మా ఆయనకి ఓ పాత శుభలేఖ కనిపించింది. "ఇందులో ఇటుచూడు రావి నూతల రాజశేఖర్రావుగారంటే ఎవరూ?" అని అడిగారు హఠాత్తుగా.

ఎవరో ఓ పట్టాన గుర్తు రాలేదు. బుర్రబద్దలు కొట్టుకుని గుర్తుతెచ్చుకున్నాను. మీ పినతండ్రి కొడుకు భార్యకి మేనమామ అన్నాను. ఆయనా కాసేపు ఆలోచించి గుర్తుతెచ్చుకున్నారు. అవును కదూ? మొన్న మా తమ్ముడి గృహప్రవేశంలో కనిపించి వాళ్ళ అబ్బాయికి మంచి సంబంధం చూడమని చెప్పాడు. మన రామక్రిష్ణగారు



లేరూ... ఏదీ మన బాస్ రామక్రిష్ణగారు, ఆయన తమ్ముడి కూతురు గురించి చెప్పాను. తీరా చూస్తే గోత్రం ఒకటై పోయింది. పాపం గుర్తు పెట్టుకుని శుభలేక పంపేడు. ఎంత ప్రేమో చూడు. దూరం అయిపోయింది. లేకపోతే పెళ్లికి వెళ్ళేవాళ్ళం. పోనీ ఓ ఉత్తరం అయినా రాశామా?" అని అడిగారు.

"లేదు" అన్నాను.

"ఇందుకే నాక్కోపం వచ్చేది. నేనేదో పన్లలో ఉంటాను. నువ్వైనా రాయొచ్చుగా బద్దకం వదిలించుకుని" అన్నాడు.

ఎలా రాయను పెళ్లైన పదిరోజులకు అందింది శుభలేఖ అన్నాను.

"మన అడ్రస్ మారిపోయిందిగా, అందుకే ఆలస్యం అయివుంటుంది. ఏది ఏమైనా వాళ్ళు గుర్తుంచుకుని కార్డు పంపితే మనం ఊరుకుంటే ఏం బావుంటుంది? కారణాంతరాల వల్ల రాలేక పోయాం. చిరంజీవులకు మా ఆశీస్సులు అని ఓ ముక్క రాసి పడేస్తా" అని మళ్ళీ లేచారు.

"ఎప్పుడో ఏడేళ్ళ కిందట పెళ్ళయిపోయింది. ఇప్పుడు ఆశీస్సులు అని రాస్తే ఏం బాగుంటుంది వద్దులెండి" అన్నాను.

ఓసారి బరువుగా నిట్టూర్చి ఆ శుభలేఖను అవతలపడేశారు. హమ్మయ్య మరో గండం గడిచింది.

మరో అరగంట సార్టింగ్ సాగింది. ఇవాళ ముహూర్తం బాగానే ఉంది. దాదాపు ఓ బస్తాడు చెత్త వదిలిందని ఆనందపడ్డాను.

"ఇదుగో దొరికింది. దీనికోసం వెతికి వేసారి పోతున్నాను" అన్నారు. దివిటీలా వెలిగిపోతున్న వదనంతో.

"ఏవిటది?" అని అడిగాను.

"బ్రహ్మాండమైన ఆఫర్!" అంటూ వివరాలు చెప్పారు. ఇంటి అలంకరణ మీద అద్భుతమైన మాసపత్రిక ఉందిట. అది చదివి ఇంటిని బ్రహ్మాండంగా అలంకరించుకోవచ్చుట. ఆ పత్రికకి మూడేళ్ళ చందా వెయ్యీ తొమ్మిదొందలు కడితే ఇంకో పుస్తకం ఉచితంగా ఇస్తారుట. మీ కారు జీవితం పెంచుకోండి" అనే ఆ పుస్తకం విలువ నాలుగొందల తొంబై తొమ్మిది రూపాయలట.

నా కడుపులోంచి దుఃఖం తన్నుకొచ్చింది. మావన్నీ గవర్నమెంటు వారి క్వార్టర్స్ ఏనాడో మొఘల్ రాజుల కాలంలో కట్టినవి. వారిని వెళ్ళగొట్టి బ్రిటీష్‌వారు స్వాధీనం

చేసుకున్నారు. వారిని తరిమికొట్టి భారతదేశం గవర్నమెంటు స్వాధీనం చేసుకుంది. వయోభారం వల్ల బాగా కృశించిపోయాయి. ఎండలకీ వానలకీ తట్టుకోలేవు. కాస్త గట్టిగా మాట్లాడితేచాలు. సున్నం పెళ్ళలు ఊడి పడిపోతాయి. వాటి రిపేరు తలకు మించిన పని కాబట్టి వదిలేశారు. ఏ అయిదేళ్ళకో ఓసారి సున్నాలు కొడతారు. దాంతో కుర్రవేషం వేసుకున్న డెబ్భైఏళ్ళ హీరోలా తాత్కాలికంగా ఓ మెరుపు మెరిసినా అసలు రంగు బయటపడి యథారూపం దాలుస్తాయి.

ఇలాంటి ఇంటిని ఆ ఫారిన్ పుస్తకం చదివి నేనేం అలంకరించను?" ఆ మాటే అన్నాను. ఆ మ్యాగజైన్ చదివి అర్థం చేసుకుంటే రేపు రిటైరు అయ్యాక సొంత ఇంటిని అలంకరించుకోవచ్చు అదీగాక బ్రహ్మాండమైన పుస్తకం ఉచితంగా ఇస్తున్నారు. అదింట్లో ఉంటే మన కారును మనమే బాగు చేసుకోవచ్చు. మెకానిక్ దగ్గరికి పరిగెఏట్ట పనే వుండదు. అసలా పుస్తకం చదివి మెయిన్‌టేన్ చేస్తే కారుకి రిపేర్లే రావుట!" అన్నారు.

"అంతా బాగానే వుంది. మనకు కారేదీ?" అడిగాను.

"కారుదేముందోయ్ రేపీపాటికి కొనేస్తాను. కారు కొనేదాకా ఈ ఆఫరుంటుందా? వచ్చే నెల రెండో తారీకు లాస్ట్ డేట్. మళ్ళీ బద్ధకమయిపోతుంది. లెటర్ రాసి పడేస్తా!" అని లేచారు. ఇక ఆగరు.

"పోనీ ఈ కాయితాలు నేను చూడనా అన్నాను అపనమ్మకంగానే.

ఇంకా నయం నీకు పెత్తనం ఇస్తే నా డిగ్రీ సర్టిఫికెట్ కూడా అవతల పారేస్తావు. నీ వల్ల కాదులే. అవన్నీ అలాగే ఉంచెయ్ రేపాదివారం చూస్తాను అని వెళ్ళిపోయారు. నాకు తెలుసా విషయం, ఇల్లు నా పేర రాయమన్నా రాస్తారుగానీ ఈ కాయితాలు మాత్రం నమ్మి నా చేతుల్లో పెట్టరు.

ఈ కాయితాలన్నీ మళ్ళీ గోతాలకి ఎత్తే సరికి టైఫాయడ్ వచ్చినంత పనైంది నాకు. తుమ్మి తుమ్మి ముక్కు వాచిపోయింది. తల భారంగా అయిపోయింది.

మిగిలిన చెత్త అంతా ఓ పక్కన పోగు పెట్టాను. పనిమనిషిని కాకా పట్టి, కాఫీ కలిపిచ్చి ఈ చెత్త శుభ్రం చేయించాలి. ఆ పని కూడా ముగించి పన్లో పని నేనూ కాసింత కాఫీ కలుపుకుని వచ్చి కుర్చీలో కూలబడ్డాను.

"ఇదుగో ఏం చేస్తున్నావ్?" అంటూ పిల్చారాయన. తప్పుతుందా? లేచి వెళ్లాను. గదిలో దృశ్యం చూసేసరికి మళ్ళీ గుండె జారిపోయింది. ఆదివారం రెండో గండం ఇది పుస్తకం కంపెనీకే ఉత్తరం రాయడం పూర్తయింది కాబోలు!



మంచం మధ్యలో మఠం వేసుకుని కూర్చున్నారు. ఎదురుగా శనివారం పేపరు ఎదురుగా టి.వి.లో ప్రోగ్రాం వస్తోంది. "ఇదిగో ఈ హీరోయిన్ పేరేవిటో త్వరగా చెప్పు పేరులోని పొడి అక్షరాలు కూడా ఏడు నిలువులో రాసుకోవాలిట" అన్నారు. నేను చూద్దామని ప్రయత్నిస్తూ ఉండగానే దృశ్యం మారిపోయి యాంకర్ వచ్చేసింది.

"ఏవిటో చెప్పు" అన్నారు. "ఏదీ నేను చూళ్ళేదు" అన్నాను భయంగానే. 'ఛ్ఛ ఎక్కడో ఉంటావు. పిలిస్తే ఓ పట్టాన రావు" అని విసుక్కున్నారు.

ఈ పజిల్ నింపే పిచ్చి ఒకటి ఏదో తన రోజుల్లో ఉండే తారలు జమున, సావిత్రి, షావుకారు జానకి తప్పించి తరవాతి వాళ్ళెవరూ ఆయనకి తెలియదు. నన్ను సాయం అడుగుతారు. నాకు మాత్రం ఏం తెలుసు నా మొహం? నేనేమైనా ఆంధ్రదేశంలో కాపురం ఉండి సినిమాలు చూస్తుండి పోయానా? పెళ్లైన దగ్గర్నుంచీ ఆయన వెంట దేశం అంతా తిరుగుతూనే ఉన్నాను. అప్పటికీ నాకు తెలిసిని నా రోజుల తారలు వాణిశ్రీ, చంద్రకళ వస్తే గుర్తుపట్టి చెప్తాను. ఇద్దరం కలిసి తంటాలు పడ్డా ఏనాడూ నాలుగైదు గళ్ళు తప్ప నిండవు.

ఆ భాగ్యానికి ఎందుకొచ్చిన తాపత్రయం అంటే వినరు. ఎలాగైనా పజిల్ మొత్తం నింపాలని అత్యాశ. దాంతో ఒంటి గంట దాకా తను కదలరు. నన్ను కదలనివ్వరు. పైగా అల్లాటప్పా వ్యవహారంలా చూడ్డానికి వీల్లేదు. శ్రద్ధగా చూడాలి.

"ఇదిగో ఈ హీరోయిను మొన్న ఆదివారం వచ్చిన సినిమాలో ఆ హీరోతో వేసింది కదూ!" అంటారు. వెతికి చూసినా సర్వనామాలు తప్పించి నామవాచకం లేని ఆ వాక్యం ఆధారంగా నేనేం కనిపెట్టగలను?

అందుకే గుడ్లప్పగించి టీవీ చూస్తూ కూర్చుని ఆయనడిగే ప్రశ్నలకు సమాధానాలు వెతికే వ్యర్థ ప్రయత్నాలు చేస్తుంటాను. ఒంటిగంట దాకా అలాగే డేరా మేకులా కూర్చుని, అప్పుడు లేచి వంటా వార్పూ చూసుకోవాలి.

అందుకే ఆదివారం వస్తోందంటే నాకు అమితమైన భయం.

*ఈనాడు ఆదివారం, 31 డిసెంబరు 2000*

✧